జనవరి 2020

165

సంపుటి : 14 సంచిక : 9

వెల రు. 10/-

## ఈ సంచికలో........

జనవరి 8 సమ్మె ఎందుకు?

బడా పెట్టుబడిదారుల లాభాలకోసమే లేబర్ కోడ్‌లు

సార్వత్రిక సమ్మె ప్రాధాన్యత

జనవరి 8న గ్రామీణ బంద్

కార్మికుల డిమాండ్ల సాధనే ప్రధాన లక్ష్యం

సమ్మెలో సకల కార్మికవర్గం

కార్మిక హక్కుల హరణం: వ్యవసాయరంగానికి ప్రమాదం

సిఎఎ-ఎన్ఆర్‌సి వెనుక ఆర్ఎస్ఎస్ ఎజెండా

తాష్కెంట్‌లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ మొదటి శాఖ


# తాష్కెంట్‌లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ మొదటి శాఖ

తాష్కెంట్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన అక్టోబర్ 17,1920 తేదీని భారత కమ్యూనిస్టు పార్టీ అవిర్భావదినంగా పరిగణించి, ఏడాది పొడుగునా శతవార్షికోత్సవ వేడుకలకు సి పి ఐ (ఎం) పిలుపు ఇవ్వడంతో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన తేదీపై చర్చ పునఃప్రారంభమయింది. 1925, డిసెంబరు 26వ తేదిన కాన్పూర్‌లో కమ్యూనిస్టు మహాసభ జరిగిన తేదీనే కమ్యూనిస్టు పార్టీ అవిర్భావ దినంగా సి పి ఐ భావించడం మనకందరకూ తెలిసిన విషయమే. 1920 అక్టోబర్ 17న తాష్కెంట్‌లో సమావేశం జరగడం, ఆ తరువాత భారతదేశంలో వివిధ కమ్యూనిస్టు గ్రూపులు ఏర్పడడం, అవన్నీ ఒకదానితో మరొకటి సంబంధాలు పెట్టుకోవడం గురించి ఇంతకుముందటి వ్యాసాలలో తెలుసుకున్నాము. 1925లో కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ మహాసభ జరగడం గురించిన వివరాలు కిందటి సంచికలో చూసాం.

తొలిరోజుల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ఎలా ఉండేదో పాఠకులకు ఈ పాటికి ఒక అవగాహన ఏర్పడి ఉంటుంది. 1920లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ శతవార్షికోత్సవాలకు సి పి ఐ(ఎం) పిలుపునిచ్చిన సందర్భంలో 1925, డిసెంబరు 26వ తేదీనే ఎందుకు సరైన అవిర్భావ దినంగా పరిగణించవలసి ఉంటుందని తాను భావిస్తున్నదో సిపిఐ మళ్లీ వివరించింది.

న్యూఏజ్ పత్రిక సంపాదకుడు, పార్టీ కార్యదర్శి బినోయ్ విశ్వం ఒక వ్యాసం వ్రాస్తూ ఈ వాదనను సమర్ధించుకున్నారు. పార్టీ అవిర్భావ తేదీ గురించి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఒక అవగాహనకు వచ్చిన తీరును ఆయన ఆ వ్యాసంలో వివరించే ప్రయత్నం చేసారు. 1925 డిసెంబర్ 26వ తేదీ కమ్యూనిస్టు పార్టీ అవిర్భావ దినంగా ఉంటుందని 1959 ఆగస్టు నెలలో జరిగిన కార్యదర్శివర్గం ప్రకటించిందని చెప్పారు. అవిర్భావదినం చర్చ వచ్చినప్పు డల్లా వారి నాయకులు దీనిని పదేపదే ఉటంకిస్తున్నారు.

1925లో కాన్పూర్ మహాసభ జరిగిన రోజును కమ్యూనిస్టు పార్టీ అవిర్భావ దినంగా సిపిఐ పరిగణిస్తున్నదనేది వాస్తవం. అయితే



అమీర్ హైదర్‌ఖాన్

అంతకు ముందు ఉమ్మడి అవగాహన కుదరని అనేక రాజకీయ, సైద్ధాంతిక సమస్యలను 1964లో సిపిఐ(ఎం) ఏర్పడిన తరువాత పునః పరిశీలించి నిర్ణయించుకున్నట్టే దీనినీ నిర్ణయించడం జరిగింది. ఉదాహరణకి పార్టీ చరిత్రలో మొదటిసారిగా ఒక నిర్దిష్టమైన కార్య క్రమాన్ని సిపిఐ(ఎం)1964లో జరిగిన తన ఏడవ మహాసభలో ఆమోదించింది. సిపిఐ కూడా తన కార్యక్రమాన్ని అదే సంవత్సరం వారి ఏడవ మహాసభలో ఆమోదించుకుంది. పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, సిపిఐ(ఎం) మొదటి కేంద్రకమిటీకి ఎన్నికైన కామ్రేడ్ ముజఫర్ అహ్మద్ ప్రయత్నాలే భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడటంపై చర్చ మళ్ళీ ముందుకు రావడానికి ప్రధాన కారణం.

చరిత్ర పునఃపరిశీలనలోకి లోతుగా వెళ్లకపోయినా,తాష్కెంట్ సమావేశానికి సంబంధించి నమోదు చేయబడిన డాక్యుమెంట్లు దొరకడమే కమ్యూనిస్టు పార్టీ అవిర్భావ తేదీ గురించి పునః పరిశీలించడానికి ముఖ్యమైన కారణం. కురుక్షేత్ర విశ్వవిద్యాలయంలో చరిత్ర రీడర్‌గా పనిచేస్తున్న డాక్టర్ దేవేంద్ర కౌశిక్ తాష్కెంట్‌లో పరిశోధన నిమిత్తం మూడేళ్లున్నారు. సిపిఐ ఏర్పాటుకు సంబంధించిన కొన్ని ప్రాచీన పత్రాలు ఉజ్బెకిస్తాన్ రాజధాని తాష్కెంట్‌లోని కమ్యూనిస్టు పార్టీ అఫ్ ఉజ్బెకిస్తాన్ పురాతన పత్రాలలో ఆయనకు లభ్యమయాయి. అప్పటివరకు తాష్కెంట్‌లో సమావేశం జరిగిందని తెలుసుగాని జరిగిన తేదీ ఎవరికీ తెలియదు. ఎంఎన్ రాయ్ కూడా తన జ్ఞాపకాలలో ఖచ్చితమైన తేదీని ఇవ్వలేదు. తాష్కెంట్ సమావేశం రికార్డులు, మినిట్స్ దొరికిన తరువాత కమ్యూనిస్టు పార్టీ మొదటి శాఖ ఏ విధంగా ఏర్పడిందన్న వివరాలు వెల్లడయ్యాయి. ఆ గ్రూపు కమ్యూనిస్టు స్వభావాన్ని ప్రశ్నించాల్సిన పనిలేదు. ఆ శాఖను ప్రారంభించిన ఎం ఎన్ రాయ్ మెక్సికో కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధిగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ మహాసభలో పాల్గొన్నారు. అక్కడ జాతీయత, వలసవాద సమస్యలపై జరిగిన చర్చలలో ప్రముఖమైన పాత్ర పోషించారు. తాష్కెంట్ కేంద్రంగా ఉన్న కేంద్ర ఆసియా బ్యూరో సభ్యునిగా నియమించబడ్డారు. ఆ హోదాలోనే ఆయన తన భార్య, కమ్యూనిస్టు అయిన ఎవెలిన్ ట్రెంట్ రాయ్‌తో కలిసి తాష్కెంట్ వెళ్లారు. ఆ తరువాతి కాలంలో ఎంఎన్‌రాయ్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఎక్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. రెండు మహాసభల మధ్య కాలంలో కొమింటర్న్ పనిని ఈ కమిటీయే పర్యవేక్షిస్తుంది. కొమింటర్న్‌లో ఇంత కీలకమైన బాధ్యతలలో ఉన్న వ్యక్తి తాష్కెంట్‌లో ఉన్న ముహాజిర్లలో పనిచేస్తూ వారిని కమ్యూనిస్టు పార్టీలోకి తీసుకు రావటానికి కృషిచేశారు.

బెర్లిన్‌లో ఉన్న భారత విప్లవకారులు కొందరు 1921లో మాస్కోను సందర్శించారు. ప్రముఖ స్వతంత్ర పోరాటయోధురాలు, సరోజినీ దేవి అన్న వీరేంద్రనాథ్ చటోపాధ్యాయ వారికి నాయకత్వం వహించారు. ఆయనకి అయన గ్రూపు సభ్యులకు స్వతంత్రం రాక ముందు భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించడంలో ఆసక్తి లేదు. భారతీయ విప్లవ కారుల బోర్డుకి కొమింటర్న్ సహాయమందించాలని వారు కోరుకున్నారు. వారుతాష్కెంట్‌లో ఏర్పడిన పార్టీని రద్దు చేసి, దానిని "కమ్యూనిస్టు ఇంటర్నే షనల్ నుండితొలగించాలని" డిమాండ్ చేశారు.

వారి వాదనలను, ఎంఎన్ రాయ్ వాదనలను కొమిన్‌టర్న్ విన్నది. తమ దేశానికి స్వాతంత్ర్యం సంపాదించడం కోసం ఐక్య వేదికలో కలిసి పనిచేసినా, వలస దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలకు స్వతంత్ర ఉనికి ఉండాలనేది కొమిన్‌టర్న్ అవగాహన అయినందువలన, బెర్లిన్ గ్రూప్ వాదనలను కమిటీ తోసిపుచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీగా లేక విదేశాలలోని భారత కమ్యూనిస్టు పార్టీగా తాష్కెంట్ గ్రూపుకిచ్చిన

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...

[redacted]


5. జనవరి 8న గ్రామీణ బంద్
విజూ కృష్ణన్..................... 15

6. కార్మికుల డిమాండ్ల సాధనే ప్రధాన లక్ష్యం
సిహెచ్ నరసింగరావు ........... 20

7. సమ్మెలో సకల కార్మికవర్గం
ఎం ఎ గఫూర్...................... 22

8. కార్మిక హక్కుల హరణం: వ్యవసాయరంగానికి ప్రమాదం
ఎ కోటిరెడ్డి........................ 24

9. సిఎఎ-ఎన్ఆర్సి వెనుక ఆర్ఎస్ఎస్ ఎజెండా
ఎస్. వెంకట్రావు ................. 26



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


[redacted]

రోజున కార్మిక సమ్మెకు మద్దతుగా గ్రామీణ బంద్ నిర్వహించనున్నది.

దేశం ఆర్థిక మాంద్యంలో కూరుకుపోతుంటే సంఘటిత, అసంఘటిత రంగంలోని అనేక ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. లక్షల సంఖ్యలో కార్మికులను ఉద్యోగాలనుండి తీసేసి ఇళ్లకు పంపేస్తున్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే, మరోవైపు ఉపాధికోల్పోతున్న కార్మికవర్గం తీవ్రమైన ఇక్కట్లపాలవుతున్నారు. ఆర్థిక మాంద్యం పేరుతో కార్పొరేట్లకు ఖజానానుండి 1.45 లక్షల కోట్ల రూపాయల రాయితీలు ప్రకటించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల ఉద్యోగ రక్షణ, ఉపాధి భత్యం కింద ఒక్క నయాపైసా కూడా ఖర్చుచేయలేదు. కార్పొరేట్‌లకు మాత్రం బ్యాంకు రుణాలు, ఇతర మార్గాల ద్వారా ఇంకా, ఇంకా దోచిపెడుతోంది. ఖాళీగా ఉన్న ప్రభుత్వోద్యోగాల్లో నియామకాలు చేపట్టడం, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయడం, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం, ఉపాధి హామీ చట్టం, వ్యవసాయం, చేతివృత్తులకు నిధులు కేటాయించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెంచి, దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపుతీసుకురావడానికి ప్రభుత్వం ఒక్క చర్య కూడా చేపట్టలేదు. పైగా కార్పొరేట్‌లు, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం కార్మిక చట్టాలను రద్దుచేసి వారికి ఎటువంటి రక్షణ కల్పించని కోడ్‌లు ప్రవేశపెడుతోంది.

ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక చర్యల వల్ల ఏర్పడిన అసంతృప్తిని పక్కదోవ పట్టించేందుకు నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం దేశ ప్రజలను మతాలవారీగా, ప్రాంతాల వారీగా చీల్చేందుకు ప్రయత్నిస్తోంది. జమ్మూ-కాశ్మీర్‌ను మూడు ముక్కలుగా చేయడం, 370వ అధికరణం రద్దు, రామజన్మభూమి వంటి వివాదాస్పద సమస్యలను లేవనెత్తడం, తాజాగా మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం-2019, ఎన్ఆర్సిని దేశమంతటా అమలు చేయడానికి ప్రయత్నించడం కూడా ఈ విచ్ఛిన్నకర వ్యూహంలో భాగమే.

"సమ్మెలు, కార్మికులకు ఐక్యం కావడాన్ని నేర్పుతాయి. తాము ఐక్యంగా ఉంటేనే పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడగలమని వారికి తెలియజెప్పుతాయి. మొత్తం ఫ్యాక్టరీ యజమానుల వర్గానికి వ్యతిరేకంగా, ఏకపక్ష పోలీసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొత్తం కార్మిక వర్గం పోరాడాలన్న ఆలోచనను సమ్మెలు కార్మికులకు నేర్పుతాయి...మొత్తం ప్రజానీకాన్ని, శ్రమజీవులందరినీ ప్రభుత్వాధికారుల కబంధ హస్తాలనుండి, పెట్టుబడి పీడననుండి విముక్తి చేయడానికి శత్రువుపై పోరాడ్డం ఎలాగో కార్మికులు నేర్చుకునే పాఠశాల సమ్మె"... అని తొలి సోషలిస్టు విప్లవ రథసారధి లెనిన్ పేర్కొన్నాడు. అందువల్ల జనవరి 8వ తేదీ సమ్మెద్వారా భారత దేశంలోని యావత్ కార్మికవర్గం ఏకమై కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి.


### చందా వివరాలు

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

[redacted]

# జనవరి 8 సమ్మె ఎందుకు?

**కె హేమలత**



రచయిత సిఐటియు అఖిలభారత అధ్యక్షురాలు

**మో**డి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా డిసెంబరు నెల మొత్తం ఆందోళనలు కొనసాగించాలని, 2020 జనవరి 8వ తేదీన దేశవ్యాపితంగా జరగనున్న సార్వత్రిక సమ్మెకు విస్తృత ప్రజామద్దతును సమీకరించాలని సిపిఐ(ఎం) పిలుపునిచ్చింది. జాతి సంపదగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నది సమ్మెకు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లలో ఒకటి. మాంద్యం చుట్టుముడుతున్న ప్రస్తుత పరిస్థితులలో మరింత తీవ్రం అవుతున్న నిరుద్యోగం, కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కార్మిక చట్టాలలో సవరణలు చేయటం, ఉద్యోగాలు చేస్తున్నవారు ఎపుడు ఉద్యోగాలు కోల్పోతామో తెలియక పడుతున్న ఆందోళన తదితర అంశాలను కార్మికసంఘాలు ప్రధానంగా లేవనెత్తుతున్నాయి.

2019 సెప్టెంబరు 30వ తేదీన 10 జాతీయ కార్మికసంఘాల ఐక్యవేదిక జరిపిన బహిరంగ ప్రజా సదస్సు 2020 జనవరి 8వ తేదీన సార్వత్రిక సమ్మె జరపాలని పిలుపునిచ్చింది. ఈ సదస్సులో దాదాపు జాతీయస్థాయి స్వతంత్ర ఫెడరేషన్లన్నీ పాల్గొన్నాయి. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి వేలాది మంది కార్మికులు ఈ సదస్సులో పాల్గొన్నారు. గతం నుంచి జరుగుతున్నట్లుగానే బిఎంఎస్ ఈ సదస్సులో పాల్గొనలేదు.

వరసగా రెండవసారిఅధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికవర్గంలో పెరుగుతున్న ఆగ్రహాన్ని జాతీయస్థాయిలో వ్యక్తం చేస్తున్న మొదటి ఐక్య ప్రతిఘటన ఇది. రెండవసారి అధికారంలోకి వచ్చి మోడి ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికలలో లభించిన విజయాన్ని నయా ఉదారవాద విధానాలను మరింత వేగంగా అమలు చేయటానికి ప్రజల ఆమోదమని పొరపాటుగా అర్థం చేసుకొంటున్నది. ప్రజల అభిమతాన్ని గురించి పూర్తిగా పొరపాటు భావనలో ఉన్నట్లు ఈ సమ్మె ప్రభుత్వానికి స్పష్టం చేస్తుంది.

తమ జీవన పరిస్థితులపైనా, జీవనాధారాలపైనా నయా ఉదారవాద విధానాల ప్రతికూల ప్రభావాలకు వ్యతిరేకంగా భారత కార్మికవర్గం, కష్టజీవులు నిరంతరం పోరాటాలు చేస్తున్నారు. 28 సంవత్సరాల క్రితం మనదేశంలో నయా ఉదారవాద విధానాల అమలు ప్రారంభమైన తర్వాత జరుపుతున్న 19వ సార్వత్రిక సమ్మె ఇది. ఆ విధానాల దుష్ప్రభావాలకు వ్యతిరేకంగా కార్మికులు పట్టువిడవకుండా చేస్తున్న పోరాటాలను ఈ సమ్మె ప్రతిబింబిస్తున్నది. ఈ పోరాటాలతో పాటు అనేక రంగాలలో లెక్కలేనన్ని పోరాటాలు జరిగాయి.

మనదేశంలో నయా ఉదారవాద విధానాల అమలును అధికారికంగా కాంగ్రెస్‌పార్టీ ప్రారంభించినప్పటికీ, బిజెపి ప్రభుత్వం వాటిని మరింత తీవ్రంగా, మరింత పట్టుదలతో అమలు చేస్తున్నది. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను హరించటానికి, కార్పొరేట్లకు ప్రయోజనం కలిగించే విధంగా పార్లమెంటులో చట్టాలనుఆమోదించుకోవటానికి పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలు కలిసి వ్యవహరించటానికి ఏ మాత్రం సందేహించటం లేదు. పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు, ఈ మధ్యనే ఆమోదించిన వేతనాల కోడ్ బిల్లు అందుకు రెండు ఉదాహరణలు మాత్రమే.

మోడి ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు జరిపిన విధానాల ఫలితంగా పెరుగుతున్న నిరుద్యోగం, కార్మికవర్గ మౌలిక హక్కులను హరించే విధంగా కార్మిక చట్టాలకు సవరణల కోసం చేస్తున్న ప్రయత్నాలు, తీవ్రమౌతున్న వ్యవసాయ సంక్షోభం, చిన్న, మధ్యతరగతి ఉత్పత్తిదారులు, అసంఘటిత రంగంపై నోట్లరద్దు, జిఎస్‌టి వినాశకర ప్రభావం తదితరాలతో అసంతృప్తి తీవ్రమైంది. ఆ ప్రభుత్వ ఐదుసంవత్సరాల పాలనాకాలంలో 2015 సెప్టెంబరు 2న, 2016 సెప్టెంబరు 2న, 2019 జనవరి 8-9 తేదీలలో దేశవ్యాప్తంగా ఐక్యంగా భారీసంఖ్యలో కార్మికులు పాల్గొన్న మూడు సార్వత్రిక సమ్మెలు జరిగాయి.

**ఐక్య పోరాటాలకు బిఎంఎస్ విద్రోహం**

వాస్తవంగా మోడి ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాల అమలును వేగవంతం చేయటం, కార్మికచట్టాలను సవరించటం కోసం ప్రయత్నాలు ప్రారంభించటం తదితరాలతో కార్మికులలో భ్రమలుతొలగిపోవటం ప్రారంభమైంది. ఆనాడు కార్మిక సంఘాల ఐక్యవేదికలో భాగస్వామిగా ఉన్న బిఎంఎస్ మోడి ప్రభుత్వానికి కనీసం ఒక సంవత్సర సమయం ఇవ్వాలని భావించటంతో ఆ సంఘాన్ని కూడా కలుపుకురావటం కోసం కార్మికసంఘాల ఐక్యవేదిక సంవత్సర కాలానికి పైగా వేచి చూసింది. ఈ విధంగా అవకాశం ఇచ్చినా, 2015 సెప్టెంబరు 2వ తేదీ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన సంఘాలతో కలిసి ఉన్నప్పటికీ, సమ్మెకు కొద్ది రోజుల ముందు బిఎంఎస్ ఐక్యవేదికను వీడి వెళ్ళిపోవటం ప్రస్తుతం చరిత్రగా ఉన్నది. అప్పటి నుండి బిఎంఎస్ కార్మికులతో ఉన్నట్లు నటిస్తూ, ప్రభుత్వంతో కలిసి వ్యవహరిస్తున్నది. ఆర్ఎస్ఎస్ పట్ల ఆ సంఘం తన విధేయతను కొనసాగిస్తున్నది. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ ఈ సంవత్సరం విజయదశమి నాడు చేసిన ప్రసంగంలో ఆర్థికమాంద్యాన్ని పరిష్కరించటానికి మోడి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాటు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను గట్టిగా బలపరిచాడు. కార్మికులలో తన పునాదిని కాపుడుకోవటం కోసం కార్మికహక్కుల కోసం పోరాడే మొనగాడుగా

బిఎంఎస్ ఫోజు పెడుతున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటానికి సన్నద్ధమైన తర్వాత, పోరాట ప్రారంభానికి ముందు ఆ సంఘం పోరాటం నుండి పక్కకు తొలుగుతున్నది. కార్మికవర్గంలో గందరగోళాన్ని సృష్టించటం, ఐక్య పోరాటాలను బలహీనపరచటం కోసమే బిఎంఎస్ ఈ ఎత్తుగడలను అనుసరిస్తున్నది.

రోజువారీగా ఎదుర్కొనే సమస్యలైన ఉద్యోగాలు, వేతనాలు, ఆదాయాలు, సామాజిక భద్రత, తదితరాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించటం ద్వారా పార్లమెంటు ఎన్నికల సమయంలో బిజెపి వారిని తప్పుదారి పట్టించింది. ప్రజలలో ఉన్న నిజమైన దేశభక్తి భావాలను వినియోగించుకొని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి, దానిని తన రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకొన్నది. బిజెపి ప్రభుత్వం గతం కన్నా ఎక్కువ మెజారిటీతో అధికారానికి రావటంతో నయా ఉదారవాద విధానాలను మరింత వేగంగా అమలు జరిపే ధైర్యం వచ్చింది. 1. ప్రైవేటీకరణ 2.కార్మికచట్టాల సవరణ 3. పారిశ్రామికీకరణ కోసం భూబ్యాంకును ఏర్పాటు చేయటం తదితర భారీ సంస్కరణలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ లక్ష్యాలను సాధించటం కోసం రక్షణ, రైల్వే మంత్రిత్వశాఖలతో పాటు వివిధ మంత్రిత్వ శాఖలు 100 రోజుల ప్రణాళికలను ప్రకటించాయి.

గత సాధారణ సమ్మె తర్వాత ఖచ్చితంగా సంవత్సరానికి 2020 జనవరి 8 సార్వత్రిక సమ్మె జరుగుతున్నది. బిజెపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత సార్వత్రిక సమ్మెకు నిర్ణయం తీసుకున్నాం. ఎన్నికలలో కార్పొరేట్లు తనకు ఇచ్చిన మద్దతుకు ప్రతిఫలంగా భారీస్థాయిలో సంస్కరణలను అమలుజరిపి, వారి రుణం తీర్చుకోవటం కోసం బిజెపి ప్రభుత్వం పనిచేస్తున్నది. ప్రభుత్వం అత్యంత వేగంగా చేస్తున్న ప్రైవేటీకరణ ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఈ సమ్మె జరుగుతున్నది. జాతీయ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమాన్ని గురించి వ్యక్తమౌతున్న ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ప్రజలు వివిధ రూపాలలో వ్యక్తం చేస్తున్నవ్యతిరేకతను పట్టించుకోకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నది.

ఇప్పటికే అనేకరంగాలలో జరుగుతున్న పోరాటాలను ఒకతాటిపైకి తెచ్చి, వాటన్నింటినీ కలిపి బలీయమైన శక్తిగా రూపొందించి, బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న పూర్తి వినాశకరమైన 'జాతి వ్యతిరేక', 'కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక' విధానాలను ఓడించటం కోసం కార్మికసంఘాల ఐక్యవేదిక సరైన సమయంలో సార్వత్రిక సమ్మె నిర్ణయం తీసుకున్నది.

"పెద్దసంఖ్యలో తనకు ఓటుచేసిన ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు తదితరులు తాను తీసుకుంటున్న వినాశకరమైన నిర్ణయాలను మౌనంగా ఆమోదిస్తారని బిజెపి ప్రభుత్వం భావిస్తున్నది. ఆ విధంగా చేయటం ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం తప్పుగా అర్థం చేసుకొంటున్నదని స్పష్టమౌతున్నది. బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెంటనే పార్లమెంటు ఎన్నికలలో ఆ పార్టీకి ఓటుచేసిన ప్రజలలో ఎక్కువ మంది దాని విధానాలను వ్యతిరేకించటం ప్రారంభించారు."



**2016లో జరిగిన సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులు**

పెద్దసంఖ్యలో తనకు ఓటుచేసిన ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు తదితరులు తాను తీసుకుంటున్న వినాశకరమైన నిర్ణయాలను మౌనంగా ఆమోదిస్తారని బిజెపి ప్రభుత్వం భావిస్తున్నది. ఆ విధంగా చేయటం ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం తప్పుగా అర్థం చేసుకొంటున్నదని స్పష్టమౌతున్నది. బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెంటనే పార్లమెంటు ఎన్నికలలో ఆ పార్టీకి ఓటుచేసిన ప్రజలలో ఎక్కువ మంది దాని విధానాలను వ్యతిరేకించటం ప్రారంభించారు.

బిజెపి ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన కొద్దిరోజులకే ఛత్తీస్‌ఘర్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా బైలదిల్లా గిరిజన ప్రాంతంలోని ప్రజలు ఇనుప ఖనిజాన్ని తవ్వుతున్న ఆదాని సంస్థకు వ్యతిరేకంగా భారీస్థాయిలో పోరాట కార్యక్రమాలు నిర్వహించారు. గనుల అభివృద్ధి, నిర్వహణ కోసం నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆదాని సంస్థను నియమించింది. ప్రజల ప్రతిఘటనతో గనుల తవ్వకం కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఆ ప్రాంతంలో అడవుల నరికివేతను ఆపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాల్సివచ్చింది.

రైల్వేలలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా రైల్వే ఉత్పత్తి విభాగాలను కార్పొరేటీ కరణ చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటిం చగానే ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ విభా గాలలో పనిచేస్తున్న కార్మికులు స్వచ్ఛందంగా మిలిటెంట్ పోరాటాలను ప్రారంభించారు. బలమైన కార్మికసంఘాలు లేని కేంద్రాల నుండి కూడా వేలాది మంది కార్మికులు వారి కుటుంబ సభ్యులతో కలిసి వీధుల్లోకొచ్చి ప్రదర్శనలు చేశారు. గుర్తింపు పొందిన రైల్వే ఉద్యోగుల జాతీయ ఫెడరేషన్ల నుండి తగినంత మద్దతు లేకపోయినప్పటికీ భారీస్థాయిలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. వారి పోరాటం కొనసాగుతున్నది.

దేశవ్యాపితంగా ఉన్న 41 రక్షణ ఉత్పత్తుల ఫ్యాక్టరీలకు చెందిన లక్షమందికి పైగా కార్మికులు ఆగస్టు 20 నుండి నెలరోజుల పాటు ఐక్యంగా చారిత్రాత్మకమైన సమ్మె జరిపారు. సమ్మె సంపూర్తిగా జరిగింది. సమ్మె ప్రారంభమైన ఐదురోజుల తర్వాత ప్రభుత్వం దిగివచ్చి తాత్కాలికంగా తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నది.

బొగ్గురంగంలో 100 శాతం ఎఫ్‌డిఐకి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బగ్గుగనులలో పనిచేస్తున్న కార్మికులు సెప్టెంబరు 24న సంపూర్ణంగా సమ్మెలో పాల్గొన్నారు.

ప్రభుత్వరంగంలో ఉన్న 10 బ్యాంకులను 4 బ్యాంకులుగా విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా 2019 అక్టోబరు 22వ తేదీన బ్యాంకు ఉద్యోగులు దేశవ్యాపిత సమ్మె చేశారు. బ్యాంకు అధికారుల సంఘం కూడా

**"సంపదను సృష్టించటంలో తనపాత్రను కూడా భారత కార్మికవర్గం నెమ్మదిగా గుర్తి స్తున్నది. బడా కార్పొరేట్లు సంపదను సృష్టిస్తారని మోడి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించి, సంపదను సృష్టించేవారం తామేనని ఉమ్మడి ప్రకటనలో దృఢంగా ప్రకటించారు. తాము సృష్టించిన సంపదను ప్రభుత్వ మద్దతుతో కార్పొరేట్లు దోపిడీ చేస్తున్నారని, అది డిమాండ్ తగ్గటానికి, మాంద్యానికి దారితీస్తున్నదని, తాము సృష్టించిన సంపదను సమానంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు."**




ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నవంబర్ 20న న్యూఢిల్లీలో జరిగిన ఆయిల్, పెట్రోలియం కార్మికుల సదస్సు

సమ్మెలో చురుకుగా భాగస్వామి కావటంతో సమ్మె సంపూర్ణంగా, జయప్రదంగా జరిగింది.

ముంబయిలో జరిగిన ఆయిలు, పెట్రోలియం కార్మికుల సదస్సు ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించింది. ప్రభుత్వరంగంలో ఉండి లాభాలార్జిస్తూ, సమర్ధవంతంగా నడుస్తున్న బిపిసిఎల్,హెచ్‌పిసిఎల్‌లను ప్రైవేటీకరించరాదని డిమాండ్ చేస్తూ ఈ రెండు సంస్థలలోని మార్కెటింగ్, పైప్‌లైన్ కార్మికులు, అన్ని రిఫైనరీలలోని కార్మికులు నవంబరు 28వ తేదీన ఒక పూర్తి రోజు సమ్మె చేశారు.

ఈ అన్ని సమ్మెలలోనూ కార్మికుల ఆర్థిక డిమాండ్లు ప్రధానంగా లేవనే విషయాన్ని గమనించాలి. ప్రజల సంపదను, జాతీయ వనరులను దేశంలోనూ, విదేశాలలోనూ ఉన్న బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలకు వ్యతిరేకంగా ప్రజల ప్రయోజనాలను, జాతీయ ప్రయోజనాలను రక్షించటం ఈ అన్ని సమ్మెలలోనూ ప్రధానమైన అంశంగా ఉన్నది.

**పురోగమిస్తున్న కార్మికవర్గం**

తాను చేస్తున్న పోరాటాలకు ప్రజల నుండి విస్తృత మద్దతును పొందాలంటే అన్ని పీడిత వర్గాలు, తరగతులకు చెందిన సామాన్య ప్రజల డిమాండ్లను ముందుకు తీసుకురావాలన్న చైతన్యం కార్మికవర్గంలో పెరుగుతున్నది. సెప్టెంబరు 30న జరిగిన బహిరంగ సదస్సులో ఆమోదం పొందిన తీర్మానం ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నది. గత మూడు దశాబ్దాల కాలంలో ఐక్య కార్మికోద్యమం పురోగమన పథంలో సాగుతున్నది. ప్రైవేటీకరణను వ్యతిరేకించటం "రాజకీయ" డిమాండని చెబుతూ, ఐక్యవేదికలోని కొన్ని సంఘాలు అందుకు ముందుకురాని పరిస్థితి గతంలో ఉండేది. రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు, నిరుద్యోగం, మహిళలపై పెరుగుతున్న హింస, ప్రజారోగ్యం, విద్యను ప్రైవేటీకరించటం తదితరాలకు సంబంధించిన డిమాండ్లను ఈరోజు కార్మికసంఘాల ఐక్యవేదిక లేవనెత్తుతున్నది. అర్బన్ నక్సల్స్ పేరుతో ప్రజల ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధమైన హక్కులపైనా, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడులను ఉమ్మడిప్రకటన వ్యతిరేకించింది. మత విభేదాలను పెంచటం ద్వారా అత్యంత ముఖ్యమయిన సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించటానికి, రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను, సామాజిక విలువలను ధ్వంసం చేయటానికి ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తున్న మతోన్మాద శక్తుల కార్యకలాపాలను సదస్సు తీవ్రంగా ఖండించింది.

ఆర్‌టిఐ చట్టాన్ని నీరుగార్చేలా చేసిన సవరణలను, చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టాన్ని-యుఎపిఎ-మరింత కఠినంగా, కక్షసాధించే విధంగా రూపొందించటానికి చేసిన సవరణలను, జమ్మూకాశ్మీర్ ప్రజలను సంప్రదించకుండా, వాస్తవానికి వాళ్ళనోళ్ళను కట్టివేసి ఆర్టికల్ 370ని రద్దుచేయటాన్ని కార్మికసంఘాల ఐక్యసదస్సు వ్యతిరేకించింది. ఎన్‌ఆర్‌సి ద్వారా లక్షలాది మంది ప్రజలను దేశంలేని వారిగా, ఇళ్ళులేని వారిగా మార్చటాన్ని వ్యతిరేకించింది. వినాశకరమైన ఈ విధానాలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చింది.

కార్మికవర్గం పరిపక్వతను సాధిస్తున్నది. తన హక్కుల సాధనకు పరిమితమైన పోరాటాలను మాత్రమే చేస్తుంటే పోరాటాల ద్వారా తాను సంపాదించుకున్న హక్కులను నిలబెట్టుకోవటం సాధ్యం కాదని కార్మికవర్గం క్రమంగా గుర్తిస్తున్నదని పై అంశాలు స్పష్టం చేస్తున్నాయి. తన డిమాండ్ల సాధన కోసం సాగించే పోరాటాన్ని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చాలి. అందుకోసం అన్ని తరగతుల కష్టజీవులు, సామాజికంగా అణచివేయబడుతున్న తరగతులకు చెందిన, ఆర్థికంగా దోపిడీ చేయబడుతున్న అందరి మద్దతును సాధించటం ద్వారా ఈ విధానాలను ఓడించటం కోసం కృషిచేస్తున్నది. ఇదొక సానుకూలమైన మార్పు. దీనిని గుర్తించి, మరింత బలపర్చటం ద్వారా అన్ని తరగతుల కార్మికుల ఐక్య పోరాటాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళవచ్చు.

సంపదను సృష్టించటంలో తనపాత్రను కూడా భారత కార్మికవర్గం నెమ్మదిగా గుర్తిస్తున్నది. బడా కార్పొరేట్లు సంపదను సృష్టిస్తారని మోడి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించి, సంపదను సృష్టించేవారం తామేనని ఉమ్మడి ప్రకటనలో దృఢంగా ప్రకటించారు. తాము సృష్టించిన సంపదను ప్రభుత్వ మద్దతుతో కార్పొరేట్లు దోపిడీ చేస్తున్నారని, అది డిమాండ్ తగ్గటానికి, మాంద్యానికి దారితీస్తున్నదని, తాము సృష్టించిన సంపదను సమానంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గంలో నిదానంగా పెరుగుతున్న ఈ అవగాహనను మరింతగా అభివృద్ధి చేసి, ప్రస్తుత దోపిడీ వ్యవస్థను మార్చటంలో ఒకవర్గంగా తమ పాత్రను అర్థం చేసుకొనేలా చేయాలి. సమ్మెను జయప్రదం చేయటం కోసం జరిగే ప్రచారాన్ని ఈ లక్ష్యంతో కొనసాగించాలి. "ఇప్పటి వరకు చేరని కార్మికులను చేరటం", "సమస్యలను విధానాలతో ముడిపెట్టటం" అన్న సిఐటియు రెండు నినాదాలను ఈ క్యాంపెయిన్ సందర్భంలో పూర్తిగా వివరించేలా కృషిచేయాలి.

❝ తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం కార్మికులు చేస్తున్న అన్ని పోరాటాలకు దేశంలోని సామాన్య ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మి కులు, యువత, విద్యార్థులు, అభ్యుదయ భావాలు కలిగిన అన్ని తరగతుల ప్రజలు తమ సంఘీ భావాన్ని, చురుకైన మద్దతును అందిస్తున్నారు. 2015 నుండి జరుగుతున్న సార్వత్రిక సమ్మెలన్నింటిలోనూ ఇది ప్రత్యేకమైన అంశంగా కనిపిస్తున్నది. 2020 జనవరి 8వ తేదీన అఖిల భారత కిసాన్‌సభ, ఇతర రైతుసంఘాలు గ్రామీణబంద్‌కు పిలుపునిచ్చాయి.❞

2020 జనవరి 8వ తేదీన జరగనున్న సమ్మె పిలుపుకు దేశంలోని వివిధరంగాలలోని కార్మికుల నుండి వ్యక్తమౌతున్న స్పందన, ప్రస్తుతం జరుగుతున్న పోరాటాలు, కార్పొరేట్, మతోన్మాదశక్తుల దాడిని సమైక్య పోరాటాల ద్వారా ఎదుర్కోవాలన్న కార్మికవర్గ దృఢ నిశ్చయాన్ని వెల్లడిస్తున్నాయి. నకిలీ జాతీయవాద బిజెపి ప్రభుత్వం దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని అమ్మటానికి పూనుకోవడటం తో వారి నుండి కార్మికులు, శ్రామికప్రజలు మాత్రమే వారి నుండి దేశాన్ని రక్షించుకోవటం, దేశాన్ని నిర్మించటం చేయగలరని దృఢంగా ప్రకటిస్తున్నారు.

తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం కార్మికులు చేస్తున్న అన్ని పోరాటాలకు దేశంలోని సామాన్య ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, విద్యార్థులు, అభ్యుదయ భావాలు కలిగిన అన్ని తరగతుల ప్రజలు తమ సంఘీ భావాన్ని, చురుకైన మద్దతును అందిస్తున్నారు. 2015 నుండి జరుగుతున్న సార్వత్రిక సమ్మెలన్నింటిలోనూ ఇది ప్రత్యేకమైన అంశంగా కనిపిస్తున్నది. 2020 జనవరి 8వ తేదీన అఖిల భారత కిసాన్‌సభ, ఇతర రైతుసంఘాలు గ్రామీణబంద్‌కు పిలుపునిచ్చాయి. ఇతర రైతు, వ్యవసాయ కార్మికసంఘాల నుండి సమ్మె పిలుపుకు విస్తృతమైన మద్దతు లభిస్తున్నది. అభ్యుదయ భావాలతో ఉన్న విద్యార్థి, యువజన, మహిళా తదితర తరగతులకు చెందిన అనేక సంఘాలు వివిధ రూపాలలో సమ్మెకు తమ మద్దతును ప్రకటించాయి.



మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పార్లమెంట్‌కు కార్మికుల ప్రదర్శన

నూతనంగా ఎన్నికలు జరిగిన వివిధ రాష్ట్రాలలో, ముఖ్యంగా మహారాష్ట్ర, హర్యానాలలో నకిలీ జాతీయవాద, యుద్ధోన్మాద నినాదాలతో మోసపోబోమని ప్రజలు స్పష్టం చేశారు. తమ రోజువారీ సమస్యలైన ఉద్యోగాలు, వేతనాలు, ఆదాయాలు తదితర సమస్యలను ప్రభుత్వాలు విస్మరించలేవని తెలిపారు. హర్యానాలో 10 స్థానాలు, మహారాష్ట్రలో 48కి 41 పార్లమెంటు స్థానాలను గెలిచిన బిజెపికి అసెంబ్లీ ఎన్నికలు నల్లేరు మీద నడకే అని భావించారు. కాని శాసనసభల ఎన్నికలలో తీవ్రమైన ఎదురు దెబ్బలు తిన్నది. అధికారానికి రావటం కోసం బిజెపి అత్యంత నీచమైన ఎత్తుగడలు, కుయుక్తులకు పాల్పడింది. మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవకాశాలు లేనపుడు రాష్ట్రపతి పాలన విధించారు. ఫడ్నవీస్ చేత ముఖ్యమంత్రిగా, అజిత్‌పవార్ చేత ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించటం కోసం రాష్ట్ర ప్రజలు నిద్రలేవక ముందే హఠాత్తుగా రాష్ట్రపతి పాలనను తొలగించారు. వారసత్వ రాజకీయాలు, అవినీతి గురించి అజిత్‌పవార్‌పై చేసిన విమర్శలు అధికారాన్ని పంచుకోవటానికి అడ్డం రాలేదు. ఇటువంటి అవినీతికరమైన నాటకాలు నడిపినప్పటికీ మూడు రోజులలోనే ఫడ్నవీస్ రాజీనామా చేయాల్సివచ్చింది.

విలువ కోల్పోతున్న జాతి వ్యతిరేక, ప్రజా వ్యతిరేక నయా ఉదారవాద విధానాలను భరించటం సాధ్యం కాదని ప్రపంచవ్యాపితంగా గుర్తిస్తున్నారు. ఈ విధానాలను ఓడించటం తక్షణ కర్తవ్యం. అన్ని తరగతుల శ్రామికప్రజల బలమైన, సమైక్య పోరాటాల ద్వారానే ఈ విధానాలను ఓడించటం సాధ్యమౌతుంది. సమైక్య పోరాటాలను అభివృద్ధి చేయటంలో నాయకత్వపాత్ర నిర్వహిస్తున్న శ్రామికవర్గం మరింతగా చొరవ తీసుకొని, రైతులు, వ్యవసాయ కార్మికులు తదితరులను ఐక్యం చేయటానికి, పోరాటాల తీవ్రతను పెంచటం ద్వారా వారిని శక్తివంతంగా కార్యకలాపాలలో భాగస్వాములను చేయటానికి కృషిచేయాలి. అదే సమయంలో పాలకవర్గ పార్టీల దిగజారుడు రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజానుకూల, కార్మికవర్గ అనుకూల ప్రత్యామ్నాయ విధానాలను, విశ్వసనీయమైన ప్రత్యామ్నాయ రాజకీయాలను ముందుకు తీసుకురావాలి.

పార్లమెంటు ఎన్నికలకు ముందు 2019, మార్చినెల 5వ తేదీన కార్మికసంఘాల ఐక్యవేదిక సమావేశంలోఆమోదించిన, ఐక్య కార్మికోద్యమం ఎల్లప్పుడూ ముందుకు తెస్తున్న 'కార్మికవర్గ డిమాండ్ల పత్రం'లోని 12 డిమాండ్లు ప్రస్తుత వ్యవస్థ పరిధిలోనే నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయాన్ని చూపుతాయి. కార్మికవర్గ డిమాండ్ల పత్రంలోని కోర్కెలు పరస్పరం ముడిపడివున్న అన్ని వర్గాల శ్రామికప్రజల సమస్యలను ముందుకు తెచ్చింది. ప్రజల చేతిలో కొనుగోలు శక్తి తగ్గిపోవటం గురించి లేవనెత్తిన డిమాండ్ ఈ రోజు మనదేశం ఎదుర్కొంటున్న ఆర్థికమాంద్యం సమస్యను గురించి వివరిస్తుంది. ఈ డిమాండ్ల పత్రంలోని కోర్కెల సాధన కోసం కార్మికవర్గం జరిపే పోరాటాలు ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలను ముందుకు తెస్తాయి. ఈ పోరాటాలలో సాధించిన అనుభవాలు ప్రస్తుత దోపిడీ వ్యవస్థను కూలదోయాల్సిన అవసరాన్ని శ్రామికప్రజలు అర్థం చేసుకొనేలా చేస్తాయి.

కార్మికవర్గ చైతన్యాన్ని పెంచటం కోసం జరుగుతున్న అనేక పోరాటాలలో 2020, జనవరి 8వ తేదీన జరిగే సమ్మె ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుంది.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

# బడా పెట్టుబడిదారుల లాభాలకోసమే లేబర్ కోడ్‌లు

రెండో దఫా కేంద్రంలో అధికారానికి వచ్చిన తర్వాత బిజెపి ప్రభుత్వం కార్మిక సంస్కరణలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు సుదీర్ఘకాల పోరాటం ద్వారా కార్మికవర్గం సాధించుకున్న హక్కులు, అధికారాలను లాగేసుకోవటానికి ఉద్దేశించినవే. సంఘాలు పెట్టుకోవటం, సంఘటితంగా బేరసారాలాడటం, కార్మికుల హక్కులను లాగేసి పెట్టుబడిదారుల బొక్కసాలు నింపేందుకు మార్గం సుగమమం చేసే ప్రయత్నాలకు ప్రభుత్వం పెట్టుకున్న ముద్దు పేరే కార్మిక సంస్కరణలు.

నాలుగు కార్మిక కోడ్‌లను ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రతిపాదించింది. వేతన కోడ్‌ను ఆమోదింపచేసుకుంది కూడా. పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్యంకు సంబంధించిన బిల్లును పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయనానికి పంపారు. కానీ పారిశ్రామిక సంబంధాల బిల్లు విషయంలో అటువంటి అధ్యయనానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఇదే విషయాన్ని బాహాటంగా చెప్పింది. ఈ శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును ఆమోదింపచేసుకోవటానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. సామాజిక భద్రత చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.

ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక ప్రయోజనాలకు సంబంధించిన 44 చట్టాలన్నీ ఇప్పుడు ఈ నాలుగు కోడ్‌ల పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నట్లు ఇప్పటి వరకు కార్మికులకు ఉన్న హక్కులు, సంక్షేమ ప్రయోజనాలను విస్తృతపర్చటానికి ఈ చట్టాలు సవరించటం లేదు. కార్మికులు సుదీర్ఘపోరాటాలు, త్యాగాల ద్వారా ఇప్పటి వరకు సాధించుకున్న హక్కులు, అవకాశాలు, ప్రయోజనాలు లాగేసుకుని, వారిని బానిసలుగా మార్చటమే ఈ చట్టాల లక్ష్యం. యజమానులకు ఇష్టం లేనపుడు కార్మికులను పనిలోంచి తీసేయటానికి హక్కులు దఖలు పర్చటం, ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాల ఉల్లంఘనలకు చట్టబద్ధత కల్పించటం వంటి అనేక అంశాలు ఈ ప్రతిపాదిత కోడ్‌లలో ఉన్నాయి. ఇవన్నీ సులభ వ్యాపార సూచిలో భారత్ స్థానాన్ని

**కెహెచ్ లత**

మెరుగుపర్చే లక్ష్యంతో చేస్తున్న మార్పులు అని ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్నది.

### వేతన కోడ్ 2019

కనీస వేతనాల చట్టం, వేతనాల చెల్లింపు చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన పనికి సమాన వేతనాల చట్టం కలిపి ఇక మీద వేతన కోడ్ 2019గా అమలు కానుంది.

1957లో 15వ భారత కార్మిక మహాసభ కనీస వేతనాల నిర్ధారణ ప్రాతిపదికను ఏకగ్రీవంగా ఆమోదించగా, ఈ ప్రాతిపదికను సుప్రీంకోర్టు కూడా ధృవీకరించింది. 1992లో జరిగిన కార్మిక మహాసభ దీనిని మరింత బలోపేతం చేసింది. కానీ 2019 వేతనకోడ్ లో మాటవరుస కన్నా ఈ విధి విధానాల ప్రాతిపదికను ప్రస్తావించలేదు. తర్వాత జరిగిన 44, 46 జాతీయ కార్మిక మహాసభలు ఈ సిఫార్సులను పునరుద్ఘాటించాయి. ఈ ప్రాతిపదికనే 21 వేల రూపాయలు కనీస వేతనంగా ఉండాలని కార్మిక సంఘాలు ఉమ్మడిగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ ప్రాతిపదికనే ఏడవ వేతన సంఘం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కనీస నెలసరి వేతనం రు.18000గా ఉండాలని సిఫార్సు చేసింది. తొలి దఫా మోడీ అధికారానికి వచ్చినప్పుడు బిజెపి ఈ ప్రతిపాదనలను అంగీకరించింది. 2015 నాటికి ఈ ప్రాతిపదికన కనీస వేతనాలు లెక్కిస్తే నెలసరి వేతనం 26 వేల రూపాయల వరకు ఇవ్వాల్సి ఉంటుందన్న కారణంతో ఈ డిమాండ్‌ను అన్ని రకాల కార్మిక సంఘాలు అంగీకరించినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని 21 వేల రూపాయలు కనీస వేతనంగా ఉండాలని కేంద్ర కార్మిక సంఘాలు ప్రతిపాదించాయి.

ఈ కోరికను అంగీకరించటానికి బదులు బిజెపి ప్రభుత్వం కనీస వేతనాలకు ప్రాతిపదికను నిర్ధారించేందుకు అధ్యయనం కోసం నిపుణుల బృందాన్ని నియమించింది. ఈ నిపుణుల కమిటీ 9000–12000 రూపాయలు కనీస వేతనంగా ఉండాలని ప్రతిపాదించింది. ఇది ఏడో వేతన సంఘం సిఫార్సుల కంటే దాదాపు సగం తక్కువ. ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో కనీస వేతనం కేంద్ర ప్రభుత్వ నిపుణుల కమిటీ సిఫార్సు చేసినదానికంటే ఎక్కువగానే ఉంది. అయినా తాము నియమించిన నిపుణుల కమిటీ నివేదికను దాని సిఫార్సులను కూడా అంగీకరించని స్థితికి చేరుకున్నారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి కనీస దినసరి వేతనం 178 రూపాయలు ఉండాలని చెప్పారు. ఇది కూడా నిపుణుల కమిటీ సిఫార్సు చేసినదాంట్లో సగమే. ఈ తూతూమంత్రం కసరత్తు వెనక ఉన్న అసలు ప్రయోజనం ఏమిటి? కేవలం యజమానులకు ప్రయోజనం చేకూర్చటమే. కొనుగోలు శక్తి కొరత, నిరంతరం పెరుగుతున్న ఉత్పత్తి, పోగుపడుతున్న సరుకులు పెట్టుబడిదారీ సంక్షోభానికి పునాదులు. నేటి భారతంలో కనిపిస్తున్న పరిణామం ఇది. ఈ పరిస్థితుల్లో సైతం బిజెపి ప్రభుత్వం కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్లను ఆమోదించటం ద్వారా తాజా ఆర్థిక సంక్షోభానికి కారణమైన పరిస్థితులను, సమస్యలను పరిష్కరించటానికి సిద్ధం కావటం లేదు. కేవలం యజమానులు లాభాలు కాపాడానికే కట్టుబడి ఉంది.

### వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2019

13 చట్టాలస్థానంలో ఈ చట్టాన్ని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. పని పరిస్థితులు, కాంట్రాక్టు కార్మికుల పట్ల యజమాని బాధ్యతలు, వేతనానికి ఉన్న నిర్వచనం, వృత్తిపరమైన భద్రతకు సంబంధించిన వివరాలు, ఆయా చట్టాల అమలు కోసం ఏర్పాటైన త్రైపాక్షిక వ్యవస్థలు వంటి వాటినన్నింటినీ ఈ చట్టం నిర్వీర్యం చేస్తోంది.

కర్మాగారాలు, గనులు, డాక్‌యార్డులు, బీడి, సిగరెట్ పరిశ్రమలు, రవాణా రంగం, సినిమా థియేటర్లు, కాంట్రాక్టు కార్మికులు, పత్రికారంగంలో పని చేసే కార్మికులు, సేల్స్ విభాగాలు

వంటి వివిధ ఉత్పత్తి రంగాల్లో పని చేస్తున్న కార్మికవర్గం ఈ కొత్త చట్టం వల్ల పెద్దఎత్తున నష్టపోతుంది.

ఈ కొత్త చట్టం అవసరాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం "చట్టం యొక్క లక్ష్యాలు ప్రయోజనాలు" ప్రకటించింది. దీని ప్రకారం ఈ చట్టం "వెసులు బాట్లతో పని చేయటానికి అవకాశం కల్పించే న్యాయమైన మానవీయ పని పరిస్థితులను అమల్లోకి తేవటమే" లక్ష్యంగా ప్రకటించింది. ఆచరణలో మానవీయ పని పరిస్థితుల కల్పించ టంలో ఉండాల్సిన బరువు బాధ్యతల నుండి యాజమాన్యాన్ని విముక్తి చేసింది.

పని పరిస్థితుల గురించినదిగా చెప్పబడు తున్న ఈ చట్టంలో కనీసం ఎనిమిది గంటల పని దినం అన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ తొలి తీర్మానం స్ఫూర్తిని కూడా ప్రతిఫలించలేక పోయింది. పనిదినం నిడివి ఎంత ఉండాలన్నది ఆయా ప్రభుత్వాలు, ప్రభుత్వ విభాగాలు నిర్ణయించుకోవాలని చట్టం ప్రతిపాదిస్తుంది. ఈ కొత్త చట్టంలో ఇమిడిపోతున్న పాత చట్టాలు పని గంటలు, పని నిడివి, విరామసమయం, అదనపు పని దినం వంటి విషయాలు అన్నీ స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి. అటువంటి నిర్దిష్ట ఆదేశాలు, అవకాశాలు, ప్రయోజనాలు అన్నీ ఈ కొత్త చట్టంలో మాయమవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పనిదినం అంగీకరించిన మౌలిక ప్రాతిపదిక. ఈ నాలుగు చట్టాల్లోనూ ఎనిమిది గంటల కంటే మించి పని దినం ఉండరాదన్న షరతును తొలగించారు. అటువంటి షరతును ఆయా ప్రభుత్వాలు అమలు చేస్తాయి అన్నది పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడేందుకే తప్ప మరోటి కాదు. రాజకీయంగా కార్యనిర్వాహణాధికార వర్గం కార్మికుల హక్కులను కైంకర్యం చేయటమే కాదు. మొత్తంగా పార్లమెంట్‌కు ఉన్న అధికారాలను కూడా కైంక ర్యం చేస్తోంది. నయాఉదారవాదంలో ప్రజా స్వామ్యం పరిస్థితి ఇలానే ఉంటుంది. అటు వంటి నిస్సారమైన ప్రజాస్వామ్యానికే బిజెపి, మోడి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

### పారిశ్రామిక సంబంధాల కోడ్ 2019

ఇప్పటికే అమల్లో ఉన్న 1926 నాటి కార్మిక సంఘాల చట్టం, 1946 నాటి పారిశ్రామిక ఉపాధి (స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం, 1947 నాటి పారిశ్రామిక వివాదాల చట్టం స్థానంలో ఈ చట్టం వచ్చింది. కార్మికుల హక్కులను నీరుగార్చ టమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ప్రత్యేకించి సమ్మె హక్కును చట్టవిరుద్ధమైనదిగా గుర్తించటం ఈ కొత్త చట్టం ప్రధాన లక్ష్యం.

> **"కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కును, ఉమ్మడిగా బేరసారాలాడుకునే హక్కును గ్యారంటీ చేసిన అంతర్జాతీయ కార్మిక సంస్థ 87, 88 కన్వెన్షన్ తీర్మానాలపై ప్రభుత్వం ప్రత్యక్ష దాడి చేయటమే తప్ప ఈ ప్రతిపాదిత చట్టం మరోటి కాదు. పని ప్రాంతాల్లో, ఫ్యాక్టరీల్లో కార్మిక సంఘాలకు తావులేదన్న యాజమాన్యపు ధోరణికి అనుకూలంగా చట్టాలను బలహీనం చేయటానికి పూనుకున్నారు."**



కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ల నాయకత్వంలో పోరాటాలు

కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కును, ఉమ్మడిగా బేరసారాలాడుకునే హక్కును గ్యారంటీ చేసిన అంతర్జాతీయ కార్మిక సంస్థ 87, 88 కన్వెన్షన్ తీర్మానాలపై ప్రభుత్వం ప్రత్యక్ష దాడి చేయటమే తప్ప ఈ ప్రతిపాదిత చట్టం మరోటి కాదు. పని ప్రాంతాల్లో, ఫ్యాక్టరీల్లో కార్మిక సంఘాలకు తావులేదన్న యాజమాన్యపు ధోరణికి అనుకూలంగా చట్టాలను బలహీనం చేయటానికి పూనుకున్నారు. యాజమాన్యం కోరుకున్నట్లు కార్మికులను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉద్యోగాల నుండి తీసేసే హక్కును ఈ కొత్త చట్టం చట్టబద్ధం చేస్తోంది. ఇప్పటి వరకు సంఘటిత కార్మికవర్గం యాజమాన్యం ఇటువంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకోగలిగింది. అయినా ఇప్పుడు వచ్చిన చట్టం ఇంత కాలం సాధించిన విజయా లను ఒక్కపెట్టున రద్దు చేసేదిగా మారింది. ఈ చట్టం కార్మికులను ఆధునిక బానిసలుగా మారుస్తుంది.

### సామాజిక భద్రత కోడ్

పార్లమెంట్‌లో ప్రతిపాదించిన బిల్లుల్లో చివరిది సామాజిక భద్రత కోడ్ 1923 నాటి ఉద్యోగుల నష్టపరిహార చట్టం, 1948 నాటి ఈఎస్ఐ చట్టం, 1952 నాటి ఈపిఎఫ్ చట్టం, 1959 నాటి ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి, ఖాళీలను తప్పనిసరిగా ప్రకటించాలన్న చట్టం, 1961 మెటర్నిటి బెనిఫిట్ చట్టం, 1972 గ్రాట్యుయిటీ చెల్లింపు చట్టం, 1996 నాటి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సుంకం చట్టం, 2008 నాటి అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రత చట్టం, సినిమా కార్మికుల సంక్షేమ నిధి చట్టం వంటి ప్రస్తుతం అమల్లో ఉన్న తొమ్మిది చట్టాలను ఈ బిల్లు మింగేయనుంది.

జిఎస్టీ చట్టం ఆమోదించినప్పుడు వివిధ చట్టాల కింద సెస్ (ప్రత్యేక సుంకం) వసూలు చేసేందుకు ఉన్న అవకాశాలను తొలగించింది.

ఈ చట్టాల ద్వారా సార్వత్రిక సామాజిక భద్రతను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటోంది. నిజానికి ప్రధానంగా బీడి కార్మికులుగా పనిచేసే లక్షలాది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు రేపటి రోజున సామాజిక భద్రత కరువవనుంది. విశాల పోరా టాల ద్వారా సాధించుకున్న ఈ విజయాలను, ప్రయోజనాలను భవిష్యత్తులో కార్మికులు కోల్పోనున్నారు. వివిధ రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించలేదు.

గ్రాట్యుటి విషయంలో ఎటువంటి పరిమి తులు, అర్హతలకు సంబంధించిన షరతులు విధించరాదని యావత్తు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. అయినా ప్రభుత్వం ఈ డిమాండ్‌ను తిరస్కరించింది. సుదీర్ఘకాలం పని చేసిన కార్మికులు తమ జీతాల నుండి చేసుకున్న పొదుపు మొత్తాలే ఇవి.

**❝ కార్మిక హక్కులకు, ప్రయోజనాలకు సంబంధించిన అంశాలన్నీ 44 చట్టాల్లో ప్రధాన మైనవిగా ఉంటే, సవరించిన చట్టాల్లో ఈ కీలకమైన అంశాలు కాస్తా చట్టం పరిధి నుండి బయటకొచ్చి నిబంధనలకు పరిమితమయ్యాయి. పార్లమెంట్‌లో చట్టం ఆమోదించటం బహిరంగ ప్రక్రియ. కనీసం ఏమి జరుగుతుందో తెలుసుకోవటానికి అవకాశం ఉంటుంది. కానీ కార్యనిర్వాహక వర్గం నియమ నిబంధనలు రూపొందించటం చడీ చప్పుడు కాకుండా చేసే ప్రక్రియ. ❞**

**కలబోత కాదు.... వెలివేత...**

సార్వత్రికీకరణ, సాధారణీకరణ వంటి పడికట్టు పదాల మాటున విశాల కార్మికవర్గాన్ని చట్టం పరిధి నుండి వెలి వేయటానికి 'కార్మికుడు', 'ఉద్యోగి' అన్న పదాలకు నిర్వచనమే మార్చేశారు. ఈ రెండు పదాలను పదేపదే మార్చి మార్చి ఉపయోగించటం ద్వారా మొత్తంగా ఎవరు కార్మికు డు, ఎవరు ఉద్యోగి అన్నది అర్థం కానంత గందర గోళాన్ని సృష్టించింది ప్రభుత్వం. ఈ గందర గోళంలో అటు కార్మికులు ఇటు ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావల్సిన రక్షణ, భద్రత, ప్రయోజనాలు ఎగ్గొట్టేందుకు పెద్దఎత్తున అవకా శాలు కల్పించేవిగా ఈ చట్ట సవరణలున్నాయి.

అదేవిధంగా 'శిక్షణ పొందుతున్న వారు', 'సహాయకులు' అన్న కేటగిరీలకు ఈ కొత్త చట్టాల్లో తావే లేదు. వివిధ పరిశ్రమల్లో లక్షలాదిమంది కార్మికులు ఈ తరగతులు కింద నమోదై పని చేస్తున్నారు. ఎక్కువ సందర్భాల్లో శాశ్వత కార్మికులు చేసే అన్ని రకాల పనులనూ ఈ తరహా కార్మికులు కూడా చేయాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ భృతి లేదా స్టైఫండ్ పేరుతో వారికిచ్చే వేతనాలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నా యి. దాంతో లక్షలాదిమంది కార్మికులు ఎటు వంటి ప్రయోజనాలను, రాయితీలను పొంద లేకుండా మిగిలిపోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

గతంలో నిర్దిష్ట సంఖ్యలో కార్మికులు పని చేస్తుంటే వారికి భద్రత, ఆరోగ్యవసతులు, సంక్షే మ చర్యలు అమలు చేయటం యాజమాన్యం చట్టబద్ధమైన బాధ్యతగా ఉండేది. ప్రస్తుతం ఇటువంటి బాధ్యతల నుండి యాజమాన్యం తప్పించుకునేలా ఈ చట్టాలు వర్తింప చేయటా నికి కావల్సిన కార్మికుల కనీస సంఖ్యను గణనీయంగా పెంచింది. ఉదాహరణకు కొత్త చట్టం ప్రకారం ఏదైనా కర్మాగారంలో కనీసం 500 మందికంటే తక్కువ మంది కార్మికులు ఉంటే అటువంటి పరిశ్రమలు, కర్మాగారాలు పారిశ్రామిక భద్రతాధికారిని నియమించాల్సిన అవసరం లేదు. 250 మంది కంటే తక్కువ మంది కార్మికులు ఉన్న కంపెనీల్లో కార్మిక సంక్షే మాధికారి అవసరం ఉండదు. పని ప్రదేశంలోనే కాంటీన్ ఉండాలన్నా సదరు కంపెనీలో కనీసం వందమందికి తక్కువ గాకుండా కార్మికులు పని చేస్తూ ఉండాలి. శిశుసంరక్షణ కేంద్రం ఉండాలంటే మొత్తం ఉద్యోగుల్లో కనీసం యాభైమంది మహిళా ఉద్యోగులు ఉండాలి. 500 మంది కన్నా ఎక్కువమంది కార్మికులు ఉన్న పరిశ్రమల్లోనే అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలి.

**తనిఖీలు :**

కార్మిక చట్టాల అమలు పర్యవేక్షణా యంత్రాంగాన్ని బలహీనం చేయటం నయఉ దారవాద ఎజెండా. ప్రత్యేక ఆర్థిక మండళ్లతో పాటు అనేక పారిశ్రామిక కేంద్రాల్లో కార్మిక చట్టాల అమలు పర్యవేక్షణపై మినహాయింపులు ఇచ్చారు. కార్మిక శాఖను అన్ని స్థాయిల ఉద్యోగుల కొరత వేధిస్తోంది. దాంతో మొత్తం తనిఖీ పర్యవేక్షణ యంత్రాంగం కోరలు పీకిన పాముగా మారింది. మొత్తం తనిఖీ తీరుతెన్నులతో అవసరమే లేనట్లు ఈ కొత్త చట్టాలు వ్యవహరిస్తున్నాయి. ఈ కొత్త చట్టాల అమలు తర్వాతకార్మిక శాఖ తనిఖీ అధికారులు సమన్వ యకులు'గా అవతారం ఎత్తుతారు. వీళ్లే కంప్యూటర్‌లో పొందుపర్చిన సమాచారంతో కూడా తమ తనిఖీలను పూర్తిచేయవచ్చు. అయితే ఈ తరహా తనిఖీల తీరుతెన్నులు మాత్రం సంబంధిత ప్రభుత్వాలు నిర్దేశించిన విధంగానే జరగాలి. ఇది అంతర్జాతీయ కార్మిక సంస్థ 81వ కన్వెన్షన్ తీర్మానానికి పూర్తి వ్యతిరేకం. ఈ తీర్మానం అన్ని సభ్యదేశాలు పారిశ్రామిక తనిఖీల సందర్భంగా అనుసరించాల్సిన విధి విధానాలను ప్రమాణాలను నిర్ధారించింది. దీని ప్రకారం 'సంబంధిత చట్టపరమైన ఆదేశాలు అమలు జరిగేలా సాధ్యమైనన్ని ఎక్కువసార్లు పని ప్రదేశాలను తనిఖీ చేయాలి'. దీనికి బదులు వెబ్ సైట్ ఆధారంగా తనిఖీ చేయటానికి అనుమతించటం అంటే మొత్తం తనిఖీ ప్రక్రియను నీరుగార్చి నిర్వీర్యం చేయటానికి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయటం తప్ప మరోటి కాదు. ఈ తరహా తనిఖీలు ఇంటర్నెట్ ద్వారా కానీ లేదా ఫోన్లో కానీ జరగొచ్చు. తనిఖీకి వెళ్లేటప్పుడు యజమానులకు ముందుగానే సమాచారం ఇవ్వాలన్న షరతు కూడా కొత్త చట్టంలో ఉంది. ఆచరణలో ఈ పరిస్థితి కార్మిక చట్టాలు ఈ స్థాయిలో నిర్వీర్యం అయ్యాక కూడా ఈ సమన్వయకులు వాటిని అమలు చేయటానికి కూడా సిద్ధంగా లేరన్నది స్పష్టమవుతుంది. ఇక్కడ ప్రభుత్వ లక్ష్యం అంతా ఒక్కటే. వ్యాపారం చేసుకోవటానికి మార్గాలు సులభతరం చేయటమే.

బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేకత కేవలం ఈ సవరించిన కార్మిక కోడ్‌లలో మాత్రమే లేదు. ఈ చట్టాలు పూర్తిగా మోసపూరితమైనవిగా మార్చటంలో కూడా ఈ వ్యతిరేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కార్మిక చట్టాల సవరణ పేరుతో బిజెపి మోసపూరిత విధానాలకు పాల్పడిన తీరు ఇలా ఉంది. కార్మిక హక్కులకు, ప్రయోజనాలకు సంబంధించిన అంశాలన్నీ 44 చట్టాల్లో ప్రధానమైనవిగా ఉంటే, సవరించిన చట్టాల్లో ఈ కీలకమైన అంశాలు కాస్తా చట్టం పరిధి నుండి బయటకొచ్చి నిబంధనలకు పరిమితమయ్యాయి. పార్లమెంట్‌లో చట్టం ఆమోదించటం బహిరంగ ప్రక్రియ. కనీసం ఏమి జరుగుతుందో తెలుసుకోవటానికి అవకాశం ఉంటుంది. కానీ కార్యనిర్వాహక వర్గం నియమ నిబంధనలు రూపొందించటం చడీ చప్పుడు కాకుండా చేసే ప్రక్రియ. వీటిని రూపొందించే క్రమంలో పారదర్శకత బొత్తిగా కరువుతుంది. అలా రూపొందించిన నిబంధనలు కొన్నింటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటే మరికొన్నింటి పట్ల ఉపేక్షభావంతో వ్యవహరించేందుకు కూడా చట్టమే అవకాశం కల్పిస్తుంది. కానీ ముఖ్యమైన విధి విధానాలను సంబంధిత ప్రభుత్వ విభాగాలు రూపొందిస్తాయి' అని పూర్తి స్థాయి విచక్షణాధికారాలు తీసుకోవటంతో ఈ చట్టాల్లో ఏ మార్పులు చేయాలని భావించినా మరోసారి పార్లమెంట్ గడప తొక్కే అవసరం ఉండదు. కార్యనిర్వహణాధికారవర్గమే ఇష్టం వచ్చిన మార్పులను దొడ్డిదారిన అమల్లోకి తేవచ్చు. ఈ పద్ధతి మొత్తంగా చట్టాలు రూపొందించే ప్రక్రియను ఓ బూటకంగా మార్చటం తప్ప మరోటి కాదు.

కొత్తగా ప్రతిపాదించబడుతున్న ఈ బిల్లులు/చట్టాలన్నీ ప్రధానవిషయాలను గురించి

**"1991లో కాంగ్రెస్ పార్టీ లాంఛనంగా ఈ నయా ఉదారవాద విధానాలను ఆరంభించింది. కాంగ్రెస్, బిజెపిలు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా కార్మికవర్గ ప్రయోజనాలను హరించే చట్టాలు చేసే విషయంలో రెండు పార్టీలు తోడు దొంగలుగా వ్యవహరించాయి. బూర్జువా పార్టీల నాయకత్వంలోని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాలను అమలు చేస్తున్నాయి. కార్మిక చట్టాలను సంపూర్ణంగా సవరించటంలో తొలి అడుగు వేసింది రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం."**




వేజ్‌కోడ్ బిల్లుపై చర్చిస్తున్న పార్లమెంటు

సంబంధిత అధికారులు 'వివరంగా చెప్పనున్నట్లు / వివరించనున్నట్లు / రూపొందించనున్నట్లు' వంటి ఊహాగానాలకే పరిమితమవుతున్నాయి. అంటే ఉదాహరణకు ఇటువంటి ఊహాగానాలనే భవిష్యత్తులో పని గంటల్లో మార్పులకు సంబంధించి గానీ, భద్రత, ఆరోగ్య సంబంధిత విషయాలకు సంబంధించి గానీ వేతనాలు, ఇతర ప్రయోజనాలకు సంబంధించి గానీ, సామాజిక భద్రతకు సంబంధించిన ప్రయోజనాల విషయంలో కానీ నిర్ధారించాల్సిన ప్రాతిపదికలు, ప్రమాణాలు మార్చాల్సి వచ్చినప్పుడు పార్లమెంట్ ఆమోదానికి పెట్టకుండానే సంబంధిత అధికారులు పైన ప్రస్తావించిన పద జాలంలో ఉన్న వెసులుబాట్లు ఉపయోగించుకుని మార్చేయవచ్చు. అంటే ఒకసారి ఈ చట్టాలు ఆమోదం పొందిన తర్వాత భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లు మార్పులు చేయటం చిటికెలో పనే అవుతుంది. భవిష్యత్తులో చేయబోయే మార్పుల విషయంలో ఆయా ప్రభావిత వర్గాల నుండి, ముఖ్యంగా కార్మికులు, వారికి ప్రతినిధులుగా ఉన్న కార్మిక సంఘాల ఆమోదాన్ని, ప్రజాభిప్రాయాన్ని సేకరించటం కానీ, సంప్రదించటం కానీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండదు. అటువంటి మార్పులు పార్లమెంట్ ఆమోదం లేకుండానే అమలు చేయవచ్చు. ఒక్క సామాజిక భద్రత చట్టం విషయంలోనే కేంద్ర ప్రభుత్వం 98 సందర్భాల్లో అటువంటి విచక్షణాధికారాలు గుప్పిట్లో పెట్టుకుందది. కనీస సంప్రదింపులతో పని లేకుండా 30 అంశాలకు సంబందించి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవచ్చు. మరో 128 అంశాలకు సంబంధించి తీసుకునే మార్పులు గురించి ఓ ప్రకటన జారీ చేస్తే సరిపోతుంది. ఇటువంటి మార్పులన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా ఆదేశాలు జారీ చేయటం ద్వారా చేయొచ్చు. పార్లమెంట్‌కు ఎటువంటి అధికారం, జవాబుదారీతనం ఉండబోదు.

దేశవ్యాప్తంగా ఉన్న కార్మికవర్గం, వారికి ప్రతినిధులుగా ఉన్న కార్మిక సంఘాలు ఏళ్ల తరబడి ఐక్య ఉద్యమాల రూపంలో ప్రతిఘటిస్తూ వస్తున్నా ఇటువంటి సవరణలు చేయటానికి బిజెపి ఎందుకు ప్రేరేపించబడుతోంది అన్నది ఇక్కడ ముఖ్యమైన ప్రశ్న. ప్రపంచవ్యాప్తంగా అప్రదిష్ట పాలైన నయాఉదారవాద విధానాల పట్ల బిజెపికి ఉన్న అవ్యాజమైన ప్రేమ, నిబద్ధతే కార్మిక చట్టాలు మార్చటానికి ఉన్న ప్రేరణకు పునాది. పెట్టుబడిదారీ విధానంలో నయాఉదారవాదం ఓ దశ. ఈ దశలో కార్మికులపై మరిన్ని భారాలు మోపైనా సరే పెట్టుబడిదారుల లాభాలు కాపాడటమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉంటుంది. దీనికోసం కార్మికులను నిర్వీర్యం చేయటానికి, కార్మిక సంఘాలను బలహీనం చేయటానికి ప్రభుత్వాలు ఏ మాత్రం వెనకాడవు.

నయాఉదారవాద ఎజెండాను నిర్దేశిస్తున్న అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి మితవాద, ప్రతీఘాత శక్తులు, సమాజాన్ని ముక్కలు చెక్కలు చేయటానికి కూడా వెనకాడని శక్తులను, అన్ని రకాల నిరసనలను, ప్రతిఘటనలు, ఆందోళనలు గొంతు నులిమేందుకు సిద్ధమైన శక్తులను వెన్నంటి ప్రోత్సహించేందుకుసదా తయారుగా ఉంటుంది.

కేవలం బిజెపియే కాక దేశంలోని అన్ని బూర్జువా పార్టీలు ఈ నయాఉదారవాద ఎజెండాను సమర్థిస్తున్నాయి. 1991లో కాంగ్రెస్ పార్టీ లాంఛనంగా ఈ నయాఉదారవాద విధానాలను ఆరంభించింది. కాంగ్రెస్, బిజెపిలు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా కార్మికవర్గ ప్రయోజనాలను హరించే చట్టాలు చేసే విషయంలో రెండు పార్టీలు తోడు దొంగలుగా వ్యవహరించాయి. బూర్జువా పార్టీల నాయకత్వంలోని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాలను అమలు చేస్తున్నాయి. కార్మిక చట్టాలను సంపూర్ణంగా సవరించటంలో తొలి అడుగు వేసింది రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం. నాటి నుండీ అన్ని రాష్ట్రాలు ఈ మార్గంలో నడవటం ప్రారంభించాయి. పార్లమెంట్ ఈ చట్టాలను దేశవ్యాప్తంగా అమలు చేయటానికి వీలుగా ఆమోదించటానిముందే అనేక రాష్ట్రాల్లో ఈ సవరణలు అమలు జరుగుతున్నాయి.

వేతన కోడ్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు సిఐటియు జాతీయ కార్యదర్శి రాజ్యసభ సభ్యులు ఎలమరం కరీం కార్మికుల హక్కులు కాపాడేందుకు వీలుగా కొన్ని సవరణలు ప్రతిపాదించి, వాటిపై ఓటింగ్‌కు పట్టుబట్టాడన్న విషయాన్ని ఈ సందర్భంగా పాఠకులకు గుర్తు చేయాలి. దురదృష్టమేమిటంటే కార్మిక హక్కుల పరిరక్షణకు వీలుగా ప్రతిపాదించిన సవరణలను కేవలం ఎనిమిది మంది ఎంపీలు మాత్రమే సమర్థించారు. కార్మికుల వేతనాలు సాధ్యమైనంతగా తగ్గించాలన్న నయాఉదారవాద విధానాల విషయంలో బూర్జువా పార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చాయన్న కఠోర వాస్తవాన్ని ఈ పరిణామం మరోసారి రుజువు చేస్తుంది.

పాలకవర్గాల ఈ దుర్మార్గపు చర్యలను సమైక్య కార్మిక పోరాటాల ద్వారా మాత్రమే ప్రతిఘటించగలం. ఈ కార్మిక చట్టాల సవరణ ప్రయత్నాలను మాత్రమే కాక యావత్తు నయాఉదారవాద విధానాలను తిప్పికొట్టే లక్ష్యంతో కార్మికవర్గం తన ప్రతిఘటన కొనసాగిస్తుంది. పార్లమెంట్ ఈ చట్టాలను ఆమోదించవచ్చేమో కానీ కార్మివర్గం మాత్రం వీటిని ఆమోదించబోదు.

**(అనువాదం: కె. వీరయ్య)**

# సార్వత్రిక సమ్మె ప్రాధాన్యత

**తమ్మినేని వీరభద్రం**



రచయిత
సిపిఎం తెలంగాణ కార్యదర్శి

**10** జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర కార్మిక సమాఖ్యలు, వివిధ రంగాలకు చెందిన అసోషియేషన్స్, మరికొన్ని స్వతంత్ర సంఘాలు కలిసి 2020 జనవరి 8న దేశవ్యాప్త సార్వత్రిక పారిశ్రామిక సమ్మెకు పిలుపిచ్చాయి. నరేంద్ర మోడీ నాయకత్వంలో రెండోసారి అధికారం లోకి వచ్చిన బిజెపి పాలనలో అమలవుతున్న కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక, జాతి వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ పిలుపు ఇవ్వబడింది.

దేశ ఆర్థికవ్యవస్థ తీవ్ర మాంద్యంలో ఉంది. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఇప్పటికే భారీగా రిట్రెంచ్‌మెంట్లు, పరిశ్రమల మూసివేతల విషఫలితాలను అనుభవిస్తున్నారు. 2025 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామన్న మోడీ ప్రభుత్వ మాటలు నీటిమూటలుగా రుజువవుతున్నాయి. ఏటా 9 శాతం అభివృద్ధి సాధిస్తే తప్ప ఈ లక్ష్యం చేరటం సాధ్యంకాని పరిస్థితి. అయితే ఇప్పటికే మన జిడిపి 7 నుండి గత సంవత్సరం 6శాతానికి, ఇపుడు ఇంకా దిగజారి 4.5 శాతానికి పడిపోయింది. 8 కీలక రంగాలలో అభివృద్ధి జులై 2018లో ఉన్న 7.3 శాతం నుండి 2019 జులైకి 2.1 శాతానికి పడిపోయిందని వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వశాఖ అంగీకరించింది. వస్తూత్పత్తి 2018 జూన్‌లో 6.9 శాతం ఉంటే 2019 జూన్ కల్లా అది 1.2 శాతానికి పడిపోయింది. అలాగే పారిశ్రామిక అభివృద్ధి భారీగా పడిపోయింది. ఆటోమొబైల్ రంగంలో ఉత్పత్తి 19 సంవత్సరాల కనిష్టానికి దిగజారింది. దేశవ్యాప్తంగా దాదాపు 300 డీలర్‌షిప్‌లు మూసివేయ బడ్డాయి. ఇందువల్ల 2 లక్షల ఉద్యోగాలు ఊడిపోయాయి. ఈ రంగంలో ఈ ఒక్క సంవత్సరంలోనే 23 శాతం వాహనాల అమ్మకాలు తగ్గాయి. గ్రామీణ అభివృద్ధిని సూచించే ట్రాక్టర్ల అమ్మకాలు 14 శాతం పడిపోయాయి. పెద్దనోట్ల రద్దు వల్ల చిన్న తరహా పరిశ్రమలు దారుణంగా దెబ్బతిన్నాయి. 32 శాతం సంస్థలు మూతబడ్డాయి. 35 లక్షల మంది కార్మికులు వీధినపడ్డారు. వ్యవసాయ రంగం తర్వాత భారీగా ఉపాధి దొరుకుతున్నది చిన్న తరహా పరిశ్రమల రంగంలోనే అనేది మనం మర్చిపోకూడదు.

ఆర్థిక వ్యవస్థ ఈ విధంగా దిగజారడానికి ప్రజల కొనుగోలు శక్తి దారుణంగా పడిపోవటమే ముఖ్య కారణం. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టిల వల్ల భారీగా నిరుద్యోగ సమస్య ఏర్పడింది. మన జాతీయ ఉత్పత్తి(జిడిపి)కి వెన్నెముకగా ఉన్న ప్రైవేటు వస్తు వినియోగం మొత్తం వినియోగంలో 57 శాతం ఉంటుంది. 2019లో మొదటి త్రైమాసికంలో ఇది 7.2 శాతం అభివృద్ధి ఉంటే రెండో త్రైమాసికానికల్లా 3.1 శాతానికి పడిపోయింది. ఈ వినియోగాన్ని పెంచకుండా, ప్రజలకు డబ్బుచేరే చర్యలు తీసుకోకుండా, నిరుద్యోగాన్ని తగ్గించే చర్యలు చేబట్టకుండా మన ఆర్థిక వ్యవస్థను దారిలో పెట్టటం అసాధ్యం, అసంభవం. కానీ మన ప్రభుత్వం ఏం చేస్తున్నది?. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పదే, పదే ప్రకటిస్తున్న చర్యలు, చూపిస్తున్న పరిష్కారాలు ఏమిటి? కార్పొరేట్ పన్నులు తగ్గించటం, ధనిక వర్గాలకు, పెట్టుబడిదారులకు, రియల్ ఎస్టేట్ రంగాలకు లక్షల కోట్ల రూపాయిలు సబ్సిడీలు, వరాలు ప్రకటించటం, అమలుజేయటం చేస్తున్నారు. ఈ చర్యలు మన ఆర్థికవ్యవస్థను ఎంతమాత్రం బాగుపర్చలేవు. ఎందుకని? ఎందుకంటే సమస్యలన్నీ డిమాండ్ సైడ్ నుండి ముందుకు వస్తూ ఉంటే, మోడీ ప్రభుత్వ సపోర్టు మాత్రం సప్లై సైడ్ ఉంటోంది. జబ్బొకటైతే మందు మరోటి ఇస్తున్నారు. ఉత్పత్తిలో ఇబ్బందులుంటే ఉత్పత్తిదారులకు సహాయం చేయాలి. కానీ ఇపుడు మన ఉత్పత్తులు బాగున్నాయి. కానీ కొనుగోలుదారులు లేరు. ప్రజలకు కొనే అవసరాలున్నాయి. కానీ కొనటానికి వారి దగ్గర డబ్బులేదు. ప్రజల దగ్గరకు డబ్బు చేరితే మన ఆర్థికవ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావటంతో పాటు ప్రజల జీవనం కూడా మెరుగుపడుతుంది. మోడీ ప్రభుత్వం ఆ పనిచేయటం లేదు.

కేంద్ర కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడికీ రు.21 వేల కనీస వేతనం డిమాండ్ చేస్తున్నాయి. అలాగే అందరికీ పెన్షన్, పాత పెన్షన్ స్కీం పునరుద్దరించాలని, నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయాలని, చౌకదుకాణాల వ్యవస్థను పటిష్టపర్చాలని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయటం, కొత్త ఉద్యోగాలు సృష్టించటం, స్కీం వర్కర్స్‌ను, కాంట్రాక్ట్ వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేయటం, సమానపనికి సమాన వేతనం, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు, వ్యవసాయ రంగానికి, ఉపాధి పథకానికి ఎక్కువ నిధులు ఇలాంటి చర్యలు తీసుకుంటే ఆర్థిక రంగం ఊపులోకొస్తుంది. ఎందుకంటే ఈ చర్యలు తీసుకుంటే ప్రజల చేతికి డబ్బు వస్తుంది. వాళ్లకు కావాల్సిన సరుకులకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా భారతదేశ ఆర్థికవ్యవస్థ బాగుపడుతుంది. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకోవటానికి సిద్ధంగా లేదు. పైగా ఇందుకు పూర్తి విరుద్ధమైన చర్యలు తీసుకొంటోంది.

దశాబ్దాల ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలో అనేక పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని గ్యారంటీ చేస్తున్న అనేక కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయటానికి మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా పూనుకుంది. ఆ చట్టాలన్నింటినీ 4 విభాగాలుగా కోడిఫై చేయటం జరుగుతోంది. కార్మికులను ఎపుడంటే అపుడు తీసుకోవటానికి, తీసేయటానికి యాజమాన్యాలకు హక్కులివ్వటం(నిర్ణీత వ్యవధి ఉపాధి), పబ్లిక్ సెక్టార్ ప్రైవేటీకరణ, రైల్వే, డిఫెన్స్, కోల్ తదితర రంగాలలో విదేశీ

పెట్టుబడులు 100 శాతానికి పెంచటం, బ్యాంకుల విలీనం తదితర చర్యలు చేబడుతోంది. వీటివల్ల నిరుద్యోగం పెరగటంతో బాటు, శ్రమజీవులు విపరీత ఆర్థికదోపిడీకి గురవుతారు. కార్మికవర్గం పదేపదే నిరసనల ద్వారా, సార్వత్రిక సమ్మెల ద్వారా ఈ చర్యలకు వ్యతిరేకత తెలిపినప్పటికీ సర్కారు సానుకూలంగా స్పందించటం లేదు. పైగా శ్రామికులను చీల్చటానికి, ఉద్యమాలను అణచటానికి పూనుకుంటోంది. మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యలకు, నిరంకుశ చట్టాల అమలుకు పూనుకుంది. అందుకే భారత కార్మికవర్గం ఈ దాడులను తిప్పికొట్టేందుకు, తమ ఐక్యతను చాటిచెప్పేందుకు జనవరి 8న సార్వత్రిక సమ్మెకు పిలుపివ్వటం జరిగింది. ఈ సమ్మె కేవలం కార్మికుల సమస్యలే కాక దేశం నేడెదుర్కొంటున్న అనేక సమస్యలకు ప్రతిఘటనా రూపంగా మనం అర్థం చేసుకోవాలి.

దేశంలో నిరుద్యోగం గరిష్టస్థాయికి చేరుకుంది. 15-29 ఏండ్ల వయసుగల యువత 2017-18 నాటికి సుమారు 12 కోట్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఆ హామీని తుంగలో తొక్కింది. అధికారిక లెక్కల ప్రకారమే ఒక్క 2018లోనే 1.1 కోటి ఉద్యోగాలు ఊడిపోయినాయి. ఏటా 50 లక్షల యువత నిరుద్యోగ సైన్యంలో కొత్తగా చేరుతున్నారు. ఆర్థిక వ్యవస్థలో 2004లో 43 శాతం శ్రామికులు పాల్గొంటే 2017-18లో ఆ సంఖ్య 36.9 శాతానికి దిగజారింది. ఈ విషయంలో మహిళల భాగస్వామ్యం ఇదే కాలంలో 29.4 శాతం నుండి 17.5 శాతానికి పడిపోయింది. అలాగే ఈ కాలంలో శ్రామికుల నిజవేతనాలు రు॥ 226 నుండి 205రు॥లకు పడిపోయాయి. ఉపాధి హామి చట్టం వల్ల గ్రామీణ కార్మికుల వేతనాలు ప్రారంభంలో 44 శాతం పెరిగాయి. కానీ మోడీ కాలంలో ఆ పెరుగుదల కేవలం 6 శాతానికి పడిపోయింది.

వ్యవసాయ రంగంలో 2004-14 మధ్య సరాసరి 3.37 శాతం పెరుగుదల ఉంటే అది మోడీపాలన కాలంలో 2.07 శాతానికి పడిపోయింది. 12 కోట్ల మంది రైతులకు ఉద్దేశించిన పిఎమ్ కిసాన్ పథకం మొదటి విడతలో 3.97 కోట్లు, రెండవ విడతలో 3.5 కోట్లమందికి మాత్రమే చేరింది. ప్రభుత్వ రెవెన్యూ, జిఎస్‌టి వసూళ్లు దారుణంగా పడిపోయాయి. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన జిఎస్‌టి బకాయిలు 4 వేలకోట్ల రూపాయలకు పైగా పేరుకుపోయాయి. బిజెపి పాలిత రాష్ట్రాలకు మాత్రమే కొన్ని నిధులు విదిలిస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నాం.

> **❝ప్రభుత్వాన్ని ఈ మార్గం నుండి మళ్లించి ప్రజానుకూల చర్యలకు పూనుకునేలా చేయలంటే కార్మిక, కర్షక ప్రజా ఉద్యమాలే శరణ్యం. అందుకే కార్మికవర్గం తలపెట్టిన జనవరి 8 సమ్మెకు వ్యవసాయకార్మిక, రైతు సంఘాలు కూడా దేశవ్యాప్తంగా మద్దతు పలికాయి. అదేరోజు గ్రామీణ బంద్‌కు పిలుపిచ్చాయి.❞**

ఈ ఆర్థికమాంద్యం పరిస్థితులు చక్కబడాలంటే ముందే చెప్పినట్టు ప్రజల కొనుగోలు శక్తి పెరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కానీ మోడీ ప్రభుత్వం దీనికి భిన్నంగా ఇప్పటికే రెండు విడతలుగా 2.15 లక్షల కోట్లు కార్పొరేట్ శక్తులకు పన్నులు తగ్గించింది. ఈ నిధులన్నీ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆర్థిక, సామాజిక రంగాలకు, గ్రామీణ ప్రాంతాలకు మళ్లించి ఉంటే ఉపాధికల్పన జరిగి ప్రజల కొనుగోలు శక్తి పెరిగేది. కానీ మోడీ ప్రభుత్వం అందుకేమాత్రం సిద్దంగా లేదు. ప్రజల సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టటమే దాని లక్ష్యంగా ఉంది. ప్రభుత్వాన్ని ఈ మార్గం నుండి మళ్లించి ప్రజానుకూల చర్యలకు పూనుకునేలా చేయలంటే కార్మిక, కర్షక ప్రజా ఉద్యమాలే శరణ్యం. అందుకే కార్మికవర్గం తలపెట్టిన జనవరి 8 సమ్మెకు వ్యవసాయకార్మిక, రైతు సంఘాలు కూడా దేశవ్యాప్తంగా మద్దతు పలికాయి. అదేరోజు గ్రామీణ బంద్‌కు పిలుపిచ్చాయి. రైతాంగ కార్యకలాపాలు (తమ ఉత్పత్తులుపాలు, కూరగాయలు, ధాన్యాలు, ఇతర సరుకులు మార్కెట్లకు అందించటం వగైరా) పూర్తిగా నిలిపివేయటం ద్వారా కార్మిక, కర్షక, గ్రామీణ పేదల ఐక్యతను చాటి చెప్పాలి. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను చావుదెబ్బ కొట్టాలి.

రాబోయే కాలం పోరాటాల కాలం. ఇప్పటి వరకూ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కొన్ని అనుకూల పరిస్థితులను అనుభవించింది. 1990ల తర్వాత సోషలిస్టు శిబిరం బలహీనపడిన నేపథ్యంలో ఒక దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ, దాని ఉత్పత్తి విధానమే 'చరిత్ర'కు అంతిమ దశ లేక పరిష్కారమనీ, కమ్యూనిజానికి కాలం చెల్లిందనే వాదనలూ బలంగా ముందుకు వచ్చాయి. కానీ మారిన నేటి ప్రపంచ పరిస్థితుల్లో, ఉత్పత్తి క్రమం ఎదుర్కొంటున్న వ్యవస్థాగత సంక్షోభ స్థితిలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఈ అనుకూలతలు ఇంకా కొనసాగటం అసాధ్యం. అసంభవం. పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల మానవాళికి దాపురించిన ఆర్థిక దోపిడీ, సామాజిక పీడనలు. ఇంకా ఈ వ్యవస్థ లోని సమస్త అనర్థాలు, అస్తవ్యస్త పరిస్థితులకు అంతిమ పరిష్కారం సోషలిజంలోనే సాధ్యమనే 'భావన' నేడు సర్వత్రా బలపడుతోంది. ఆ వైపుగా ప్రపంచ వ్యాప్తంగా సామాజిక శాస్త్రవేత్తల 'ఆలోచనా క్రమం' వేగం పుంజుకుంటోంది.

**తీవ్రమౌతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం**

ఈ విషయాలు స్థూలంగా మన అవగాహనలోకి తెచ్చుకోవటానికి క్లుప్తంగా ఇందుకు సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలు నెమరు వేసుకోవటం అవసరం. పెట్టుబడిదారీ విధానం ఫ్యూడలిజాన్ని ఓడించి రాజకీయంగా స్థిరపడటానికి సుమారు 400 సంవత్సరాలు పట్టింది. కానీ స్థిరపడిన కొద్ది సంవత్సరాల్లోనే అది తిరిగి సంక్షోభాలను చవిచూడటం ప్రారంభమైంది. ఎందుకంటే మార్క్స్ చెప్పినట్లు ఆ (పెట్టుబడిదారీ) ఉత్పత్తి విధానం దానికదే నాశనం అయ్యే వైరుధ్యాన్ని(దోపిడీ స్వభావం) కూడా కలిగి ఉంది గాబట్టి, అలాగే ఆ వైరుధ్యాన్ని ఉపయోగిస్తూ తనను (పెట్టుబడిదారీ విధానాన్ని) నాశనం చేసే తన శత్రువును (కార్మికవర్గాన్ని) తానే సృష్టిస్తుంది గాబట్టి. అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ నాశనం, సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావం అనేది అనివార్యం. అయితే 1945 ప్రపంచయుద్ధం ముగింపు తర్వాత ఇప్పటి వరకూ, అంటే దాదాపు 75 సంవత్సరాల వరకూ పెట్టుబడిదారీవర్గం తన వినాశనాన్ని జయప్రదంగా 'వాయిదా' వేయగలిగింది. ఇందుకు కొన్ని ప్రత్యేక కారణాలున్నాయి.

రెండో ప్రపంచ యుద్ధంలో వివిధ దేశాల్లో కార్మికవర్గం అనుసరించిన 'లెనినిస్టు' అంతర్యుద్ధ వ్యూహం వల్లా, ఆ తర్వాత వివిధ దేశాల్లో సాగిన సోషలిస్టు విప్లవాల వల్లా దాదాపు మూడో వంతు ప్రపంచం సోషలిస్టు శిబిరంగా ఆవిర్భవించింది. మానవ జాతికి దోపిడీ, పీడన లేని కొత్త మార్గం చూపింది. కమ్యూనిస్టులు ఈ విధంగా ప్రపంచంలో ఒక మహాశక్తిగా ఎదగటానికి అంతులేని దోపిడీతో అణగారిన జీవితాలతో అలసిపోయిన కార్మికవర్గానికి ఒక ఆశాదీపంగా సోషలిస్టు ఉద్యమం పనిజేయటం

> **"ఈ విధానం అమలులో బాగంగా 1945 యుద్ధం తరువాత కార్మికవర్గం కమ్యూనిజం వైపు ఆకర్షించబడకుండా అనేక సంక్షేమ చర్యలు, కార్మిక అనుకూల చట్టాలు, వేతనాలు, సౌకర్యాలు అమల్లోకి తేబడ్డాయి. ప్రజలకు వివిధ రూపాల్లో సబ్సిడీలు ఉదారంగా ఇవ్వబడ్డాయి. బూర్జువా ప్రభుత్వాలన్నీ 'సంక్షేమ రాజ్యాలు'గా మారిపోయాయి."**

ఒక కారణమయితే, రెండోవైపు వలసపాలనకు వ్యతిరేకంగా సాగుతున్న అనేక దేశాల జాతీయోద్యమాలకు, కార్మికోద్యమాలను తోడుజేసిన లెనిన్ 'కలోనియల్ థీసిస్' అమలు వల్ల ఉవ్వెత్తున ఉప్పొంగిన స్వాతంత్రోద్యమాలు కార్మికోద్యమ స్వభావాన్ని సంతరించుకోవటం మరో ముఖ్య కారణం. అయితే దోపిడీ మరిగిన పెట్టుబడిదారీ వర్గం కమ్యూనిస్టులను బలహీన పర్చేందుకు ప్రపంచయుద్ధం తర్వాత ఒక కొత్త వ్యూహాన్ని జయప్రదంగా అమలు జరిపింది. ఈ వ్యూహంలో రెండు ముఖ్య కోణాలున్నాయి. మొదటిది కీనీషియన్ డిమాండ్ మేనేజ్‌మెంట్ అయితే, రెండోది వివిధ దేశాల్లో వలస పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న జాతీయోద్యమాలను సామరస్యంగా పరిష్కరించి స్థానిక బూర్జువాలకు పాలనాధికారాలు అప్పగించటం ద్వారా ఆ ఉద్యమాలనుకార్మికోద్యమాల నుండి వేరుజేయటం.

కీన్స్ అనే వ్యక్తి పెట్టుబడిదారీ ఆర్థికవేత్త. మార్క్స్ చెప్పిన ఆర్థిక సంక్షోభాలను అధిగమించటానికి ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధంగా ప్రభుత్వమే అనేక సంక్షేమ చర్యల ద్వారా ప్రజల్లోకి డబ్బు పంప్ చేయాలనేది అతని విధానం. ఈ విధానం అమలులో బాగంగా 1945 యుద్ధం తరువాత కార్మికవర్గం కమ్యూనిజం వైపు ఆకర్షించబడకుండా అనేక సంక్షేమ చర్యలు, కార్మిక అనుకూల చట్టాలు, వేతనాలు, సౌకర్యాలు అమల్లోకి తేబడ్డాయి. ప్రజలకు వివిధ రూపాల్లో సబ్సిడీలు ఉదారంగా ఇవ్వబడ్డాయి. బూర్జువా ప్రభుత్వాలన్నీ 'సంక్షేమ రాజ్యాలు'గా మారిపోయాయి. రెండోవైపు అప్పటి వరకూ బలప్రయోగంతో అణచివేయబడుతూ వచ్చిన వివిధ దేశాల జాతీయోద్యమాలను శాంతియుతంగా పరిష్కరించి, ఆ ఉద్యమాల నుండి కమ్యూనిస్టులను దూరంజేసి స్థానిక బూర్జువాలకు పాలనాధికారాలు అప్పగించ బడ్డాయి. వలస దేశాలలో అప్పటి వరకూ రాజకీయాధికారం ద్వారా సాగించిన ఆర్థిక దోపిడీని సామ్రాజ్యవాదులు కొత్తపాలకులతో ఆర్థిక ఒడంబడికల ద్వారా కొత్త రూపంలో కొనసాగించారు. ఈ విధంగా కార్మికవర్గాన్ని, జాతీయోద్యమాలను కమ్యూనిస్టులకు దూరం చేసే తమ యుక్తిని జయప్రదంగా అమలు జరిపారు. ఈ వ్యూహం సుమారు 40 సంవత్సరాల పాటు అమలు జరిగింది. 1990ల దాకా పెట్టుబడిదారీ విధానం దాదాపు ఏ విధమైన తీవ్ర సంక్షోభాలు లేకుండా బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించింది. ఈ కాలంలో అభివృద్ధి చెందిన విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల అభివృద్ధి కూడా ఇందుకు గొప్పగా తోడ్పడింది. అందుకే పెట్టుబడిదారీ చరిత్రలోనే ఈ కాలాన్ని 'స్వర్ణయుగం' అని పేర్కొనటం జరిగింది. ఈ కాలంలోనే సోషలిస్టు శిబిరం బలాన్ని గురించిన అతి అంచనాలు, అనేక ఇతర పెడ ధోరణలు కమ్యూనిస్టులలో ముందుకు వచ్చాయి. తత్కారణంగా సోషలిస్టు దేశాలు బలహీనపడి కొన్ని ఓడిపోవటం, ప్రపంచవ్యాప్తంగానే కార్మికోద్యమాలు వెనకపట్టు పట్టటం సంభవించింది.

1990ల తర్వాత పెట్టుబడిదారీ విధానం సంక్షేమ రాజ్యాల దశ నుండి ప్రపంచీకరణ దశకు మారింది. పెట్టుబడి సైజు పెరుగుతున్న కొద్దీ అది జాతీయ రాజ్యాల ఎల్లలు దాటి ప్రపంచమంతా స్వేచ్ఛా విహారం చేయక తప్పని స్థితి ఏర్పడింది. లేనట్లయితే సంపన్న పెట్టుబడిదారీ దేశాలు కూడా తీవ్ర ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వల్ల పెట్టుబడి పేద దేశాల వైపు ప్రవహించటం ప్రారంభమైంది. ఎందుకంటే పెట్టుబడి ఎక్కడికైనా ప్రయాణించే స్వేచ్ఛ, తయారైన సరుకును ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ ప్రపంచీకరణలోని రెండు ముఖ్య సూత్రాలు. పేద దేశాలలో ఉత్పత్తి ఖర్చు బహుతక్కువ గాబట్టి పెట్టుబడిని ఈ దేశాలకు తరలించి ఉత్పత్తులు సాగిస్తే అవి చౌకగా తయారయ్యే అవకాశం ఉంటుంది. అలాగే అలా చౌకగా తయారైన సరుకును ఎక్కువ రేటుకు ఎక్కడైనా అమ్ముకునే సౌకర్యం ద్వారా అపార లాభాలను ఆర్జించే అవకాశం ఏర్పడింది. ఈ కారణం చేత పేద దేశాల్లో కూడా ఆర్థికాభివృద్ధి వేగంగా జరగటానికి అవకాశాలేర్పడ్డాయి. ఇండియా లాంటి దేశాలు ఈ కాలంలో సాధించిన ఆర్థికాభివృద్ధికి ఇదే ముఖ్యమైన కారణం. దీని వల్ల కార్మికవర్గం కూడా కొంతవరకూ లాభపడింది. ఉపాధి పెద్దయెత్తున అందుబాటులోకి రావటానికి ఈ పరిస్థితి కారణమైంది. అయితే ప్రపంచీకరణ మరో రూపంలో శ్రామిక ప్రజలకు శాపంగా మారింది. అదేమంటే ప్రపంచీకరణ వల్ల జాతీయ రాజ్యాల ప్రాబల్యం, పాత్ర తగ్గించబడింది. జాతీయ ఆర్థిక వ్యవస్థలన్నీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం కాబడాల్సి రావటంతో విడిగా సంక్షేమ పథకాలు అమలు జరపటం సాధ్యం కాని పరిస్థితులు ఏర్పడ్డాయి. సబ్సిడీలు, సంక్షేమ పథకాలపై అంతర్జాతీయంగానే ఆంక్షలు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యాలు ప్రారంభమైనాయి. అందువల్ల నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల వనగూడిన సౌలభ్యాలు కొద్దిమంది ఎగువ మధ్యతరగతికే పరిమితమైపోయి మొత్తం శ్రామిక జనమంతా తీవ్రదోపిడీడికి, అసమానతలకు బలికావటం ప్రారంభమైంది. 2008లో సంభవించిన అమెరికన్ ఆర్థిక సంక్షోభం తర్వాత అది క్రమంగా వ్యవస్థాగత సంక్షోభంగా మారి ప్రపంచ శ్రామిక జనాన్ని కబళించటం ప్రారంభమైంది.

నేటి ఆర్థికమాంద్యం, ఆర్థిక సంక్షోభం ఒక దేశానికి పరిమితంగా లేదు. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోని అంతర్గత వైరుధ్యాల వల్ల ఏర్పడిన వ్యవస్థాగత సంక్షోభం. ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ చెందింది గాబట్టి ఈ సంక్షోభమూ ప్రపంచవ్యాప్త మౌతుంది. ప్రస్తుతానికి అది వివిధ దేశాల్లో, వివిధ స్థాయిల్లో ప్రభావాలు చూపవచ్చు.

ఇంకా అనేక దేశాలు తమ ఆర్థిక వ్యవస్థల రక్షణ కోసం ఆంక్షలు, టారిఫ్‌లు కొనసాగిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే ప్రపంచీకరణ విఫలమైందనీ, దీన్నుండి వెనక్కు మళ్లాలనే వాదనలూ మళ్లీ ముందుకొస్తున్నాయి. సంక్షోభం ముదురుతున్నకొద్దీ సంపన్న దేశాలు వెనుకబడిన దేశాలపైన, పెట్టుబడిదారులు కార్మికులపైనా వివిధ రూపాల్లో ఆ భారాన్ని నెట్టివేయడానికి పూనుకుంటారు. ఇందుకు ఆ దేశాల ప్రభుత్వాలు కూడా తోడ్పడతాయి. కనీస వేతనాలు తగ్గిస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అటువంటిదే. అటువంటి చర్యలవలన_ కార్మికులు తిరిగి తెగించి పోరాడక తప్పని పరిస్థితులు కల్పించబడుతున్నాయి. మార్క్స్ మహాశయుడు పిలుపిచ్చిన "ప్రపంచ కార్మికులారా ఏకం కండు" అనే నినాదం అక్షర సత్యంగా మారబోతోంది. మన దేశంలో మన కార్మికోద్యమం జరిపే జనవరి 8 సమ్మె ఈ మహాపోరాటంలో ఒక చిన్న భాగం మాత్రమే. పోరాడితే పోయేదేం లేదు. బానిస సంకెళ్ళు తప్ప. జయించటానికి మనకో ప్రపంచం ఉంది. ❋

# జనవరి 8న గ్రామీణ బంద్

**విజూ కృష్ణన్**



రచయిత ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఇతర గ్రామీణపేదలకు చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా చేసిన నమ్మకద్రోహానికి, సమస్యల పరిష్కారంపై ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా జనవరి 8వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా గ్రామీణబంద్‌లో గ్రామీణ శ్రామికులంతా పాల్గొని జయప్రదం చేయాలి. కనీసవేతనాల అమలు, ఉచిత విద్య, వైద్యం, కౌలురైతుల గుర్తింపు, రైతాంగ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, రుణాల రద్దు తదితర సమస్యలు పరిష్కరించుకోవాలంటే వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలురైతులు, ఇతర గ్రామీణపేదలు ఐక్యంగా పోరాడటమే మార్గం. ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాలు గ్రామీణబంద్‌ను జయప్రదం చేయమని పిలుపునిచ్చాయి. గ్రామీణబంద్‌ను జయప్రదం చేయటం ద్వారా మోడి ప్రభుత్వ రైతాంగ, వ్యవసాయ కార్మిక, గ్రామీణ పేదలకు వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఐదున్నరేళ్ళ నుంచి నడుస్తున్న బిజెపి ప్రభుత్వం 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరించడంతో ప్రజా ఉద్యమాలు వెల్లువెత్తాయి. రైతుల లాంగ్ మార్చ్, వ్యవసాయకూలీలు-రైతుల సంఘర్ష్ ర్యాలీ, కార్మికుల సమ్మెలు, దళితులు సాగించిన పోరాటాలు, సమస్యల ప్రాతిపదికన ఆదివాసీలు, విద్యార్థులు, యువకులు, మహిళలు పోరాటాలు చేశారు. విచక్షణారహితంగా చేస్తున్న భూసేకరణకు వ్యతిరేకంగా, భూమిపై హక్కుల కోసం భూమి అధికార్ ఆందోళన్, గిట్టుబాటు ధర, రైతుల రుణమాఫీ కోసం ఆలిండియా కిసాన్ సంఘర్షణ సమన్వయ కమిటి , నయాఉదారవాద ఆర్థిక విధానాలను వ్యతిరేకిస్తూ సమస్యల ప్రాతిపదికన ఐక్య ఉద్యమ నిర్మాణం, మతతత్వానికి వ్యతిరేకంగా జన్ ఏకతా, జన్ అధికార్ ఆందోళన్‌లు చేసిన పోరాటాలన్నీ కలిసి నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక వాతావరణాన్ని సృష్టించాయి.

ప్రభుత్వంపై వస్తున్న ప్రజావ్యతిరేకతను తిప్పికొట్టేందుకు పుల్వామా సంఘటనల అనంతరం మతాన్ని, జాతీయవాదాన్ని జోడించి నరేంద్ర మోడీ వ్యక్తిగత ప్రతిష్టను మరింతగా పెంచేందుకు కార్పొరేట్ లాబీ అందించే సంపూర్ణ సహకారంతో పలు రకాల పద్ధతులను అనుసరించారు. దాదాపు 27,000 కోట్ల రూపాయల మొత్తాన్ని అంటే అన్ని రాజకీయ పార్టీలు కలిసి చేసిన ఎన్నికల ఖర్చుకు సమానమైన మొత్తాన్ని ఒక్క బిజెపి ఖర్చు చేసింది. బిజెపి ప్రభుత్వ విధానాల ఫలితంగా లాభం కలుగుతుందని, రైతుల ఖాతాల్లోకి 2000 రూపాయలు జమ అవుతాయని ఎన్నికల రోజు నమ్మబలికేందుకు చేసిన యత్నాల వల్ల బిజెపి 303 సీట్లు సాధించింది. 353 సీట్లు, 43.86 శాతం ఓట్లతో ఎన్‌డిఎ తిరిగి అధికారానికి వచ్చింది. బిజెపి 200 స్థానాలలో 50 శాతానికి మించి ఓట్లను పొందింది. బిజెపి పట్ల ప్రజలకున్న ఆగ్రహాన్ని, రైతులు, కార్మికులు సాగించిన పోరాటాలతో ఏర్పడిన వ్యతిరేక వాతావరణాన్ని ఓట్లుగా మలుచుకోవడంలో ప్రతిపక్షాలు విఫలం కావడంతో బిజెపికి అనూహ్యమైన విజయం లభించింది.

ఎన్నికల విజయం అనంతరం బిజెపి ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లోని మితవాద ప్రభుత్వాలు నడిచిన బాటలోనే ప్రయాణిస్తున్నది. అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్, బ్రెజిల్‌లోని బోల్సనారో, టర్కీలో ఎర్డోగన్, ఫిలిప్పీన్స్‌లో డ్యుటెర్టె లేదా ఫ్రాన్స్‌లో మాక్రాన్‌ల పాలనను అద్దంలో చూసినట్లున్నది. రైతులు, కార్మికులపై దాడులు పెరిగిపోయాయి. సమాజాన్ని వేరుచేసి విద్వేషాన్ని వెలిగక్కే నేరాలు పెరుగుతున్నాయి. ఆశ్రిత పెట్టుబడిదారులు కూడా అలాంటి వారికి వంత పాడడం గతం కంటే పెరిగింది. రాజకీయాలు, ఆర్థికరంగంలో మితవాద మొగ్గు స్పష్టంగా కనిపిస్తున్నది. గోరక్ష పేరిట మైనారిటీలపై మత తత్వ దాడులతో సమాజాన్ని విభజించే ధోరణి పెరిగింది. కొనసాగుతున్న పార్లమెంటరీ సంప్రదాయాలను తుంగలో తొక్కి, రాజ్యాంగాన్ని విధ్వంసం చేసే చర్యలు కట్టెదురుగా సాక్షాత్కరిస్తున్నాయి. ఎలాంటి నిశిత పరిశీలన, భిన్నాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే దాదాపు రెండు డజన్ల బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందాయి. భారత రాజ్యాంగంలో కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కలిగించే 370 అధికరణాన్ని రద్దు చేశారు. కాశ్మీర్‌లో అప్రకటిత అత్యయికస్థితి కొనసాగుతున్నది. సైనిక పహారాతో, కండబలంతో రాజకీయ నాయకులను అరెస్టు చేసి అన్ని రకాల సమాచార వ్యవస్థలను స్తంభింపచేశారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో 4 కోడ్లు తీసుకువస్తున్నారు. కార్మిక మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటి సిఫారసుల ప్రకారం కనీసం వేతనం ఒకరోజుకు 375-447 రూపాయల నుంచి 178 రూపాయలకు తగ్గించారు. అంటే నెలకు 4628 రూపాయలు మాత్రమే లభిస్తుంది. భారత కార్మిక మహాసభ ఒకరోజు వేతనం 692 రూపాయలు లేదా నెలకు 18000 రూపాయలకు తక్కువ కాకూడదని సూచించింది. అన్ని కార్మిక సంఘాలు ఇదే డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్ల ప్రకారం ఓవర్‌టైమ్ అంటే పనిసమయాన్ని రోజుకు 14 గంటలకు పెంచడమని చెబుతున్నాయి. ఇంకా అనేక ఇతర అంశాలు కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకమైనవి. 1927లో అటవీ చట్టానికి చేసిన సవరణలు అటవీశాఖ అధికార యంత్రాంగానికి అపరిమితమైన అధికారాలను కట్టబెట్టాయి. గిరిజనుల హక్కులను కాలరాసాయి. గిరిజన ప్రాంతాలను

> **"ఈ యేడాదిలో సగానికి పైగా కాలం కరువుతోనే గడిచింది. బాధల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర బడ్జెట్‌లో ఉపశమనంతో పాటు ఆత్మవిశ్వాసం కలిగించే చర్యలు చేపడతారని అంచనావేశారు. ప్రభుత్వం రైతులకు శూన్యహస్తం చూపించింది. పండించిన పంటకు న్యాయమైన గిట్టుబాటు ధరను సూచించ లేదు. రైతులు అప్పుల బారి నుంచి బయటపడే మార్గాన్ని కూడా చూపలేదు. ఇది రైతాంగాన్ని తీవ్రంగా నిరాశపరిచింది."**

సైనికమయం చేసి అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టాన్ని నీరుగార్చాయి. రాజ్యాంగంలో 5, 6 అధికరణాలకు తూట్లు పొడిచి ప్రతిపాదిత జాతీయ అటవీ బోర్డులో సైనికదళాల అధిపతిని సభ్యునిగా నియమించనున్నారు. సమాజంలోని అన్ని వర్గాలు దాడికి గురవుతున్నాయి. ఆర్థికవ్యవస్థ కూడా మందగించింది. కంపెనీలు మూతపడుతున్నాయి. గడిచిన మూడు నెలల కాలంలో ఒక్క ఆటోమొబైల్ రంగంలోనే రెండు లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. మరో 10 లక్షల మందికి ఆ ప్రమాదం ఉంది. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి ప్రైవేటుకు అప్పగించే దిశగా సాగుతున్నారు. బిఎస్ఎన్ఎల్, రైల్వేలు, సెయిల్‌కు ఆ సెగ తాకింది. అనేక కంపెనీలలో కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు. అలాంటి స్థితిలో అణిచివేత చర్యలకు పాల్పడుతున్నారు. భిన్నాభిప్రాయాలను అణచివేసేందుకు వీలుగా చట్టాలను రూపొందిస్తున్నారు. గత ప్రభుత్వం అనుసరించిన రైతు వ్యతిరేక విధానాల కొనసాగింపుగానే వ్యవసాయరంగంలోని పరిణామాలు సంభవిస్తున్నప్పటికీ, నూతనంగా చోటుచేసుకుంటున్న మార్పులను కూడా గమనించాలి.

### వ్యవసాయం, రైతాంగంపై పెరుగుతున్న దాడులు

ఈ యేడాదిలో సగానికి పైగా కాలం కరువుతోనే గడిచింది. బాధల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర బడ్జెట్‌లో ఉపశమనంతో పాటు ఆత్మవిశ్వాసం కలిగించే చర్యలు చేపడతారని అంచనావేశారు. ప్రభుత్వం రైతులకు శూన్యహస్తం చూపించింది. పండించిన పంటకు న్యాయమైన గిట్టుబాటు ధరను సూచించలేదు. రైతులు అప్పుల బారి నుంచి బయటపడే మార్గాన్ని కూడా చూపలేదు. ఇది రైతాంగాన్ని తీవ్రంగా నిరాశపరిచింది. రైతుల శ్రమతో కార్పొరేట్లకు మేలు కలిగించే పథకాలను ప్రవేశపెట్టారు.

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయటం కోసం మంత్రిత్వశాఖ కమిటీ ఏడు మార్గాలను సూచించినట్లు పేర్కొన్నారు. పంటలు, పశుసంపద ఉత్పాదకతను మెరుగుపరచడం, వినియోగ సామర్థ్యాన్ని పెంచడం లేదా ఉత్పత్తి ఖర్చులో ఆదాచేయడం, పంటల సాంద్రత పెంచడం, అధిక విలువగల పంటల వైపు మొగ్గుచూపడం, రైతులకు వచ్చే ఆదాయాలను పెంచటం, వ్యవసాయం నుంచి వ్యవసాయేతర వృత్తులకు మళ్ళడం తదితరాలను పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పెరుగుదల చాలా తక్కువగా ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. 2017-18లో ఆహారధాన్యాల ఉత్పత్తి 28.5 కోట్ల టన్నులు ఉంటే 2018-19లో 28.34 కోట్ల టన్నులకు పడిపోయింది. కరువుకు తోడు వ్యవసాయోత్పత్తుల ధరలు కూడా తగ్గిపోయాయి. పరిస్థితిలో మార్పుకోసం ఎలాంటి ప్రయత్నం జరగలేదు. రైతులు ఉత్పత్తి వ్యయంలో ఎంత ఆదా చేసినా వాస్తవంగా వారికి వచ్చే ఆదాయంలో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. రాజ్యం అనుసరిస్తున్న విధానాలలో క్రమంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి పెట్టుబడులను తగ్గించి స్వేచ్ఛా విపణి దిశగా సాగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2014లో బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో "వ్యవసాయం భారత ఆర్థికాభివృద్ధికి ఇంజనులాంటిది. ఎక్కువమందికి ఉపాధి కల్పించే వ్యవసాయాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, రైతుల ఆదాయాన్ని పెంచి, గ్రామీణాభివృద్ధికి పాటుపడతాం" అని ప్రకటించింది. అయితే అభివృద్ధిలో ప్రైవేటు పెట్టుబడులు కీలకపాత్ర వహిస్తాయని, ప్రభుత్వ పెట్టుబడులు, బాధ్యత క్రమంగా తగ్గుతాయని తర్వాత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు స్పష్టం చేస్తున్నాయి.

2019-20 బడ్జెట్‌లో కష్టాల్లో ఉన్న రైతాంగానికి ప్రభుత్వం చేసిన కేటాయింపులు పైన చెప్పిన అంశాలనే ప్రతిఫలించింది. నీతి ఆయోగ్ ప్రకటన, బడ్జెట్‌కు ముందు ప్రకటించిన ఖరీఫ్ కనీస మద్దతు ధర మరింత దీనిని తేటతెల్లం చేసింది. ఉత్పత్తి వ్యయానికయ్యే ఖర్చుకు సగం కలిపి కనీస మద్దతు ధర ప్రకటించాలని స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను పూర్తిగా తుంగలో తొక్కారు. కనీస మద్దతు ధర గత యేడాది కంటే 1-9 శాతం, నామమాత్రంగానే పెంచారు. ధాన్యం మద్దతు ధర


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

3.7 శాతం పెంచినప్పటికీ ఉత్పత్తి వ్యయం గత యేడాది కంటే చాలా ఎక్కువగా పెరిగింది. అంటే క్వింటాలుకు 65 రూపాయల పెరుగుదల ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులు, ధరల నిర్ణాయక కమిటీ ధరలు నిర్ణయించే పద్ధతి నగటు వ్యయాన్ని తగ్గించి లెక్కించడం వల్ల అది వాస్తవ వ్యయానికి ఎంతమాత్రం దరిదాపుల్లో కూడా లేదు. ఉదాహరణకు ఖరీఫ్ మార్కెట్ సీజన్‌లో 2018-19లో పంజాబ్ ప్రభుత్వం ధాన్యం ధర క్వింటాలుకు 2490 రూపాయలు నిర్ణయించగా వ్యవసాయ ఖర్చులు, ధరల నిర్ణాయక కమిటీ మాత్రం క్వింటాలుకు 1174 రూపాయలు మాత్రమే నిర్ణయించింది. అంటే పంజాబ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ ప్రతిపాదించిన వ్యయం కంటే 50 శాతం కంటే తక్కువ. బిజెపి-జెడియు కలిసి పాలిస్తున్న బీహార్‌లో ధాన్యం ఉత్పత్తి వ్యయం క్వింటాలుకు 1605 రూపాయలు కాగా సిఎసిపి నిర్ణయించిన ధర మాత్రం 1398 రూపాయలు మాత్రమే. ఒరిస్సాలో క్వింటాలుకు 2344 రూపాయలు కాగా సిఎసిపి మాత్రం 1713 రూపాయలే నిర్ణయించింది. అన్ని పంటల విషయం దాదాపు ఇలాగే ఉంది. ఒకవేళ సిఎసిపి అంచనాకు వచ్చిన వ్యయం 1560 రూపాయలకు 50 శాతం కలిపితే క్వింటాలుకు 2340 రూపాయలవుతుంది. కానీ ప్రకటించిన కనీస మద్దతు ధర 1815 రూపాయలు మాత్రమే. ఇదే సమయంలో వామపక్ష ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉన్న కేరళలో ధాన్యం సేకరణ ధర క్వింటాలుకు 2650రూపాయలనే విషయం గుర్తుంచుకోవాలి.

రైతాంగంపై ప్రభుత్వం మరింత భారం మోపింది. డీజిల్‌పై రెండు రూపాయలు సెస్ విధించడం వల్ల ఉత్పాదక వ్యయం బాగా పెరిగింది. ప్రభుత్వం నియంత్రణలను ఎత్తివేసే దిశగా పావులు కదుపుతున్నది. ఈ చర్య వ్యవసాయ ఉత్పత్తి వ్యయంలో ఆదా చేయాలనే సూత్రానికి పూర్తిగా విరుద్ధం. ఫలితంగా వ్యవసాయ పెట్టుబడులు పెద్దఎత్తున పెరిగి సంక్షోభం నెలకొంటుంది. విత్తనాలు, ఎరువులు, డీజిల్, విద్యుత్ ధరలు పెద్దఎత్తున పెరిగిన ఫలితంగా ధరలు నియంత్రణ లేకుండా పెరుగుతున్నాయి. జిఎస్‌టి మరో అదనపు బరువుగా మారింది. కనుక ప్రభుత్వం ధరలను నియంత్రించి అదుపులో పెట్టాలి. ధరలను నియంత్రించి రైతుల వ్యయాన్ని తగ్గించే చర్యలను తీసుకోవలసిన ప్రభుత్వం అందుకు భిన్నంగా నియంత్రణకు నీళ్ళొదిలి, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించి, రైతుల కష్టంతో వారికి లాభాలు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నది.

> **"తీవ్రమైన కరువు పరిస్థితుల వల్ల జీవనోపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుండిపట్టణ ప్రాంతాలకు పెద్దసంఖ్యలో వలసలు వెళుతున్నారు. పనికోసం ఎదురుచూస్తున్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగులను ఆదుకునేందుకు వీలుగా ఎంజిఎన్ఆర్ఇజిఎ ద్వారా పనులు కల్పించడంతో పాటు, ఆహార భద్రతను కల్పించే విధంగా కేటాయింపులను పెంచాలి. కాని ప్రభుత్వం అందుకు పూర్తి భిన్నంగా చేస్తున్నది. ఇందుకోసం గత యేడాది కంటే వెయ్యి కోట్లు తక్కువగా కేటాయింపులు చేశారు."**



ఉపాధి హామీ పనులు చేస్తున్న వ్యవసాయ కార్మికులు

ప్రచారార్భాటం కోసం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని చెబుతున్నప్పటికీ ఆచరణలో రైతుల కష్టాలను, దుఃఖాన్ని రెట్టింపు చేసే ప్రయత్నం చేస్తున్నది.

ప్రభుత్వం రైతులను రుణభారం నుంచి విముక్తి చేసే చర్యలను చేపట్టలేదు. ఆర్థిక సర్వే ద్వారా ప్రభుత్వం అందుకు భిన్నంగా "పవిత్రమైన బాధ్యత పత్రం" ప్రకటించింది. రుణం చెల్లించకపోవడం ఎంత పాపమో రుణవిముక్తులు కాకుండా చనిపోతే వారి ఆత్మ ఎలాంటి విపత్తులను ఎదుర్కొనాల్సి ఉంటుందో చెప్పింది. ఇస్లాంలో చెప్పినట్టు ఒక వ్యక్తి రుణం చెల్లించకుండా చనిపోతే స్వర్గ ప్రవేశం సాధ్యం కాదని, బైబిల్ ప్రకారం కూడా అలాంటి కష్టాన్నే ఎదుర్కొనాలని ఆర్థికసర్వేలో ప్రవచించారు. విధాన నిర్ణేతలు ప్రజల కష్టాన్ని తొలగించడానికి బదులు నిరంతరం రుణభారంతో కుంగిపోతారని, మరణానంతరం ఆత్మ కష్టాలను దుర్కొంటుందని శపిస్తున్నారు. ఇంతకంటే మూఢత్వం ఇంకేముంటుంది?

తీవ్రమైన కరువు పరిస్థితుల వల్ల జీవనోపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుండిపట్టణ ప్రాంతాలకు పెద్దసంఖ్యలో వలసలు వెళుతున్నారు. పనికోసం ఎదురుచూస్తున్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగులను ఆదుకునేందుకు వీలుగా ఎంజిఎన్ఆర్ఇజిఎ ద్వారా పనులు కల్పించడంతో పాటు, ఆహార భద్రతను కల్పించే విధంగా కేటాయింపులను పెంచాలి. కాని ప్రభుత్వం అందుకు పూర్తి భిన్నంగా చేస్తున్నది. ఇందుకోసం గత యేడాది కంటే వెయ్యికోట్లు తక్కువగా కేటాయింపులు చేశారు. గతంలో కూడా అవసరమైన దాని కంటే తక్కువగా కేటాయించి, సంవత్సరానికి 100 రోజులు పని కల్పించి సమర్థంగా అమలుచేయాల్సిన పథకాన్ని నీరుగార్చారు.

మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద మద్దతు ధరల కోసం చేసిన కేటాయింపులు తక్కువగా ఉండి సేకరణ అవసరాలను ఎంతమాత్రం తీర్చలేదు. అంతేకాకుండా ధరల వ్యత్యాసం చెల్లింపు ప్రయోజనం రైతులకు కాకుండా వ్యాపారులకు లభించింది. కేటాయించిన వెయ్యికోట్లలో ఎంత అదనపు సేకరణకు వినియోగించారో చెప్పగలవారు లేరు. 2019లో ప్రకటించిన కనీస మద్దతు ధర చాలా స్వల్పమనేది ముఖ్యమైన అంశం. గ్రామీణ ప్రాంతాల్లో నీటిపారుదలకు ఇజ్రాయల్ నమూనా పేరిట పాలస్తీనా హక్కులను కాలరాసే నేటాఫాం లాంటి అనుమానాస్పదమైన కంపెనీలకు అవకాశం కల్పించారు.

వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, ప్రైవేట్ సంస్థల తోడ్పాటుతో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని అమలుచేయడం ద్వారా

**❝ బీమా కంపెనీలు రైతుల నుంచి వసూలు చేసిన మొత్తం 20,747 కోట్లు కాగా రైతులకు చెల్లించింది కేవలం 7,966 కోట్లు మాత్రమే. 13,000 కోట్లకు పైగా మొత్తం బీమా కంపెనీల పాలైంది. 2018 డిసెంబరు నాటికి రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్ సీజన్‌లో ధృవీకరించిన 5,171 కోట్ల రూపాయల బీమా క్లెయిములను కంపెనీలు ఆమోదించలేదు. ప్రభుత్వం ఈ పథకం కింద రూపొందించిన నిబంధనలే దీనికి కారణం. ❞**

మత్స్యరంగంలోని లోటును తొలగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆధునికీకరణ పేరిట కార్పొరేట్ మత్స్య సంస్థలకు ద్వారాలు తెరిచారు. పాల ఉత్పత్తిదారుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ పేరిట చేపట్టిన చర్యలు ఆ రంగాన్ని కుదేలు చేసి పాడిరైతుల పాలిట శాపమైంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవసాయ సబ్సిడీలను తగ్గించడంతో పాటు ప్రభుత్వ పెట్టుబడుల వాటా లను కూడా తగ్గించుకునే దిశగా సాగుతున్నది. ప్రైవేటు వ్యాపారులు, ఉత్పత్తి సంస్థలు రైతు సహకార సంఘాల గురించి ప్రస్తావించడం లేదు. కాంట్రాక్టు పద్ధతిలో వ్యవసాయం గురించి మాట్లాడుతున్నారు. విదేశీ పెట్టుబడులను అన్ని చోట్లా ప్రవేశపెట్టి నేరుగా బడా వ్యాపారులు ఉత్పత్తులను సేకరించుకునేందుకు, రిటైల్ రంగాన్ని కూడా తమ గుప్పిట్లో పెట్టుకునే దిశగా అడుగులు పడుతున్నాయి.

కరువు పరిస్థితులున్నప్పటికీ దురదృష్టవశాత్తు రాష్ట్రాలకు సాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం పేరుతో బిజెపి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం సాగించినా కరువు బారిన పడిన రైతాంగాన్ని ఆదుకోవడంలో ఘోరంగా విఫలమయింది. బీమా కంపెనీలు రైతుల నుంచి వసూలు చేసిన మొత్తం 20,747 కోట్లు కాగా రైతులకు చెల్లించింది కేవలం 7,966 కోట్లు మాత్రమే. 13,000 కోట్లకు పైగా మొత్తం బీమా కంపెనీల పాలైంది. 2018 డిసెంబరు నాటికి రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్ సీజన్‌లో ధృవీకరించిన 5,171 కోట్ల రూపాయల బీమా క్లెయిములను కంపెనీలు ఆమోదించలేదు. ప్రభుత్వం ఈ పథకం కింద రూపొందించిన నిబంధనలే దీనికి కారణం. ఖరీఫ్ కాలం ముగిసిన రెండు నెలల్లో లేదా 2019 ఫిబ్రవరి నాటికి బకాయిలు చెల్లించాలనే నిబంధన ఉంది. అంచనా వేసిన 12,867 కోట్ల రూపా యలలో దాదాపు 40 శాతం 2019 మే 10వ తేదీ నాటికి చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం దీనిని గురించి ఎంతమాత్రం ప్రస్తా వించటం లేదు. కరవుకాలంలో ఇలాంటి ఉదాసీనత నేరం, దాన్ని సరిదిద్దుకోవాలి.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి పథకం కింద రెండు హెక్టార్ల భూమి గల రైతులకు యేడాదికి 6,000 రూపాయలు ఇవ్వడం ద్వారా వారి సమస్యలను నివారించవచ్చని ప్రచారం చేశారు. గత వ్యవసాయ సెన్సస్ గణాంకాల ప్రకారం రెండు హెక్టార్ల లోపు భూమిగలవారు 12 కోట్ల మంది ఉన్నారని తెలుస్తున్నది. వాస్తవానికి వారి సంఖ్య అంతకంటే ఎక్కువ. కౌలురైతులను, ఆదివాసీ రైతులను భూమి రికార్డుల్లో నమోదు చేయకపోవటం వల్ల వారు ఈ పథకం పరిధిలోకి రాకుండా పోయారు. అంతేకాక వారికి చెల్లిస్తామన్న ఆరువేల రూపా యలు చాలా తక్కువ. నెలకు 500 రూపాయలు, రోజుకు 17 రూపాయలు మాత్రమే. ఇక్కడే ఈ పథకంలోని డొల్లతనం బయటపడుతున్నది. మద్దతు ధరకు ఈ పథకానికి ఎంత తేడా ఉన్నదో స్పష్టంగా అర్థమవుతున్నది. ప్రభుత్వం ఉత్పత్తివ్యయానికి సగం కలిపి లెక్కించి సేకరించేందుకు సిద్ధం కాకుండా కేవలం కొద్దిపాటి మొత్తాన్ని ఆశపెట్టి చేతులు దులుపు కుంటున్నది. పశ్చిమబెంగాల్‌లో రెండు హెక్టార్ల భూమితో వ్యవసాయం చేసే రైతు హెక్టారుకు 4.5 టన్నుల చొప్పున 9 టన్నులు పండిస్తాడు. క్వింటాలుకు 1815 రూపాయలు మద్దతు ధర లభిస్తే ఆ రైతుకు 1,63,350 రూపాయల మొత్తం ఆదాయంగా పొందుతాడు. బెంగాల్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వం సేకరించకపోవడం వల్ల రైతులు తక్కువ ధరల కు తమ పంటలను అమ్ముకోవాల్సి వస్తున్నది. అలాంటి పరిస్థితుల్లో రైతు క్వింటాలు 1000 రూపాయలకు అమ్మడం వల్ల కేవలం 90,000 రూపాయలు మాత్రమే పొంది, 73,350 రూపాయలు నష్టపోతున్నాడు. ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతంతో కలిపి లెక్కిస్తే రైతులు అంతకంటే ఎక్కువే నష్టపోతు న్నాడు. వ్యవసా య సబ్సిడీలు, పండిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ఉత్పత్తి వ్యయం పెరుగుతున్నా పంట ల ధరలు పడిపోతున్నాయి. అలాంటి పరిస్థితు ల్లో రైతులకు నగదు బదలాయింపు చేస్తామని ప్రవేశపెడుతున్న పథకాలు మరిన్ని నష్టాలను కలిగిస్తాయి. కేరళలోని వామపక్ష ప్రభుత్వం ఇలాంటి పరిస్థితుల్లో అనుసరిస్తున్న పద్ధతి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. క్వింటాలుకు 2650 రూపాయలతో ధాన్యం సేకరణ వల్ల రైతుకు 2,11,500 రూపాయలు లభిస్తున్నది. ఇది తాజా మద్దతు ధర కంటే 48,150 రూపా యలు ఎక్కువ. దేశంలోని ఇతర ప్రాంతాల్లోని రైతులు పొందే మొత్తం కంటే 1,21,500 రూపాయలు ఎక్కువ.

మరో ఉదాహరణ మధ్యప్రదేశ్‌లోని వెల్లుల్లి రైతులకు సంబంధించినది. కిలో వెల్లుల్లి ఉత్పత్తి వ్యయం 27 రూపాయలుగా ప్రభుత్వం అంచనా వేస్తే రైతులు మాత్రం 33-35 రూపాయల వరకు ఉంటుందంటున్నారు. నీముచ్ మార్కెట్‌లో రైతుకు కిలోకు రూపాయి మాత్రమే లభిస్తున్నది. హెక్టారుకు 5600 కిలోలు ఉత్పత్తి అవుతుంటే మద్దతు ధర కిలో 36 రూపాయలు కాగా రైతులకు ఎలాంటి మేలు కలగడం లేదు. ప్రభుత్వం వేసిన అంచనా ప్రకారం ఉత్పత్తి వ్యయం చూసినా హెక్టారుకు 1,51,200 అవుతుంది. ప్రధానమంత్రి కిసాన్ పెన్షన్ యోజన పథకం తొలి మూడేళ్లలో 5 కోట్ల మంది లబ్ధిదారులకు యేడాదికి 1200 రూపాయల చొప్పున 60 యేళ్ళు వయసు వరకు ఇస్తారు. అయితే రైతులు 25 వయసు నుండి 40 ఏళ్ళ వరకు నెలనెలా నిర్ణీత మొత్తం చెల్లిస్తే 40 నుండి 60 యేళ్ళు వచ్చేవరకు పెన్షన్ చెల్లిస్తారు. అంటే ఇప్పటి ఉండి రైతులు నిర్ణీతమొత్తం చెల్లించటం ప్రారంభిస్తే 2034 నాటికి చెల్లింపు ప్రారంభ మౌతుంది. ఇపుడు అమలు జరుపుతామని చెపుతున్న పథకాలనే రద్దుచేయటానికి, మార్పు లు చేస్తూ, లబ్ధిదారుల సంఖ్యను నిరంతరం తగ్గించటానికి ప్రయత్నం చేస్తుంటే 15 ఏళ్ళ తర్వాత అమలు జరిగే పథకం గురించి ప్రచా రం చేయటం హాస్యాస్పదం. అమలు జరుగు తుందనుకొన్నా 60 ఏళ్ళకు పై బడిన రైతులను గాలికి వదిలేశారు. పైబడిన రైతులకు కూడా పెన్షన్ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి.

అమెరికా, ఐరోపా యూనియన్‌లోని ఇతర

దేశాలు కూడా తమ బడ్జెట్‌లలో వ్యవసాయానికి మద్దతుగా నిధులు కేటాయిస్తున్నారు. భారత ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా సబ్సిడీలను తగ్గించి దిగుమతి సుంకాలను లేకుండా చేసి మన రైతులను ఇతర దేశాల రైతులతో అసమ పోటీలో నిలుపుతున్నది. 2015లో యూరోపియన్ యూనియన్ 363 బిలియన్ యూరోలు లేదా 25.9 లక్షలకోట్లు వ్యవసాయంపై ఖర్చుపెట్టాయి. 2014-2020లలో 38 శాతం వ్యయం వ్యవసాయంపైనే. సగటున ప్రతి రైతుకు అమెరికాలో సబ్సిడీగా 68,910 డాలర్లు, యూరోపియన్ యూనియన్‌లో 12,384 డాలర్లు, జపాన్‌లో 14,136 డాలర్లు ఇవ్వగా ఇండియాలో మాత్రం కేవలం 228 డాలర్లు మాత్రమే ఇస్తున్నారు. ఈ అసమ వాతావరణంలో భారతదేశం సబ్సిడీలను మరింతగా తగ్గించబోతోంది. వ్యవసాయంలో, చిల్లర వర్తకంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించడం ద్వారా నియంత్రణలను మరింతగా సడలించే ప్రతిపాదనలతో ఉంది.

ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న బిజెపి కార్పొరేట్ల నిధుల కోసం వారి అడుగులకు మడుగులొత్తుతూ ఎన్నికల్లో తమ లక్ష్యాలను పరిపూర్తి చేసుకునేందుకు ఈ "పవిత్రమైన ఖరారునామా"ను ప్రవచిస్తున్నది. దీనిని ఐక్య ఉద్యమాల ద్వారా అడ్డుకోవడమే ఏకైక మార్గం

బిజెపి నయా ఉదారవాద ఆర్థిక విధానాలను, సరళీకరణను అనుసరిస్తూ నియంత్రణలను త్వరితగతిన ఎత్తివేస్తున్నది. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా నియంత్రణలను ఎత్తివేసేది. బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక వివాదాస్పద బిల్లులకు, కార్మిక వ్యతిరేక కోడ్లకు ఎలాంటి సమీక్ష లేకుండానే, నామమాత్రపు నిరసన కూడా వ్యక్తం చేయకుండా కాంగ్రెస్ వంతపాడింది. ఇటీవల కాలంలో జరిగిన అనేక సంఘటనల్లో కాంగ్రెస్ హిందూ సానుకూల ధోరణిని ప్రదర్శించింది. ఆ పార్టీ నుంచి ఎన్నికలైన ప్రజాప్రతినిధులు నిస్సంకోచంగా పలు రాష్ట్రాల్లో బిజెపిలోకి ఫిరాయిస్తున్నారు. నయా ఉదారవాద సిద్ధాంతం అవసానదశకు చేరడం వల్ల ఎలాంటి వ్యతిరేకత వ్యక్తం కావడం లేదు.

గడచిన ఐదున్నరేళ్ళకాలంలో కొత్త తరహా సంఘీభావం వ్యక్తం కావడంతో పాటు సమస్యల ప్రాతిపదికన ఐక్యతతో ఉద్యమాల నిర్మాణం జరుగుతున్నది. కిసాన్ లాంగ్ మార్చ్, మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీ, కార్మికుల సమ్మెలు, దళితులు, ఆదివాసీలు, విద్యార్థులు, యువజనులు, మహిళలు సమస్యల ప్రాతిపదికన భూమిపై హక్కుల కోసం, గిట్టుబాటు ధరల

> **"ఈ అనుభవాలు అనేక పాఠాలను నేర్పించాయి. ఆ దిశగా అఖిల భారత కిసాన్ సభ ఇప్పటికే సంస్థాపరంగా ఐక్య ఉద్యమ నిర్మాణాన్ని ఆచరణలో పెట్టి "ప్రతిగ్రామంలో కిసాన్ సభ: ప్రతి రైతు కిసాన్ సభలో" అనే నినాదంతో ఉద్యమిస్తున్నది. స్వతంత్ర, ఐక్య ఉద్యమాల నిర్మాణాన్ని కొనసాగిస్తూ మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. 2019 ఆగస్టు 2న ఎఐకెఎస్ కార్మిక హక్కులపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలకు సంఘీభావం ప్రకటించింది."**



ఎఐకెఎస్‌సిసి నాయకత్వంలో పార్లమెంటుకు రైతాంగ ప్రదర్శన

కోసం, రుణమాఫీ కోరుతూ, విచక్షణారహితంగా చేస్తున్న భూసేకరణను వ్యతిరేకిస్తూ భూమి అధికార్ ఆందోళన్ సాగిస్తున్న పోరాటాలు, ఆలిండియా రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, మతతత్వవాదులకు వ్యతిరేకంగా జన్ ఏకతా, జన్ అధికార్ సంస్థలు సాగించే ఉద్యమాలన్నీ నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేక వాతావరణాన్ని కల్పించాయి. ఈ అనుభవాలు అనేక పాఠాలను నేర్పించాయి. ఆ దిశగా అఖిల భారత కిసాన్ సభ ఇప్పటికే సంస్థాపరంగా ఐక్య ఉద్యమ నిర్మాణాన్ని ఆచరణలో పెట్టి "ప్రతిగ్రామంలో కిసాన్ సభ: ప్రతి రైతు కిసాన్ సభలో" అనే నినాదంతో ఉద్యమిస్తున్నది. స్వతంత్ర, ఐక్య ఉద్యమాల నిర్మాణాన్ని కొనసాగిస్తూ మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. 2019 ఆగస్టు 2న ఎఐకెఎస్ కార్మిక హక్కులపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలకు సంఘీభావం ప్రకటించింది. ఆగస్టు 3వ తేదీ ఎఐకెఎస్ జిల్లాలవారీగా ఎఐకెఎస్ సిసితో కలిసి జిల్లాలవారీగా వినతిపత్రాలు సమర్పించింది. గత ఐదున్నరేళ్ళకాలంలో సాగిన ఉద్యమాల ఫలితంగా గిట్టుబాటు ధరలకు హామీ, రైతుల రుణవిముక్తి కోసం రూపుదిద్దుకున్న రెండు కిసాన్ ముక్తి బిల్లుల విషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని కోరారు. 2019 సెప్టెంబరు 5న కార్మిక హక్కులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఎఐకెఎస్ దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపిచ్చి కార్మికులకు విస్తృత స్థాయి మద్దతు కూడగట్టింది. ఈ ఐదున్నరేళ్ళ కాలంలో సాగిన ఉద్యమాల కారణంగా అణగ దొక్కబడుతున్న కార్మిక, రైతు వర్గాలు మరింత సంఘటితమయ్యాయి. కార్మిక హక్కులపై సాగుతున్న దాడులు, వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు చేస్తున్న యత్నాలను ఐక్యంగా ఎదుర్కొంటున్నారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, మతతత్వవాదులు, అధికారతత్వవాద ధోరణులకు పోటీగా ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. మతతత్వ ప్రతీఘాత వాదులను సైద్ధాంతికంగా రాజకీయంగా ఎదుర్కొనేందుకు ఉద్యమ నిర్మాణం జరగాలి. బలమైన ఐక్య ప్రజాఉద్యమ విజయం తోనే ప్రతీఘాతశక్తుల కబంధ హస్తాల నుంచి దేశాన్ని కాపాడగలం. ఈ విధం గా కార్మికులు, రైతులు, వివిధ వర్గాల కష్ట జీవులు బిజెపి విధానాలను ప్రతిఘటించాలని, జనవరి 8న జరిగే సార్వత్రిక కార్మికసమ్మెను, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, గ్రామీణ కార్మికులు తదితర శ్రామిక ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

అనువాదం: జి. ఆంజనేయులు

# కార్మికుల డిమాండ్ల సాధనే ప్రధాన లక్ష్యం

సిహెచ్ నరసింగరావు



రచయిత సిఐటియు ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు

నెల్లూరులో డిసెంబరు 15 నుంచి 17 వరకూ సిఐటియు ఆంధ్రప్రదేశ మహాసభలు జరిగాయి. ప్రతి మహాసభకు ఒక ప్రత్యేకత ఉంటుంది. మారుతున్న రాజకీయ నేపథ్యంలో ఈ మహాసభలకు చాలా ప్రాధాన్యత ఉంది. స్వాతంత్రం వచ్చిన అనంతరం కార్మికహక్కులపై ఇంత దాడి ఎన్నడూ జరగలేదు. స్వాతంత్ర్యం ముందు నుంచి పోరాడి సాధించుకున్న హక్కులను బిజెపి ప్రభుత్వం కబళిస్తున్నది.

1926లో ట్రేడ్ యూనియన్ చట్టం వచ్చింది. ఆ చట్టం ప్రకారం ఏడుగురు సభ్యులుంటే సంఘం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ రోజు వేలాది మంది కార్మికులున్నా యూనియన్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వాలు అడ్డుపడుతున్నాయి. ఫలితంగా కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. తామెదుర్కొంటున్న సమస్యలను గురించి ఎవరికి చెప్పుకోవటానికి కార్మికులకు అవకాశం లేకుండా పోయింది.

యాజమాన్యాలు చాలా దుర్మార్గంగా తమ దోపిడీని కొనసాగిస్తున్నాయి. అందుకే దీన్ని ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అంటున్నారు. ఈ కాలంలో బడా పెట్టుబడిదారులు, రాయకీయ నాయకులు, ఉన్నతాధికారులు ముగ్గురు కలిసి దోపిడీని తీవ్రం చేశారు. అందుకే దీన్ని బడా పెట్టుబడిదారులు అత్యధిక లాభాలు గడించే కాలంగా కాలంగా చెప్పొచ్చు.

గౌరవ వేతనం పేరుతో దేశంలో కోటి మంది స్కీము కార్మికులకు అతి తక్కువ జీతాలు ఇచ్చి పనిచేయిస్తున్నారు. వారిని కార్మికులుగా గుర్తించలేదు. వారికి పెన్షన్‌లేదు. ఇఎస్ఐ, పిఎఫ్ బోనస్ లాంటివి వర్తించడం లేదు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరుతో అతి తక్కువ వేతనాలతో పని చేయిస్తున్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో 4 లక్షల మందికి పైగా పని చేస్తున్నారు. వారికి అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు.

విశాఖ స్టీల్ లాంటి భారీ పరిశ్రమల్లో, విద్యుత్తు, ఆర్.టి.సి లాంటి రాష్ట్ర రంగాల్లో కూడా పర్మినెంట్ కార్మికుల కంటే కాంట్రాక్టు కార్మికులు ఎక్కువగా ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో యాజమానుల పక్షాన పని చేస్తున్నాయి. కార్మికశాఖ యాజమానుల శాఖలా మారిపోయింది. భారీ పరిశ్రమలను ప్రైవేటీకరించి దేశ సంపదను విదేశీ కంపెనీలకు కట్టబెడుతున్నారు. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై దాడినిపెంచారు. యాజమాన్యాలకు అనుకూలంగా వేతనాల కోడ్‌ను మార్చారు.

ముఖ్యంగా ప్రైవేటీకరణలో భాగంగా కీలక రంగాలైన రక్షణ రంగం, బొగ్గు, ఉక్కు, రక్షణ రంగం, కమ్యూనికేషన్ రంగం (బిఎస్ఎన్ఎల్) సహా అత్యవసర రంగాలను ప్రైవేటీకరించడం దేశద్రోహం. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తున్నది. గత కాలంలో నోట్ల రద్దు, జిఎస్‌టి పేరుతో పన్నుల పెంపు లాంటి చర్యల ద్వారా ప్రజలపై భారాలు వేయటాన్ని చూశాం. కానీ ప్రజా సమస్యలు పక్కన పెట్టి పాకిస్తాన్‌ను ఎదిరించే మొనగాడుగా మోడీని మీడియా కొనియాడింది. మతం, ప్రాంతం, భాషా భావోద్వేగాలను రెచ్చగొట్టే అంశాలతో ప్రజలను చీల్చవచ్చునని మోడీ విశ్వాసం. ఇది తాత్కాలికమే గాని ఎల్లకాలం సాగదు. మోడీకి వ్యతిరేకంగా యావత్ కార్మిక వర్గం ఐక్యమవడం అనివార్యం.

కార్మికవర్గం ఐక్యమైతే యావత్తు దేశాన్ని స్థంభింప చేయగల, తమ పోరాటాలతో మోడీని ఎదిరించి తమ హక్కులను సాధించుకోగల శక్తి కార్మికవర్గానికి ఉంది. మహాసభలో 30కి పైగా తీర్మానాలు ప్రవేశ పెట్టి కార్మిక వర్గం ఎదుర్కొనే అన్ని సమస్యలను తీర్మానాల రూపంలో చర్చించాం. కనీస వేతనాలు, జనవరి 8 సమ్మె, స్కీము కార్మికులను పర్మినెంట్ చేయటం, ప్రభుత్వ రంగాల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, అలాగే ప్రజలకు సంబంధించిన అధిక ధరలు, నిరుద్యోగం, రైతాంగ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై తీర్మానాలు చేశాం.

జనవరి 8 దేశవ్యాప్త సమ్మెకు ప్రాధాన్యత ఉంది. దేశంలోని 10 సెంట్రల్ ట్రేడ్ యూనియన్‌లు, వివిధ రాష్ట్రాల్లోని సంఘాలు, ఫెడరేషన్‌లు, యాజమాన్యాలకు సమ్మె నోటీసులు జారీ చేస్తున్నాయి. కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచింది. సమ్మెలు అవసరమా? అని యాజమాన్య సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇది వరకు ఇచ్చిన డిమాండ్ల మీదే అన్ని సార్లు సమ్మెలు చేయాలా? సమ్మె చేస్తే జీతాలు పోతాయి కదా, సమ్మె చేస్తే యాజమాన్యాలు కక్ష గట్టి భయపెడతాయనే వారూ ఉన్నారు. వారందరూ ఆలోచించాల్సింది పోరాడకుండా కార్మికుల హక్కులు సాధ్యమా? కార్మికవర్గం కొత్త హక్కులు సాధించుకోవడం పక్కన పెట్టి నేడు ఉన్న హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది.

గత 5 సంవత్సరాలకు పైగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా కార్మికవర్గంపై దాడి చేస్తున్నది. సమరశీల పోరాటాలతో వాటిని ఎదిరించడం తప్ప కార్మిక వర్గానికి మరో ప్రత్యామ్నాయ మార్గం లేదు. యాజమాన్యాలు కక్షగడతాయని, భయ పెడతాయని ఆలోచిస్తే కార్మికవర్గం మరింత నష్ట పోతుంది. అందుకే తెగించి పోరాడుదాం. సమ్మె చేస్తే వేతనం పోతుందని ఒకరోజు జీతం కోసం చూస్తే ఉన్న హక్కులు పోయి పని భద్రత లేకుండా పోతుంది.

యావత్తు కార్మికవర్గంలో 97 శాతం అసంఘటితరంగాల్లో కార్మికులుగా ఉన్నారు. వారిలో స్కీము కార్మికులు, చిన్న పరిశ్రమల్లో కార్మికులు, ఎటువంటి రక్షణ చట్టాలు లేని

బిల్డింగ్ కార్మికులు, తోపుడు బళ్ల కార్మికులుగా ఉన్నారు. కాంట్రాక్టర్ల కింద పని చేసే పీస్ రేటు కార్మికులు కోట్లమంది ఉన్నారు. ప్రభుత్వాల ఆధ్వర్యంలో పని చేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు, బీడి లాంటి గృహ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు తదితర అసంఘటిత రంగంలోని కార్మికులకు ఏ చట్టాలు వర్తించడం లేదు.

అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని ప్రధానమైన డిమాండ్. కేంద్ర ప్రభుత్వం 2017లో నెలకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించింది. 1957 లోని జాతీయ కార్మిక సమావేశం ప్రకారం ఒక కార్మికుని కుటుంబంలోని 4 గురు సభ్యులకు అవసరమైన ఆహారం, దుస్తులు, ఇంటి అద్దెతో పాటు సుప్రీంకోర్టు నిర్ణయించిన విద్య, వైద్య అవసరాలను కులుపుకుని కేంద్ర ప్రభుత్వం ఆ నిర్ణయం చేసింది. గత 2 సంవత్సరాలుగా పెరిగిన ధరలను కలుపుకుని నెలకు రూ. 21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

దాంతో పాటు కార్మికులకు చట్టపరంగా రావల్సిన ఇఎస్ఐ, పిఎఫ్ వగైరా హక్కులను కూడా యాజమాన్యాలు అత్యధిక మంది కార్మికులకు వర్తింపచేయడం లేదు. వాటిని అమలు చేయాలని ట్రేడ్ యూనియన్‌లు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. పని భద్రత కోసం కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్నవారిగా గుర్తించి, పర్మినెంట్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరిస్తానని, ప్రభుత్వం వ్యాపారాలను నడపదని ప్రకటించింది. 2వ దఫా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రైవేటీకరణ చర్యలు దుందుడుకుగా కొనసాగిస్తున్నారు. వాస్తవంగా ప్రభుత్వం వ్యాపారం చేయకూడదు. ఆదర్శ యజమానిలా ఉండాలి. అందువల్లనే జీతభత్యాలు ప్రైవేట్ కంటే మెరుగ్గా ఉంటాయి. కార్మికులకు మెరుగైన జీతాలు ఉండకూడదనేది నేటి ప్రభుత్వ విధానం. దేశంలోని భారీ పరిశ్రమలను విదేశీ కంపెనీలు, వారితోభాగస్వాములైన బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టడం ప్రభుత్వ లక్ష్యం. ప్రైవేటుపరం చేయడం వల్ల ఆ కంపెనీలు లాభాలన్నింటినీ విదేశాలకు తరలించుకుపోతాయి. ఇది భారతదేశసంపదను విదేశాలకు తరలించటమే. ఇది బిజెపి దేశద్రోహానికి నిదర్శనం. ఇటీవల

> **“ అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని ప్రధానమైన డిమాండ్. కేంద్రప్రభుత్వం 2017లో నెలకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించింది. 1957లోని జాతీయ కార్మిక సమావేశం ప్రకారం ఒక కార్మికుని కుటుంబంలోని 4 గురు సభ్యులకు అవసరమైన ఆహారం, దుస్తులు, ఇంటి అద్దెతో పాటు సుప్రీం కోర్టు నిర్ణయించిన విద్య, వైద్య అవసరాలను కులుపుకుని కేంద్ర ప్రభుత్వం ఆ నిర్ణయం చేసింది. ”**



ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికుల ప్రదర్శన

కాలంలో బిఎస్ఎన్ఎల్‌ను బలహీన పర్చి, సుమారు 30 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఎయిర్ ఇండియాను ప్రైవేట్ పరం చేస్తున్నారు.

భారత రైల్వేలను –భూములను ప్రైవేటుకు అప్పగిస్తున్నారు. రక్షణ రంగంలోని 44 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దక్షిణ కొరియాకు చెందిన పోస్కో అనే కంపెనీకి అప్పగించాలని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. అందువల్ల ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయరాదనే నినాదంతో పోరాడుతునాం. జనవరి 8 పోరాటంలో ఇదొక ప్రముఖ నినాదం.

కార్మికవర్గం మిత్రులైన రైతాంగం చేతి వృత్తులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై కూడా పోరాడుతున్నాం. 7.2 కోట్ల మంది ఉపాధి కూలీలకు కనీస వేతనం అమలు జరపాలని, అట్టడుగున ఉన్నవారికి జీతభత్యాలు పెంచడం ద్వారా ఆర్థిక మాంద్యాన్ని అరికట్ట వచ్చుని సిఐటియు భావిస్తున్నది. పై డిమాండ్‌లు సాధించడానికి జనవరి 8 సమ్మె పిలుపును యావత్తు కార్మికలోకం ఆయుధంగా తీసుకోవాలి.

కొత్తగా వచ్చే పరిశ్రమలన్నీ సెజ్‌లలోనే పెడుతున్నారు. వీటిలో పరిశ్రమలు పెట్టే యాజమాన్యాలకు రాయితీలు పొందడమే ప్రధాన లక్ష్యం. ఫలితంగా సెజ్‌లు దోపిడీ కేంద్రాలుగా మారాయి. మొదట 5 సంవత్సరాలు రాయితీలు తీసుకుని ఆపై బోర్డు మార్చి మరో కంపెనీ పేరుతో రాయితీలు పొందుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లించి, అతి ఎక్కువ పనులు నిర్బంధంగా చేయించుకుంటున్నారు. సెజ్ చట్టం 2006 ప్రకారం దేశంలోని ఇతర కార్మికులందరికీ వర్తించే చట్టాలన్నీ వారికి వర్తిస్తాయి. కానీ ప్రభుత్వాలే ఆ చట్టాలు అమలు కాకుండా అడ్డుపడుతున్నాయి. కంపెనీ యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయి.

ట్రేడ్ యూనియన్ పెట్టుకోవడం కార్మికుల హక్కు. కార్మికచట్టం 1926 ప్రకారం ఏడుగురు సభ్యులుంటే సంఘం పెట్టుకోవచ్చు. కానీ సెజ్ కమిషనర్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ నమోదు చేయాలి. కానీ ఏదో సాకు చూపి రిజిస్ట్రేషన్ చేయకుండా సంవత్సరాల తరబడి తిప్పుతున్నారు. ఆలోగా సంఘాలు పెడుతున్న కార్మికులను గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఇది దుర్మార్గమైన కుట్ర. అన్ని చోట్ల కార్మికులు ఎదిరించి సమ్మె చేస్తున్నారు. సెజ్‌లలో కార్మికుల ప్రత్యేక సమ0స్యలపై కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలి. ❋

# సమ్మెలో సకల కార్మికవర్గం

ఎం ఎ గఫూర్



రచయిత ఆంధ్రప్రదేశ్ సిఐటియు ప్రధాన కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 2020 జనవరి 8వ తేదీన జాతీయ సార్వత్రిక సమ్మె నిర్వహించాలని దేశంలో ఉన్న ప్రధాన కార్మిక సంఘాలు, స్వతంత్ర జాతీయ ఫెడరేషన్లు కలిసి పిలుపునిచ్చాయి. నరేంద్రమోడీ నాయకత్వంలోని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత భారత కార్మికవర్గం జరుపుతున్న 4వ జాతీయ సమ్మె ఇది. గత మూడు జాతీయ సమ్మెలలో ప్రతి సమ్మెలో 18-20 కోట్ల మంది కార్మికులు పాల్గొని, ప్రభుత్వ విధానాల పట్ల తమ తీవ్ర వ్యతిరేకతను స్పష్టం జేశారు. ఇంత భారీ సంఖ్యలో కార్మికులు సమ్మెల ద్వారా రోడ్లు ఎక్కుతున్నా బిజెపి ప్రభుత్వం లెక్కచేయకుండా తన కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూనే ఉన్నది. ప్రత్యేకించి రెండో సారి ఎన్నికైన తర్వాత బిజెపి తన దూకుడును మరింతగా పెంచి కార్మికుల, ఉద్యోగుల హక్కులన్నింటినీ తొలగించి, వారిని పెట్టుబడిదారుల వద్ద ఆధునిక బానిసలుగా మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది.

2014లో బిజెపి అధికారంలోకి రావడం కోసం దేశ ప్రజలందరికీ మంచి రోజులు తెస్తామనే వాగ్దానం చేశారు. అప్పటికే దీర్ఘకాలంగా సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న భారత కార్మికవర్గం తరపున కార్మిక సంఘాలన్నీ కలిసి ఉమ్మడి కోర్కెల జాబితాను తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది. కార్మికులను, సాధారణ ప్రజలను ఏ మాత్రం లెక్కచేయని మోడీ సర్కార్ ఆ కోర్కెల పత్రాన్ని ఏ మాత్రం ఖాతరు చేయలేదు. దీర్ఘకాలంగా కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలనే బీజేపీ ప్రభుత్వం వేగవంతంగా అమలు చేయడం ప్రారంభించింది. పరిశ్రమల ప్రైవేటీకరణ విచ్చల విడిగా అమలుపర్చడం, ఒక్కో పరిశ్రమను కాకుండా గంపగుత్తగా అనేక పరిశ్రమలను కలిపి అమ్మేదానికి నిర్ణయించడం, రైల్వే, రక్షణ రంగాలతో సహా అన్ని రంగాల్లో నూరు శాతం విదేశీ పెట్టుబడిని అనుమతిస్తామని విధాన ప్రకటన చేయడంతో 2015 సెప్టెంబర్‌లో అన్ని కార్మిక సంఘాలు ఒక రోజు సమ్మె ద్వారా తమ తీవ్రమైన నిరసనను ప్రభుత్వానికి తెలియజేశాయి. అయితే నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక సంఘాలను, జాతీయ సమ్మెను ఏ మాత్రం లెక్క చేయకుండా తమ కార్పొరేట్ అనుకూల విధానాల అమలును కొనసాగించింది. దీనితో 2016లో మరోసారి జాతీయ సమ్మె 2019లో రెండు రోజుల జాతీయ సమ్మెలు చేయాల్సి వచ్చింది. 2018లో దేశవ్యాప్తంగా భారీ ఎత్తున కార్మికులు కదిలి ఢిల్లీలో మహాపడావ్‌ను నిర్వహించారు.

2019 ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ మతోన్మాదం, నకిలీ జాతీయవాదం ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి తిరిగి అధికారంలోకి వచ్చింది. అప్పటి నుండి బిజెపి పాలనలో దూకుడు పెరిగింది. మొత్తం కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి 4 లేబర్ కోడ్‌ల ద్వారా కార్మిక సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెబుతూ పార్లమెంట్‌లో ఈ లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టింది. ఈ లేబర్ కోడ్‌లు కేంద్ర ప్రభుత్వ కార్మికశాఖలోని అధికారులు తయారు చేసినవి కావు. భారత పారిశ్రామికవేత్తల సంఘాలు, న్యాయ కోవిదులను కలుపుకుని కార్మికులకు ఏ హక్కులు మిగలని పద్ధతిలో ఈ కోడ్‌లను రూపొందించారు. పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఈ కోడ్‌లను ఏ మాత్రం సమీక్ష చేయకుండానే వాటిని ఆమోదింప చేయడానికి బిజెపి ప్రభుత్వం పడుతున్న ఆతృతను గమనిస్తే వారికి సామాన్య కార్మికుల ప్రయోజనం కంటే పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారుల ప్రయోజనాలే మిన్న అనేది అర్థమవుతుంది.

ఈ సమ్మె ప్రధాన కోర్కెల్లో కేవలం కార్మికుల కనీస వేతనం రూ.21 వేలకు పెంచాలనే డిమాండ్ మాత్రమే కాదు. దేశ స్వావలంబనను దెబ్బతీస్తున్న ఆర్థిక విధానాలను వ్యతిరేకించటం, ప్రభుత్వరంగ పరిశ్రమలను పరిరక్షించడం, సమాన పనికి సమాన వేతనం, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించడం లాంటి కార్మిక సమస్యలతో పాటు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతాంగానికి మద్దతు ధరను ప్రకటించి రైతాంగాన్ని కాపాడాలని, వ్యవసాయ కూలీలకు సాలీనా 200 రోజులు పనులు కల్పించాలని, సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి చౌకధరలకు నిత్యావసర వస్తువులు అందించాలని ఈ సమ్మె డిమాండ్లలో భాగంగా చేర్చడం జరిగింది. వీటితో పాటుగా కేంద్ర ప్రభుత్వం ఏక పక్షంగా 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం, కాశ్మీర్ రాష్ట్రాన్ని ముక్కలు చేసి కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడాన్ని ఆ రాష్ట్రంలోని రాజకీయ నాయకులందర్నీ అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని హత్యచేయడాన్ని ఖండిస్తూ ఢిల్లీలో జరిగిన కార్మికసదస్సు తీర్మానించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం దేశంలో మతం ఆధారంగా ప్రజల్ని విభజించడానికి చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా కార్మికుల్ని ఐక్యంగా సమీకరించాలని కార్మిక సదస్సు పిలుపునిచ్చింది.

ఇది దేశంలో సరళీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న 19వ జాతీయ సమ్మె. సరళీకరణ ఆర్థిక విధానాలు దేశంలోని కార్మికుల ప్రయోజనాలకు తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. ఈ విధానాలు రైతాంగ ప్రయోజనాలను కూడా నష్టపర్చి వ్యవసాయాన్ని సంక్షోభంలో నెడుతున్నాయి. ఈ విధానాలు అమలు జరిగినప్పటి నుండి (1991) దేశంలో 3 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు జరిగినా వీటికిగల కారణాలను, దీనికి మూలమైన ఆర్థిక విధానాలను సమీక్షించడానికి గత యుపీఏ ప్రభుత్వం సిద్ధపడలేదు. అందుకే అది

ప్రజలకు దూరమైంది. అయితే 2014లో బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తూ పెట్టుబడికి 50 శాతం అదనంగా ఉండేట్లుగా మద్దతు ధర నిర్ణయిస్తామని నమ్మబలికింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయమే మర్చిపోయింది. బిజెపి గత 5 సంవత్సరాల్లో దేశంలోని ధనిక వర్గాలకు లక్షల కోట్ల పన్ను రాయితీలను ఇచ్చింది. వారు బ్యాంకుల్లో తీసుకున్న లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దు చేసింది. ఇదే కాలంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో రైతులు మద్దతు ధర, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని కోరుతూ ఆందోళనలు చేస్తే వారిపై తీవ్రమైన నిర్బంధాన్ని, అణచివేత చర్యలను అమలు చేసింది. మధ్యప్రదేశ్‌లో నాటి బిజెపి ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపించటంతో ముగ్గురు రైతులు మరణించారు. ఉత్తరాఖండ్ నుంచి ఢిల్లీకి వస్తున్న రైతుల పాదయాత్రపై కేంద్ర ప్రభుత్వమే పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించింది. లాఠీ చార్జీలు, నీటి ఫిరంగులు వాడటం ద్వారా రైతుల పోరాటాన్ని అణచివేయాలని ప్రయత్నించింది. దేశవ్యాప్తంగా రైతుల ఆందోళనలు చేసిన ప్రతి చోటా ఈ నిర్బంధ చర్యలు అమలు జరిగాయి. నేడు దేశంలోని అనేక రైతుసంఘాలు కలిసి రైతుల రుణమాఫీకై ఆందోళనలు చేస్తున్నాయి. స్వామి నాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని పెద్ద ఎత్తున రైతు సంఘాలు కదులుతున్నాయి. అందుకే స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, ఆ ప్రాతిపదికపై వ్యవసాయ పంటలకు మద్దతు ధరలను నిర్ణయించాలని కోరుతూ సమ్మె డిమాండ్లలో చేర్చడం జరిగింది.

2014 బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కరువు పరిస్థితుల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. అప్పులు పెరిగిపోయి పంట చేతికి రాక నైరాశ్యంతో అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఏ మాత్రం స్పందించలేదు. సినిమా కళాకారులు, స్వచ్ఛంద సంఘాలు ముందుకు వచ్చి రైతాంగానికి సహాయ కార్యక్రమాలు చేపట్టినా బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయడానికి సహాయం చేయమని కోరితే కేంద్ర ప్రభుత్వం “అది మీ కార్యక్రమం తప్ప మాకు సంబంధం లేదని” నిరాకరించింది. కానీ ఇదే బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు 5 లక్షల కోట్ల రూపాయలకుపైగా రుణాలను మాఫీ చేసింది. అంతేగాక ప్రభుత్వరంగ బ్యాంకులకు సుమారు 10 లక్షల కోట్లు బకాయిలు పెట్టిన కార్పొరేట్ సంస్థలపై ఏ చర్య తీసుకోకుండా వారికి తోడ్పడుతున్నది. విజయమాల్యా, నీరవ్‌మోడీ లాంటి దొంగలు బ్యాంకుల ధనాన్ని కొల్లగొట్టి విదేశాల్లో ఉన్నా, వారిపై ఏ చర్య తీసుకోకుండా ఉన్నది. పెద్దనోట్ల రద్దు తరువాత బ్యాంకులకు వచ్చిన ప్రజా ధనాన్ని కొత్త రుణాల పేరుతో పెట్టుబడిదార్లకు పంచి పెట్టింది. ఇటీవల రిజర్వుబ్యాంకు నుండి రూ. 1,76,000 కోట్లు కేంద్ర ప్రభుత్వం తీసుకుని వారం రోజుల్లో రూ. 1,45,000 కోట్లు కార్పొరేట్ పన్నులను తగ్గిస్తూ సంపన్నులకు సహాయం చేసింది. పెట్టుబడిదారులు, సంపన్నులకు సహాయం చేయడమే తప్ప రైతులకు సహాయం చేయడం భారతీయ జనతాపార్టీ అజెండాలో లేదు.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఈ దేశంలోని నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు ఎంతో ఉపయోగపడుతున్నది. ఈ పథకం క్షేత్రస్థాయిలో మరింత విస్తారంగా అమలు జరపడం ద్వారా దేశంలో ఆకలి, ఆహార కొరత లేకుండా చేయవచ్చు. అయితే భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం క్రమంగా ఉపాధిహామీ పథకానికి నిధులను తగ్గిస్తున్నది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగి పని దినాలు తగ్గిపోతున్నటువంటి పరిస్థితుల్లో ఉపాధిహామీకి నిధులు పెంచి ప్రభుత్వం పేదలను ఆదుకోవాల్సింది పోయి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. అందుకే కార్మిక సంఘాలు, రైతాంగం, వ్యవసాయ కార్మికుల సమస్యలను కూడా ముందుకు తెచ్చి జాతీయ సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. ఇప్పటికే రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు జనవరి 8ని “గ్రామీణ బంద్”గా నిర్వహించాలని తీర్మానించాయి. పట్టణాల్లో కార్మికవర్గం, గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు కలిసి జనవరి 8 ప్రజా సమ్మెగా నిర్వహించాలని తలపెట్టడం ఈ దేశంలో ప్రజా ఉద్యమాలకు ఎంతో ప్రోత్సాహన్నిస్తుంది. క్షేత్రస్థాయిలో కార్మిక కర్షకులు ఏకమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలవేయడం, హక్కులను సాధించుకోవడం సులభమవుతుంది. భారతదేశ రాజకీయాల్లో కొత్త సమీకరణలు జరిగి ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులు పెరగడానికి తోడ్పడుతుంది. జనవరి 8వ తేదీ సమ్మె ఇందుకు నాందీ వాచకం పలకనున్నది. ❋

**“ కానీ ఇదే బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు 5 లక్షల కోట్ల రూపాయలకుపైగా రుణాలను మాఫీ చేసింది. అంతేగాక ప్రభుత్వరంగ బ్యాంకులకు సుమారు 10 లక్షల కోట్లు బకాయిలు పెట్టిన కార్పొరేట్ సంస్థలపై ఏ చర్య తీసుకోకుండా వారికి తోడ్పడుతున్నది. విజయమాల్యా, నీరవ్‌మోడీ లాంటి దొంగలు బ్యాంకుల ధనాన్ని కొల్లగొట్టి విదేశాల్లో ఉన్నా, వారిపై ఏ చర్య తీసుకోకుండా ఉన్నది. పెద్దనోట్ల రద్దు తరువాత బ్యాంకులకు వచ్చిన ప్రజా ధనాన్ని కొత్త రుణాల పేరుతో పెట్టుబడిదార్లకు పంచి పెట్టింది. ”**

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# కార్మిక హక్కుల హరణం: వ్యవసాయరంగానికి ప్రమాదం

ఎ కోటిరెడ్డి



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

కేంద్ర ప్రభుత్వం కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించటం వలన కార్మికులతో పాటు దేశ ప్రజానీకం కూడా తీవ్ర దుష్పరిణామాలను ఎదుర్కొంటారు. ప్రభుత్వం తీసుకొస్తున్న చట్ట సవరణలతో కార్మికుల ఆదాయాలు పడిపోతాయి. వారి జీవన ప్రమాణాలు దిగజారతాయి. నిరుద్యోగం పెరుగుతుంది. పంటలకు మద్దతు ధరలు, మార్కెట్ ధరలు పడిపోతాయి. రైతాంగం అప్పుల పాలవటం, ఆత్మహత్యలు చేసుకోవటం పెరుగుతుంది. పారిశ్రామికాభివృద్ధి పతనమౌతుంది. మాంద్యం మరింత తీవ్రమౌతుంది. ప్రధాని మోడి గొప్పగా ప్రచారం చేస్తున్న మేకిన్ ఇండియాకు విఘాతం కలుగుతుంది. మొత్తంగా ప్రజల జీవన ప్రమాణాలు పడిపోవటానికి, దరిద్రం పెరగటానికి ఈ చర్యలు దారితీస్తాయి. అందువలన రైతాంగం, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ప్రజానీకం, దేశంలోని పీడితవర్గాలు, మధ్యతరగతి, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులు, తదితరులంతా జనవరి 8వ తేదీన కార్మికవర్గం చేస్తున్న సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతునివ్వాలి. సమ్మె కార్మికవర్గానికి ఎంత అవసరమో, మిగతా పీడితప్రజలకు కూడా అంతే అవసరమనే చైతన్యాన్ని కలిగించాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వేతనాలకు సంబంధించిన కోడ్‌ను ఆగస్టు నెలలో ఉభయ సభలు ఆమోదించాయి. అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపటంతో చట్టంగా మారింది. యజమానుల ఆకాంక్షలకు అనుగుణంగా సంఘం పెట్టుకోవటానికి, సమ్మెచేయటానికి కార్మికులకు ఉన్న హక్కులను హరించటం, వారి వేతనాలను తగ్గించటం, ఆధునిక బానిసల స్థాయికి కార్మికులను దిగజార్చటం ప్రభుత్వం రూపొందిస్తున్న కోడ్‌లలోని ప్రధానాంశాలు.

2017లో కేంద్ర ప్రభుత్వం నిపుణత లేని పనులకు 176 రూపాయలను కనీస వేతనంగా ప్రభుత్వం నిర్ణయించింది. రెండు సంవత్సరాల అనంతరం 2 రూపాయలు మాత్రమే పెంచి 178 రూపాయలను కనీస వేతనంగా కేంద్ర కార్మికశాఖమంత్రి ప్రకటించాడు. రెండు సంవత్సరాల తర్వాత 1.36 శాతం మాత్రమే వేతనాలను పెంచుతున్నట్లు ప్రకటించారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకొంటే నిజవేతనం పడిపోయినట్లు స్పష్టమౌతుంది. ఏ పద్ధతి ప్రకారం 178 రూపాయలను కనీస వేతనంగా ప్రకటించిందీ ప్రభుత్వం వెల్లడించలేదు. కనీస వేతనాలు నిర్ణయించటానికి ప్రాతిపదికగా ఉన్న ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ తీర్మానాలు, సుప్రీంకోర్టు తీర్పులు తదితరాలకు పక్కన పెట్టి, తన ఇష్టానుసారంగా వేతనాలను నిర్ణయించ టానికి పూనుకుంది.

ప్రభుత్వం కార్మికచట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన తర్వాత కార్మికుల హక్కులు హరించబడతాయి. యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి, వారు చెప్పినన్ని రోజులే కార్మికులు పనిచేయాల్సి వుంటుంది. పనిగంటలకు పరిమితి ఉండదు. వేతనాలు తగ్గిపోతాయి. అత్యంత హీనమైన, కనీసంగా బతకటానికి కూడా చాలీచాలని వేతనాలను మాత్రమే కార్మికులు పొందుతారు. కార్మికులకు ఎటువంటి చట్టపరమైన రక్షణలు ఉండవు. కాబట్టి వేతనాలను ఇంకా ఇంకా తక్కువకు కుదించటానికి యజమానులు ప్రయత్నం చేస్తారు. పెట్టుబడిదారుల లాభాల దాహానికి ఏ విధంగా అయితే పరిమితి ఉండదో అదే విధంగా వేతనాల కుదింపుకూ పరిమితులుండవు. ఆ విధంగా కార్మికుల వేతనాలను సాధ్యమైనంత అట్టడుగు స్థాయికి తగ్గిస్తారు.

**వేతనాలతో పాటు వ్యవసాయోత్పత్తుల ధరలనూ తక్కువగా ఉంచుతారు**

వేతనాలను తగ్గించిన తర్వాత, తమకు వస్తున్న తక్కువ వేతనంతో ఎలా బతకాలన్న సమస్య కార్మికులకు ఎదురౌతుంది. కార్మికుడు తన శ్రమశక్తిని అమ్ముకున్నందుకు ప్రతిఫలంగా పొందిన వేతనంతో అతని కుటుంబ కనీస అవసరాలైనా తీరాలి. తిండి,బట్ట,ఇల్లు, విద్య, వైద్యం తదితరాలను అతను పొందగలగాలి. అత్యంత కనిష్ఠస్థాయికి చేరిన వేతనాలతో కార్మికులు ఈ అవసరాలన్నింటినీ తీర్చుకోవటం సాధ్యమౌతుందా? దేశంలోని కార్మికులు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ఆహారం కోసం ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో అతి తక్కువ వేతనాలను పొందుతున్న కార్మికులు తమ వేతనాలలో 70 శాతానికి పైగా ఆహారం కోసమే ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం ఇపుడు తీసుకొస్తున్న లేబర్‌కోడ్‌లతో వేతనాలు మరింత తగ్గుతాయి. కాబట్టి ఆహారం కోసం చేసే ఖర్చు మరింత పెరుగుతుంది. ఆహారంపై చేసేఖర్చు పెరిగితే ఇతర అవసరాలు తీర్చుకోవటానికి అతికొద్ది మొత్తం మాత్రమే కార్మికుల వద్ద మిగులుతుంది. ఆ కొద్దిమొత్తంతో వారి అవసరాలు తీరవు. అపుడు కార్మికులు ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కార్మికుల వేతనాలను అతి తక్కువ స్థాయికి తగ్గించిన పెట్టుబడిదారీ వర్గానికి నిత్యావసర సరుకుల ధరల ను తక్కువగా ఉంచాల్సి వస్తుంది.

కార్మికుల వేతనాలు తగ్గినా వేతనంలో ఆహారం కోసం ఖర్చుచేసే శాతం పెరగకుండా చూడటం కోసం ఆహార పదార్థాల ధరలు పెరగనీయకుండా ఉంచటానికి పూనుకుంటారు. అయితే ఆహారోత్పత్తుల బడా వ్యాపారులు, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల కార్యకలాపాలపై ఆంక్షలు విధించి ధరలు తగ్గించటం కాకుండా, ఉత్పత్తిదారులైన రైతులకు తక్కువ ధరలు చెల్లించటం ద్వారా ఆహారపంటల ధరలను తక్కువగా ఉంచుతారు. అంటే ఆహారపంటలు పండిస్తున్న రైతులకు ఇప్పటి వరకు ఉన్న కనీసమద్దతు ధరలు ప్రకటించటం, ప్రభుత్వ సేకరణ, వ్యాపారులు ధరలు తగ్గించినపుడు కొన్ని సందర్భాలలోనైనా ప్రభుత్వ సంస్థలు మార్కెట్లోకి రావటం తదితరాలు ఇకముందు ఉండకపోవచ్చు. ఫలితంగా రైతులు పూర్తిగా మార్కెట్ దయాదాక్షిణ్యాలకు వదిలివేయబడతారు. ఆహారధరలు తక్కువగా ఉంచటం కోసం ఆర్‌సిఇపి, ఇంకా అలాంటి స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. సుంకాలు తగ్గించి లేదా రద్దుచేసి దేశంలోకి స్వేచ్ఛగా దిగుమతులకు అనుమతిస్తారు. దేశీయంగా ఉన్న రక్షణలను తొలగిం

చటం, ఎటువంటి సుంకాలు లేకుండా విదేశాల నుండి చేసుకుంటున్న దిగుమతులతో పోటీ పడవలసిన పరిస్థితి ఎదురవటంతో ఆహారోత్పత్తులు చేసే రైతాంగం దివాళా తీస్తారు.

❝65 శాతం ప్రజల ఆదాయాలతో పాటు వారి కొనుగోలు శక్తి కూడా తగ్గుతుంది. వ్యవసాయరంగం దెబ్బతిని, గ్రామీ ణ ప్రజల ఆదాయాలు తగ్గితే పారిశ్రామిక రంగం కూడా దెబ్బతింటుంది. ఫలితంగా పారిశ్రామికోత్పత్తులకు మార్కెట్ కుంచించుకుపోతుంది. ఇపుడు ఎదుర్కొంటున్న మాంద్యానికి ఈ పరిణామాలు కూడా తోడయితే అది తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుంది. చిన్న పరిశ్రమ లు, వ్యాపారాలు, వృత్తులు చేసుకొనే వారు ఎక్కువ మంది ఇటువంటి సంక్షోభ కాలంలో దివాళా తీస్తారు.❞

### వాణిజ్యపంటలు పండించే రైతులు కూడా దెబ్బతింటారు

ఆహారోత్పత్తుల ధరల తగ్గుదలతో మాత్రమే కార్మికుల ఆందోళనను తొలగించటం సాధ్యం కాదు. ఇతర జీవితావసరాలను కూడా కార్మికులు తక్కువ ధరలకు పొందగలగాలి. అలా పొందాలంటే పారిశ్రామికోత్పత్తులు కూడా వారికి చౌకగా అందుబాటులోకి రావాలి. కార్మికులకు పారిశ్రామికోత్పత్తులు తక్కువ ధరలకు అందించటం కోసం పెట్టుబడిదారులు తమ లాభాలను తగ్గించుకోరు. ఇందుకు కూడా రైతులనే వినియోగించుకొంటారు. రైతులు పండిస్తున్న వాణిజ్యపంటల ధరలను తగ్గిస్తారు. పత్తి, మిర్చి, పసుపు తదితర వాణిజ్య పంటల ధరలను మరింతగా దిగ్గోస్తారు. ఆ విధంగా రైతుల నుండి తక్కువ ధరలకు ఉత్పత్తులను సేకరించటం ద్వారా పారిశ్రామికోత్పత్తుల ధరలను తక్కువగా ఉంచటానికి ప్రయత్నం చేస్తారు. ఇప్పటికే వాణిజ్యపంటలు పండిస్తున్న రైతులు తమ ఉత్పత్తులకు ధరల గ్యారంటీ లేకపోవటం, ధరలలో అనిశ్చితితో తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. మిగతా పంటలు పండించే వారికన్నా వాణిజ్య పంటలు పండించే రైతులలో అప్పుల పాలవటం, ఆత్మహత్యలు చేసుకోవటం ఎక్కువగా ఉన్నది. రానున్న కాలంలో ఇది మరింత తీవ్రమౌతుంది.

### గ్రామీణప్రాంతాలలో దుర్భర పరిస్థితులు

రైతాంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ వారి ఆదాయాలను హరించివేసే పరిణామం యొక్క ఫలితాలు కేవలం రైతాంగానికే పరిమితం కావు. గ్రామీణప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజానీకంపైనా దీని ప్రభావం పడుతుంది. రైతాంగానికి వస్తున్న ఆదాయం తగ్గటంతో కూలి పనులు చేస్తూ వ్యవసాయోత్పత్తిలో భాగస్వాములౌతున్న వ్యవసాయ కార్మికుల వేతనాలు కూడా తగ్గుతాయి. రైతుకు వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడిపోనూ అదనంగా ఆదాయం వస్తుంటే వ్యవసాయ కార్మికుల వేతనాలు కూడా కొంత మేరకు పెంచటానికి రైతులు సుముఖంగా ఉంటారు. కొద్దిపాటి ఆందోళన, పోరాటాలతో వ్యవసాయ కార్మికులు తమ వేతనాలకు పెంచుకోవటం సాధ్యమౌతుంది. రైతాంగానికి ఆదాయం తగ్గుతున్నపుడు, వారికి నష్టాలు వస్తున్నపుడు తీవ్రమైన పోరాటాలు చేసినా వేతనాలను పెంచుకోవటం కష్టమౌతుంది. కాబట్టి రైతాంగానికి ఆదాయం తగ్గటం వలన వ్యవసాయ కార్మికుల ఆదాయం కూడా తగ్గుతుంది. దానితో వారి జీవన ప్రమాణాలు దిగజారతాయి. వ్యవసాయ కార్మికులకు పనిరోజులు తగ్గిపోతున్నాయి. సంవత్సరంలో 100 రోజులు కూడా పని దొరకటం లేదు. ఫలితంగా వ్యవసాయ కార్మికులు బతుకుదెరువు కోసం పెద్దసంఖ్యలో వలసలు పోతున్నారు. ప్రస్తుతం సంభవిస్తున్న పరిణామాల వలన వలసలు మరింతగా పెరుగుతాయి. వలసలు వెళ్ళినచోట కూడా ఇదే పరిస్థితులు ఉంటాయి కాబట్టి ఆ విధంగా కూడా వారి జీవితాలు మెరుగుపడే అవకాశం ఉండదు.

వ్యవసాయ కార్మికులతో పాటు గ్రామీణ ప్రాంతంలో వివిధ వృత్తులు, వ్యాపారాలు చేసుకొనే వారి పరిస్థితులు కూడా దిగ జారతాయి. పంటల ద్వారా రైతుల చేతిలోకి డబ్బులు వచ్చినపుడు ఆదాయానికి అనుగుణంగా తమ కుటుంబాలకు అవసరమైన సరుకులు, సేవలను కొనుగోలు చేస్తారు. రైతులకు ఎక్కువ ఆదాయం వస్తే ఎక్కువ సరుకులు, సేవలు కొనుగోలు చేస్తారు. ఇళ్ళకు మరమ్మత్తులు, కొత్త ఇళ్ళ నిర్మాణం తదితరాలకు పూనుకుంటారు. తక్కువ ఆదాయం వస్తే అవసరమైన వాటిని కూడా పక్కన పెట్టి కాలం వెళ్ళదీస్తారు. వ్యవసాయరంగం ద్వారా వస్తున్న ఆదాయమే గ్రామీణప్రాంతంలోని ప్రజల ఆర్థికస్థితిని నిర్ణయించటంలో ప్రధానపాత్ర నిర్వహిస్తుంది. అందువలన రైతాంగ ఆదాయాలు తగ్గి, వ్యవసాయరంగం దెబ్బతింటే మొత్తం గ్రామీణ జీవితమే సంక్షోభంలో చిక్కుకుంటుంది.

### వ్యవసాయ సంక్షోభం దేశ సంక్షోభంగా మారుతుంది

భారతదేశంలో 65 శాతానికి పైగా ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. వీరంతా ప్రధానంగా వ్యవసాయ పనులలో పాల్గొనటంతో పాటు వ్యవసాయం ద్వారా గ్రామాలలోకి వచ్చే ఆదాయంపై ఆధారపడి ఉన్నారు. వ్యవసాయాదాయాలు తగ్గితే వీరికి దొరికే ఉపాధి, ఆదాయా లు కూడా తగ్గుతాయి. 65 శాతం ప్రజల ఆదాయాలతో పాటు వారి కొనుగోలు శక్తి కూడా తగ్గుతుంది. వ్యవసాయరంగం దెబ్బతిని, గ్రామీణ ప్రజల ఆదాయాలు తగ్గితే పారిశ్రామిక రంగం కూడా దెబ్బతింటుంది. ఫలితంగా పారిశ్రామికోత్పత్తులకు మార్కెట్ కుంచించుకుపోతుంది. ఇపుడు ఎదుర్కొంటున్న మాంద్యానికి ఈ పరిణామాలు కూడా తోడయితే అది తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుంది. చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు, వృత్తులు చేసుకొనే వారు ఎక్కువ మంది ఇటువంటి సంక్షోభ కాలంలో దివాళా తీస్తారు. పెద్ద పరిశ్రమలలో కూడా ఉత్పత్తిని తగ్గించటం, కార్మికులను తొలగించటం తదితర చర్యలు తీసుకుంటారు. ఆ విధంగా ఈ పరిణామం మొత్తం పారిశ్రామిక రంగాన్ని సంక్షోభంలో ముంచుతుంది. పెద్దసంఖ్యలో పరిశ్రమల మూతకు దారితీస్తుంది. ఈ పరిశ్రమలలో ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు లక్షల సంఖ్యలో తొలగించబడతారు. మూతపడిన చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు, వృత్తుల యజమానులు కూడా నిరుద్యోగులలో కలవటంతో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుంది.

బహుళజాతి సంస్థల, బడా పెట్టుబడిదారుల తొత్తుగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గంపై కొడుతున్న దెబ్బ కార్మిక వర్గానికే కాక మొత్తం దేశప్రజానీకం అందరికీ తగులుతుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ధ్వంసం చేస్తుంది. మేకిన్ ఇండియా అంటూ ఊదరగొడుతున్న బిజెపి ప్రభుత్వం దేశ ఆర్థికాభివృద్ధిని దెబ్బతీస్తున్నది. దేశభక్తిని గురించి కొంగజపం చేస్తూ, కోట్లాదిమందికి ఉపాధిని పోగొట్టే చర్యలు తీసుకోవటం ద్వారా దేశద్రోహానికి పూనుకుంది. బిజెపి ప్రభుత్వం తీసుకొంటున్న ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించకపోతే దేశాభివృద్ధి, ప్రజల జీవితాలు అధోగతికి చేరతాయి. బిజెపి చేస్తున్న ద్రోహానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుతున్న కార్మికవర్గాని రైతాంగం, వ్యవసాయ కార్మికులు మద్దతుగా నిలవాలి. జనవరి 8వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెతో పాటు గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలి.

❃

# సిఎఎ-ఎన్ఆర్‌సి వెనుక ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక సంపాదకులు

ఎస్. వెంకట్రావు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల చేసిన పౌరసత్వ సవరణ చట్టం దేశంలోని ప్రజలను మతాల వారీగా విడగొడుతుంది. కుల, మత, ప్రాంతీయ, భాషా బేధాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టం ముందు సమానమేనని చెబుతున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ చట్టం దేశంలోని ముస్లిం ప్రజానీకం పట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తుంది. ఈ చట్టం, దీనితోబాటు అస్సాంలో ఇటీవల చేసిన జాతీయ పౌరసత్వ రికార్డు (ఎన్ఆర్‌సి)ను దేశమంతటికీ విస్తరించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, భారత దేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేసి, దాన్ని నిరంకుశ హిందూమత రాజ్యంగా మార్చడానికి ఆర్ఎస్ఎస్ ఎప్పటినుండో చేస్తున్న ప్రయత్నాల్లో భాగం. ఈ దుష్ట ప్రయత్నాలను అడ్డుకోకపోతే భారత దేశం మతాలవారీగా, ప్రాంతాల వారీగా విడిపోయి దేశం విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికే ఈ చట్టంపట్ల దేశవ్యాపితంగా ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. లౌకిక, ప్రజాతంత్ర వాదులు, దేశ భక్తులు మేల్కొని ఆర్ఎస్ఎస్-బిజెపి దుష్టపన్నాగాలను తిప్పికొట్టడానికి ముందుకు రావాలి.

**పౌరసత్వ రక్షణ చట్టం (సిఎఎ) అంటే ఏమిటి?**

బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన పౌరసత్వ రక్షణ బిల్లు (సిఎబి-కాబ్) పార్లమెంటు ఉభయసభల ఆమోదం పొంది చట్టంగా మారింది కనుక దాన్ని పౌరసత్వ రక్షణ చట్టం-2019 (సిఎఎ-2019) అని అంటున్నారు.

1955 పౌరసత్వ చట్టానికి కొన్ని సవరణలు చేసి ఈ కొత్త చట్టం తీసుకువచ్చారు. కొత్త చట్టం ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లలో మతపరమైన అణచివేతవల్ల 2014కు ముందు వలస వచ్చిన ప్రజల్లో ముస్లింలకు మినహా మిగిలిన మతాల ప్రజలకు అంటే హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు భారతీయ పౌరసత్వాన్ని ఇస్తారు. ముస్లిం ప్రజలకు మాత్రం పౌరసత్వం ఇవ్వరు. గతంలో భారత పౌరసత్వం ఇవ్వడానికి 11 సంవత్సరాలు దేశంలో నివసించాలన్న నిబంధన ఉండేది. దాన్ని కొత్త చట్టంలో అయిదేళ్లకు కుదించారు.

ఈ చట్టం దేశంలోని లౌకిక, ప్రజాస్వామ్యవాదులు, రాజ్యాంగాన్ని గౌరవించేవారందరిలో తీవ్ర ఆగ్రహం, ఆందోళన రగిల్చింది. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ చట్టం వల్ల తమ ప్రాంతాల్లో స్థానిక ప్రజల సంఖ్య తగ్గి వలసవాదుల ఆధిపత్యం పెరిగిపోతుందని భయపడుతున్నారు. దాంతో వారు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. ఇతర ప్రాంతాల్లోని ప్రజలు ఈ చట్టం దేశాన్ని మతాలవారీగా చీలుస్తుందని, విభజించు పాలించు అన్న బ్రిటిష్ వాళ్ల దుష్ట విధానాన్ని బిజెపి-ఆర్ఎస్ఎస్ మళ్లీ దేశంలోకి తీసుకుచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ నుండి చెన్నయ్ వరకు అన్ని నగరాల్లో యూనివర్సిటీ విద్యార్థులు చట్టానికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు. విద్యార్థులపై ప్రభుత్వం జరిపిస్తున్న దమనకాండ పట్ల దేశ విదేశాల్లో తీవ్రమైన నిరసన వ్యక్తమైంది. దేశంలోని 1000 మంది ప్రముఖ మేధావులు, రచయితలు, కళాకారులు చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఘాటుగా లేఖ రాశారు.

వాస్తవానికి ఈ పౌరసత్వ సవరణ బిల్లును 2016లోనే లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అప్పుడు ప్రతిపక్షాలనుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం దీన్ని 2016 ఆగస్టు 12న సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించింది. ఎంతో ముఖ్యమైన పౌరసత్వ సమస్యపై నియమించబడిన ఈ కమిటీ సమస్యను తీవ్రంగా ఏనాడూ పరిగణించలేదు. అనేక మాసాల పాటు సమావేశమే జరగలేదు. చివరి 10 రోజులు హడావిడి సమావేశాలు జరిపి 2019 జనవరి 7న కమిటీ నివేదిక సమర్పించింది. మరునాడు బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఈ లోగా ఎన్నికలు రావడం, రాజ్య సభ ఆమోదం లేకపోవడం వల్ల బిల్లుకు కాలం చెల్లిపోయింది. లోక్ సభ ఎన్నికల్లో బిజెపి పూర్తి మెజారిటీ సాధించడంతో రాజ్యాంగ సంస్థలన్నిటినీ నాశనం చేయడానికి పూనుకున్నది. అందులో భాగంగానే 2019 డిసెంబర్ 4న కేంద్ర మంత్రివర్గం రాజ్యాంగ వ్యతిరేకమైన పౌరసత్వ (సవరణ) బిల్లు 2019ని ఆమోదించింది. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా డిసెంబర్ 9న లోక్‌సభలో ప్రవేశపెట్టగా 10వ తేదీన లోక్ సభ, 11వ తేదీన రాజ్యసభ ఆమోదించాయి. బిజెపి సభ్యులతోపాటు మన రాష్ట్రానికి చెందిన వైఎస్ఆర్ సిపి, తెలుగు దేశం సభ్యులు, బిజెపి మిత్రులైన జెడి (యు), అన్నా డిఎంకె, ఒడిషాకు చెందిన బిజెడి సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. మరునాడే, డిసెంబర్ 12న, రాష్ట్రపతి బిల్లును ఆమోదించడంతో పౌరసత్వ సవరణ బిల్లు (కాబ్) కాస్తా పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)గా మారింది.

పౌరసత్వ సవరణ బిల్లును భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తీవ్రంగా వ్యతిరేకించింది. పార్లమెంటరీ కమిటీలో సభ్యుడైన నాటి సిపిఐ(ఎం) ఎంపి మొహమ్మద్ సలీమ్ 2019 జనవరి 3న ఒక అసమ్మతి పత్రాన్ని సమర్పించారు. భారత రాజ్యాంగానికి వ్యతిరేకమైన, ముస్లిం మైనారిటీలపై తీవ్రమైన వివక్ష ప్రదర్శించే ఈ బిల్లును పూర్తిగా ఉపసంహరించాలని ఆయన పత్రంలో డిమాండ్ చేశారు. లోక్‌సభలోనూ, రాజ్యసభలోనూ బిల్లును సిపిఐ(ఎం) ఎంపీలు

తీవ్రంగా వ్యతిరేకించారు. పార్లమెంటు బయట కూడా బిల్లుకు వ్యతిరేకంగా పార్టీ ఆందోళన చేసింది.

### సమాధానాల్లేని ప్రశ్నలు

దేశాన్ని ముక్కలు చేసే ప్రమాదమున్న పౌరసత్వ చట్టాన్ని సమర్థించుకోడానికి ప్రభుత్వం అనేక వాదనలు ముందుకు తెస్తున్నది. పొరుగు దేశాల్లో మతపరమైన హింసకు గురవుతున్న ప్రజలను 'మానవతా దృష్టితో' ఆదుకునేందుకే ఈ చట్టం తెచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది.

మానవతా దృష్టితోనే ప్రభుత్వం ఈ చట్టం తెచ్చినట్టయితే కేవలం మూడు దేశాలకే ఎందుకు పరిమితం చేయాల్సి వచ్చింది? మన పొరుగున ఉన్న మయన్మార్‌లో మైనారిటీలైన రొహింగ్యా ముస్లింలు, హిందువులు శ్రీలంకలో క్రైస్తవ తమిళులు తీవ్రమైన హింసాకాండకు గురయ్యారు. వారిని ఎందుకు ఈ చట్టంలో చేర్చలేదు అంటే ప్రభుత్వం వద్ద సమాదానం లేదు. చివరికి పాకిస్థాన్ ముస్లింలలో అనేక మైనారిటీ తెగలు, ఉదాహరణకు అహ్మదీ తెగ తీవ్రమైన హింసాకాండకు గురవుతున్నారు. మరి బిజెపి ప్రభుత్వ 'మానవతా' జాబితాలో వారు ఎందుకు చేరలేదు?

'1947లో కాంగ్రెస్ పార్టీ దేశం చీలకుండా ఆపి ఉంటే నేడు ఇటువంటి చట్టం తేవాల్సిన అగత్యం ఉండేది కాదు' అని హోమ్ మంత్రి అమిత్ షా పార్లమెంటులో పేర్కొన్నారు. అంటే ఆయన ఉద్దేశ్యం ఒకనాటి బ్రిటిష్ పాలిత భారత్ లోని దేశాలకు మానవతా సాయం అందిస్తున్నట్లు. అదే ప్రాతిపదిక అయితే ఆఫ్ఘనిస్థాన్ ఈ జాబితాలోకి రాకూడదు కదా, మయన్మార్‌ను జాబితాలో చేర్చాలి కదా? ఎందుకంటే ఆఫ్ఘనిస్థాన్ బ్రిటిష్ పాలిత భారత్‌లో లేదు, కానీ మయన్మార్ ఉంది. ఈ ప్రశ్నకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు. మొత్తం మీద చూసినప్పుడు ముస్లింలను వేరుగా చూడ్డమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపోతోంది.

నిజంగా ప్రభుత్వం 'మానవతా దృష్టితో' వ్యవహరించాలనుకుంటే కేవలం మతపరమైన హింసాకాండకు గురయిన వారికే ఎందుకు పౌరసత్వం ఇవ్వాలి? ఇంకా అనేక కారణాలతో వివిధ దేశాల్లో ప్రజలు హింసాకాండకు గురవుతున్నారు. భారత దేశం అంతర్జాతీయ శరణార్థి ఒప్పందాల్లో భాగస్వామి కానప్పటికీ అంతర్జాతీయ మానవహక్కుల ఒప్పందంలో భాగస్వామి. అలాగే 1967 ఐక్యరాజ్యసమితి ప్రాదేశిక ఆశ్రయ ప్రకటనలో సంతకం చేసింది. ఈ అంతర్జాతీయ చట్టాలననుసరించి 1996లో భారత సుప్రీం కోర్టు ఒక తీర్పు చెబుతూ భారత రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని అనుసరించి ప్రజల ప్రాణాలకు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉంది గనుక శరణార్థులను బలవంతంగా వారి స్వదేశాలకు పంపగూడదు అని చెప్పింది. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పిఎన్ భగవతి మన దేశ శరణార్థి విధానం ఎలా ఉండాలో చెబుతూ 'తమ స్వంత దేశాల్లో జాతి, మతం, లింగం, తెగ, ఒకానొక సామాజిక గ్రూపులో సభ్యులుగా ఉన్నందున లేక భిన్నమైన రాజకీయ అభిప్రాయాలు కలిగిఉన్నందున హింసాకాండకు గురవుతున్నామన్న భయంతో దేశం విడిచి వచ్చేసిన శరణార్థులను బలవంతంగా వారి దేశాలకు పంపగూడదు' అని చెప్పారు.

అంతర్జాతీయ సూత్రాలు, దేశంలోని చట్టాలు ఏం చెబుతున్నా బిజెపి ప్రభుత్వం కేవలం మతపరమైన హింసాకాండకు గుయిన వారిపట్ల, గురవుతామనుకునే వారిపట్ల మాత్రమే 'మానవతా దృక్పథం' ప్రదర్శించడం, అది కూడా ముస్లిమేతర మతస్తులపట్ల మాత్రమే ఈ 'మానవతా దృక్పథాన్ని' ప్రదర్శించి ముస్లింలను వదిలిపెట్టడం చూస్తే దీని వెనుక 'మానవత' లేదనీ, ఒక రాజకీయ వ్యూహంతో ఇదంతా చేస్తున్నదనీ అర్థం కావడం లేదూ!



ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన భారీ ర్యాలీ

### జాతీయ పౌరసత్వ రిజిస్టరు (ఎన్‌ఆర్‌సి)

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) వెనుక దుష్ట రాజకీయ వ్యూహాన్ని అర్థం చేసుకోవాలంటే ఇటీవల అస్సాంలో ప్రవేశ పెట్టిన జాతీయ పౌరసత్వ రిజిస్టరు (ఎన్‌ఆర్‌సి)ని అర్థం చేసుకోవాలి.

అస్సాంలో భారతీయ పౌరులను సక్రమంగా నమోదు చేసి విదేశాలనుండి 'అక్రమంగా ప్రవేశించిన' వారిని ఏరిపారేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ జాతీయ పౌరసత్వ రికార్డు (ఎన్‌ఆర్‌సి) కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఈ ఎన్‌ఆర్‌సిని త్వరలో దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ప్రకటించడంతో ఒక్కసారిగా అన్ని ప్రాంతాల్లో భయం ఏర్పడింది.

భారత దేశంలో చట్టబద్ధమైన పౌరుల రిజిస్టరునే జాతీయ పౌరసత్వ రిజిస్టరు అంటారు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం భారత పౌరులుగా నమోదైనవారి వివరాలను ఇది నిక్షిప్తం చేస్తుంది. 1951లో మొదటి సారిగా జనాభా లెక్కలు సేకరించినప్పుడు ఈ జాతీయ పౌరసత్వ రిజిస్టరు తయారు చేశారు. అయితే దాన్ని మొన్నటి వరకు తాజాపరచలేదు. కానీ ప్రత్యేకంగా అస్సాంలో ఎన్‌ఆర్‌సిని తాజాపరచాల్సి వచ్చింది. దానికి కారణం అక్కడ విదేశీ అక్రమ వలసదారులకు వ్యతిరేకంగా 1980వ దశకంలో పెద్ద ఎత్తున లేచిన ఆందోళన.

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నాటి తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్) నుండి పెద్ద ఎత్తున బెంగాలీ హిందువులు సరిహద్దుల గుండా అస్సాంలోకి వచ్చారు. తరువాత 1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం జరిగినప్పుడు కూడా పెద్ద ఎత్తున బంగ్లాదేశ్ నుండి ప్రజలు అస్సాంలోకి వలస వచ్చారు. అక్రమ వలసలకు వ్యతిరేకంగా అస్సాంలో 1979లో పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమం బయలుదేరింది. అఖిల అస్సాం విద్యార్థి సంఘం (ఆసు), అస్సాం గణ సంగ్రామ్ పరిషత్ (ఆగ్సా)ల నేతృత్వంలో ఆరేళ్ల సుదీర్ఘ ఆందోళన అనంతరం 1985లో కేంద్ర ప్రభుత్వానికీ ఈ సంస్థలకూ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు అస్సాంలో అక్రమ వలసదారులను ఏరివేసేందుకు జాతీయ పౌరసత్వ రిజిస్టరు (ఎన్‌ఆర్‌సి)ను తాజాపర్చాలని నిర్ణయించారు.

అస్సాంలో ఎన్‌ఆర్‌సిని తాజాపరిచే కార్యక్రమం సుప్రీం కోర్టు పర్యవేక్షణలో 2013లో ప్రారంభమైంది. 1951 ఎన్‌ఆర్‌సిలో పేర్లు నమోదయిఉన్నవారినీ, ఇప్పటికీ రాష్ట్రంలో నివసిస్తున్న వారి సంతానాన్నీ

కొత్త రిజిస్టరులో నమోదుచేశారు. 1971 మార్చి 24 అర్ధరాత్రి తరువాత దేశంలోకి ప్రవేశించిన వారందరినీ అక్రమ వలసదారులుగా గుర్తించడం ఈ రిజిస్టరు తాజాపరచడం వెనుక ఉద్దేశం. 2019 ఆగస్టు 31న తాజాపరిచిన తుది ఎన్ఆర్సి ప్రచురించబడింది. ఈ విధంగా ఎన్ఆర్సిని తాజాపరచడం ఒక్క అస్సాంలో మాత్రమే జరిగింది.

**ఎన్ఆర్సికీ పౌరసత్వ సవరణ చట్టానికీ సంబంధం ఉందా?**

సంబంధం ఉంది. అస్సాంలోని మొత్తం 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలల్లో 3 కోట్ల 10 లక్షల మంది మాత్రమే కొత్త రిజిస్టరులో నమోదయినారు. దాదాపు 20 లక్షల మంది ప్రజలు నమోదు కాలేదు. వారిలో నాటి బంగ్లా దేశ్ నుండి వలస వచ్చిన బెంగాలీ ముస్లింలు, హిందువులు ఉన్నారు. వారితోబాటు అనేక మూలవాసి జాతుల ప్రజలు కూడా నమోదు కాలేదు. దాంతో అస్సాం ప్రజలే కాకుండా అక్కడ అధికారంలో ఉన్న బిజెపి ముఖ్యమంత్రితో సహా ఆ పార్టీ నాయకులు కూడా దీన్ని వ్యతిరేకించారు. అదీ గాకుండా ఎన్ఆర్సిని దేశమంతటికీ వర్తింపజేస్తామని హోమ్ మంత్రి పార్లమెంటులో ప్రకటించడంతో బెంగాల్లో కూడా దీనిపై ప్రజల్లో పెద్ద ఎత్తున ఆందోళన ప్రారంభమైంది. దాంతో ఎన్ఆర్సి వల్ల అక్రమ వలసదారులుగా మారిపోయే ముస్లిమేతరులను సక్రమ వలస దారులుగా, తదుపరి దేశపౌరులుగా మారిపోవడానికి అవకాశం కల్పిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) తీసుకువచ్చింది. పాత పౌరసత్వ చట్టం ప్రకారం దేశంలో గత 14 సంవత్సరాలకు గాను 11 సంవత్సరాలు అందులో చివరి 12 మాసాలు దేశంలోనే నివాసం ఉన్న దరఖాస్తుదారులు భారత పౌరసత్వానికి అర్హులవుతారు. కొత్త చట్టం ప్రకారం 11 సంవత్సరాలు ఉండక్కరలేదు. అయిదు సంవత్సరాలు, చివరి 12 మాసాలు మొత్తం 6 సంవత్సరాలున్న దరఖాస్తు దారులు భారత పౌరసత్వానికి అర్హులవుతారు. అయితే ఈ వెలుసుబాటును ప్రభుత్వం ముస్లిమేతరులకు మాత్రమే కల్పించింది.

**సిఎఎ వల్ల జరిగేదేమిటి?**

జాతీయ పౌరసత్వ రిజిస్టర్ వల్ల అస్సాంలో అక్రమవలస దారులుగా గుర్తింపు పొందిన సుమారు 20 లక్షల మంది ప్రజలను ప్రభుత్వం వివిధ శిబిరాల్లో చేర్చింది. వారికి ఎటువంటి భారత పౌరహక్కులు ఉండవు. వారి భవితవ్యం ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) వల్ల ఇటువంటి ప్రజల్లో ముస్లిమేతరులు ముఖ్యంగా బెంగాలీ హిందువులు భారత పౌరసత్వం పొందడానికి అర్హత సాధిస్తారు. ముస్లింలు మాత్రం అక్రమ వలసదారులుగా మిగిలిపోతారు. అమిత్ షా పేర్కొన్నట్లు రేపు ఎన్ఆర్సిని దేశమంతటా అమలు జరిపినప్పుడు కూడా కేవలం ముస్లింలను మాత్రమే అక్రమ వలసదారులుగా మార్చేందుకు సిఎఎ సాధనం అవుతుంది. బిజెపి-ఆర్ఎస్ఎస్ హిందూత్వ ఎజెండాలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందన్నది నిస్సందేహం. అయితే సిఎఎ తమకు అడ్డు చక్రం వేసి కాపాడుతుందని అస్సాంలోని బెంగాలీ హిందువులు కూడా నమ్మడం లేదు.

**ఎన్ఆర్సిని దేశవ్యాపితంగా విస్తరిస్తే..?**

ఎన్ఆర్సి వల్ల హిందువులు, క్రైస్తవులు ఇతర ముస్లిమేతర మతాల వారికి నష్టం రాకుండా పౌరసత్వ సవరణ చట్టం తెచ్చినట్లు బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తోంది. కానీ అది పూర్తిగా అవాస్తవం. ఎన్ఆర్సిని దేశవ్యాపితంగా విస్తరిస్తే ముస్లింలతోపాటు అన్ని మతాల ప్రజలు నష్టపోతారు. ఎలాగంటే...

1. అస్సాంలో ఎన్ఆర్సి వల్ల దాదాపు 20 లక్షల మంది ప్రజలు అక్రమ వలస దారులుగా మారారు. వారిలో సుమారు 12 లక్షల మంది హిందువులే. 1971కి ముందు తమ పూర్వీకులు బాంగ్లాదేశ్లో నివసించినట్లు నిరూపించుకోలేని వారందరినీ అక్రమవలస దారులుగా ఎన్ఆర్సి ప్రకటించింది. చాలా మంది గ్రామీణ పేద ప్రజల వద్ద 48 ఏళ్ల క్రితం తాము, లేక తమ పూర్వీకులు అస్సాంలో నివసించినట్లు చూపే ఆధారాలు లేవు. అస్సాంలో నివసిస్తున్న గిరిజన ఆదివాసీలూ, మూలవాసుల వద్ద కూడా ఇటువంటి ఆధారాలు లేవు. అందువల్ల ముస్లిం ప్రజలే కాకుండా పేద హిందువులు, ఆదివాసీలు కూడా దీని వల్ల నష్టపోయారు. ఇప్పుడు వీరందరికీ పౌరసత్వ సవరణ చట్టం కింద భారతీయ పౌరసత్వం ఇవ్వాలంటే ముందుగా వారు తాము బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వలస వచ్చినట్లు అంగీకరించాలి. అస్సాం ఎన్ఆర్సి వల్ల అక్రమ వలస దారులుగా తేలిన 12 లక్షల మంది హిందువుల్లో బంగ్లాదేశ్ నుండి వచ్చినవారే కాదు ఉత్తర భారత దేశం నుండి వచ్చిన హిందూ, ముస్లింలు లక్షల మంది ఉన్నారు. ఇప్పుడు వీరు కూడా తాము భారతీయులం కాదనీ, బంగ్లాదేశ్ నుండి అక్రమంగా వలస వచ్చినవారమనీ పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) కింద అంగీకరించాలి. అప్పుడే వారిని అక్రమ వలసదారులుగా గుర్తించి ప్రభుత్వం సిఎఎ కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తులు చేసుకోమని చెబుతుంది.

2. అమిత్ షా గారు పార్లమెంటులో ప్రకటించినట్లు రేపు ఎన్ఆర్సిని దేశమంతటా అమలు చేస్తే ముందుగా జరిగేదేమిటి? ఒక్క కలం పోటుతో దేశంలోని 130 కోట్ల మంది ప్రజలు - హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు అందరూ భారత దేశ పౌరులుకాకుండా పోతారు. ఎన్ఆర్సిలో ఉన్న ఒక నిబంధన ఏమంటే దేశంలోని ప్రతి పౌరుడూ తను భారతీయుణ్ణేనని నిరూపించుకోవాలి. అంటే ఇన్నేళ్లూ ఈ దేశ పౌరులు కాని వారెవరో గుర్తించే బాధ్యత ప్రభుత్వం మీద ఉండేది. ఇప్పటి నుంచీ మనం ఈ దేశ పౌరులమని రుజువు చేసుకోవాల్సిన అగత్యం కల్పించింది మోడీ ప్రభుత్వం. ఎలా నిరూపించుకోవాలి..?

- 26-1-1950 తర్వాత నుండి 1-7-1987 లోపు ఈ దేశంలో పుట్టిన ప్రతీ వ్యక్తీ ఈ దేశ పౌరసత్వానికి అర్హుడవుతాడు కాబట్టి ఆ కాలంలో పుట్టినట్టు నీవు ఇప్పుడు ఆధారాలు సమర్పించాలి.
- 2003లో పౌరసత్వ చట్ట సవరణ జరిగింది. దాని ప్రకారం 1-7-1987 నుండి 2003 సవరణ జరిగిన నాటి మధ్య కాలంలో భారతదేశంలో పుట్టిన వ్యక్తి తల్లిదండ్రులలో ఒకరైనా ఆ నాటికి భారతీయ పౌరులై ఉన్నట్లు నిరూపించుకోవాలి.
- లేదా 2003 సవరణ తర్వాత ఈ దేశంలో జన్మించిన వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ ఈ దేశ పౌరులైతేనే ఆ వ్యక్తికి పౌరసత్వం లభిస్తుంది. తల్లిదండ్రులిద్దరిలో ఒకరు ఈ దేశ పౌరులుగా ఉండి రెండోవారు పౌరులుగాకున్నా ఈ దేశంలోకి చట్ట సమ్మతంగా వచ్చి వుంటే అటువంటి తల్లిదండ్రులకు ఈ దేశంలో జన్మించిన వ్యక్తికి కూడా పౌరసత్వం లభిస్తుంది.
- 26-1-1950 తర్వాత, 1992 డిసెంబరు 10వ తేదీకి ముందు ఇతర దేశాలలో జన్మించిన వ్యక్తికి తండ్రి గనుక భారతీయ పౌరుడైతే ఆ వ్యక్తికి కూడా భారతీయ పౌరసత్వం లభిస్తుంది. ఆ విషయాన్ని నిరూపించుకోవాలి.
- 10-12-1992 తర్వాత ఇతర దేశాలలో జన్మించిన వ్యక్తి తల్లిదండ్రులలో ఏ ఒక్కరు భారతీయ పౌరులైనా ఆ వ్యక్తికి భారతీయ పౌరసత్వం లభిస్తుంది.

- (అయితే ఆ తల్లిదండ్రులు కూడా విదేశాలలో జన్మించిన వారైతే విదేశాలలో జన్మించిన వారి బిడ్డలకు భారతీయ పౌరసత్వం రాదు)

పైన ప్రస్తావించిన పౌరసత్వ నిబంధనల ప్రకారం భారతీయ పౌరులు కాని వారు ఈ దేశంలో పౌరులుగా నమోదు కావాలని కోరుకుంటే వారికి దిగువ పేర్కొన్న అర్హతలలో ఏదైనా ఒకటి ఉండాలి.

- భారతదేశ మూలాలు కలిగి వుండి, కనీసం ఏడేళ్లు భారతదేశంలో ఉండి వుంటే ఆ తర్వాత మన దేశ పౌరసత్వం పొందవచ్చు.



సిఎఎ–ఎన్ఆర్‌సిలను మొదటినుండి వ్యతిరేకిస్తున్న కేరళ, ఢిల్లీ, బెంగాల్ సిఎంలు పినరయి విజయన్, కేజ్రీవాల్, మమతా బెనర్జీ

–భారతీయ మూలాలు కలిగి వుండి, స్వతంత్రం రాక మునుపు ఉన్న అవిభక్త భారతదేశంలో గాక వేరే ఏ దేశంలోనైనా పౌరుడిగా ఉన్న వ్యక్తి కూడా మన దేశ పౌరసత్వం పొందవచ్చు.

–భారతదేశం లోని పౌరుని వివాహం చేసుకుని ఏడు సంవత్సరాలు ఈ దేశంలో నివాసం ఉంటే పౌరసత్వం పొందవచ్చు.

- భారతీయ పౌరుల పిల్లలు దేశ పౌరసత్వం పొందవచ్చు.

- తల్లిదండ్రులిద్దరిలో ఏ ఒక్కరైనా భారతీయ పౌరులై వుంటే యుక్త వయస్కులైన వారి సంతతి భారతదేశంలో ఒక సంవత్సరం నివసించాక పౌరసత్వం పొందవచ్చు.

- విదేశాలలో ఉండే భారతీయులు (ఓవర్‌సీస్ సిటిజన్లు) ఆ విదేశీ పౌరసత్వం వదులుకుని ఇక్కడ నివాసం వుంటే మనదేశ పౌరసత్వం పొందవచ్చు.

ఇవి గాక ఎవరైనా వ్యక్తి శాస్త్ర, సాంకేతిక, సామాజిక, సాహిత్య, తాత్విక రంగాలలో మానవాళి పురోగతికి తోడ్పడిన వారు, ప్రపంచ శాంతి కోసం విశేష కృషి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం పౌరసత్వం ఇవ్వవచ్చు.

అంటే 1950 నుండి ఈ దేశంలో నివసిస్తున్నట్లు రికార్డులు సమర్పిస్తేనే నీకు ఎన్ఆర్‌సి ప్రకారం భారత పౌరసత్వం లభిస్తుంది. 130 కోట్ల మందిలో ఎంతమంది ప్రజలు ఇటువంటి రికార్డులు సమర్పించగలరు? పుట్టిన స్థలానికి సంబంధించి ఎక్కువ మంది దగ్గర రుజువు ఉండదు. స్కూలు, 10వ తరగతి బోర్డు సర్టిఫికెట్‌లలో పుట్టిన తేదీ ఉంటుంది తప్ప ఏ ఊళ్లో పుట్టిందీ ఉండదు. మునిసిపల్, పంచాయితీ రికార్డుల్లో జనన, మరణ రిజిస్టర్లు ఉంటాయి. వాటిలో నమోదు అయి వుండాలి. లేదా ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవం జరిగినట్లు ధృవపత్రాలు వుండాలి. ఎవరి దగ్గర ఉంటాయి? ఇప్పుడు కావాలంటే ఎవరిస్తారు? అధికారులు ఎవరిని ప్రశ్నించవచ్చు? అందునా గ్రామీణ ప్రాంతాల ప్రజల వద్ద రికార్డులు ఏముంటాయి? పొట్ట చేతబట్టుకుని బతుకుతెరువు కోసం వలసలు పోయిన కార్మికుల వద్ద ఏ రికార్డులుంటాయి?

3. ఎన్ఆర్‌సి ప్రకటించిన వెంటనే దేశమంతటా (అస్సాం మినహా) 130 కోట్ల మంది భారతీయులు తాము భారతీయులమని నిరూపించుకోవాలి. అలా నిరూపించుకోకపోతే అక్రమ వలసదారులై పోతారు. ఈ భయంతో ప్రజలు క్యూ లైన్లలో నిలుచో వలసి వస్తుంది. గతంలో మోడీ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దుతో ఏర్పడిన భయం వల్ల ఎన్ని కోట్ల మంది ప్రజలు క్యూ లైన్లలో నిలబడిందీ, ఎంత మంది ప్రాణాలు పోగొట్టుకున్నదీ మనం చూశాం. అప్పుడు డబ్బుకోసం నిలబడితే ఇప్పుడు భారతీయులంతా తమ శీలం (భారతీయులమేనని) నిరూపించుకోవడం కోసం నిలబడాలి. అలా నిరూపించుకోలేని వారంతా హిందూ, ముస్లిం, క్రైస్తవ బేధం లేకుండా పరాయి దేశస్తులూ, అక్రమ వలస దారులూ అయిపోతారు. మూడుకోట్ల మంది జనాభా ఉన్న అస్సాంలో 20 లక్షల మంది అక్రమ వలసదారులుగా మారిపోతే 130 కోట్ల జనాభాలో ఎంతమంది మారిపోతారో ఊహించుకోవచ్చు.

అక్రమ వలసదారులుగా మారిపోయిన వారిలో కేవలం ముస్లింలను మినహాయించి మిగిలిన వారందరూ సిఎఎ ప్రకారం భారతీయ పౌరసత్వం పొందడానికి అర్హులవుతారు. కానీ ఎప్పుడు? వారంతా ముందుగా తాము అక్రమ వలస దారులమని అంగీకరించాలి. నీవు ఆంధ్రుడివి అయినా, తమిళుడివి అయినా లేక ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడివి అయినా సరే బంగ్లాదేశ్ నుండో, పాకిస్థాన్‌నుండో లేక ఆఫ్ఘనిస్థాన్‌నుండో అక్రమంగా భారత దేశంలోకి వలస వచ్చానని అంగీకరించాలి. ఇతర దేశాల నుండి వచ్చానంటే నీకు 'క్షమాభిక్ష' లభించదు. ఎందుకంటే అమిత్ షా గారి చట్టం ప్రకారం ఈ మూడు దేశాల నుండి వలస వచ్చిన ముస్లిమేతరులకు మాత్రమే 'క్షమాభిక్ష' లభిస్తుంది. ముస్లింలకు ఆ 'క్షమాభిక్ష' కూడా లభించదు. ఎంత అన్యాయం!!

మొదటి అన్యాయం, భారతీయుడినై ఉండి నేను భారతీయుడినే అని నిరూపించుకోవలసి రావడం.

రెండవ అన్యాయం, నిరూపించుకోలేకపోతే, నేను భారతీయుడినైనా అక్రమ వలసదారుడిని అని ఒప్పుకోవాల్సి రావడం.

మూడవ అన్యాయం, భారతీయుడినే అయినా ముస్లింను అయినందుకు నేను భారతీయ పౌరసత్వానికి అనర్హుణ్ణి కావడం.

4. ఇప్పటికే మనం భారతీయులం అని నిరూపించేందుకు ఆధార్ కార్డులున్నాయి. ఇవి భారత ప్రభుత్వంచేత జారీ చేయబడుతున్న కార్డులు. ఇవి కాకుండా ప్రతి అయిదేళ్లకూ, ఇంకా చెప్పాలంటే స్థానిక ఎన్నికలతో కలిపి చూసుకుంటే ప్రతి ఏటా తాజాపరుస్తున్న ఓటరు గుర్తింపు కార్డులున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే రేషన్ కార్డులు ఇతరత్రా సవాలక్ష గుర్తింపు కార్డులున్నాయి. ఇన్ని గుర్తింపు కార్డులుండగా మరో సారి నేను భారతీయుణ్ణని గుర్తింపు పొందేందుకు ఎన్ఆర్‌సి పేరుతో మరో గుర్తింపు కార్డు అవసరం ఏమొచ్చింది?

5. అస్సాంలో ఎన్ఆర్‌సి అమలుకు 1,220 కోట్ల రూపాయలు ఖర్చయింది. దేశం మొత్తం మీద అమలు చేయాలంటే సుమారు 50 వేల నుండి 60 వేల రూపాయలు ఖర్చవుతుందని అంచనా. దీని కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేయాల్సి వస్తుంది. అనేక చోట్ల గుర్తింపు కేంద్రాలు నెలకొల్పాలి. ఎన్ఆర్‌సిలో నమోదు కాకుండా 'అక్రమ వలసదారులు'గా మిగిలిపోయిన కోట్లాది మందిని

ఏం చేస్తారు? బంగ్లాదేశ్‌కో, పాకిస్థాన్‌లో బలవంతంగా పంపలేరు కదా! పంపినా వాళ్లు స్వీకరించరు కదా! అప్పుడు వాళ్ల కోసం ప్రత్యేక శిబిరాలు నెలకొల్పాలి. ప్రస్తుతం అస్సాంలో ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేశారు. దీనికి ఖర్చు ఎంతవుతుంది?

అందువల్ల బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఆర్‌సి, సిఎఎ చట్టాల వల్ల ముస్లింలకే కాదు హిందువులకూ ఇతర భారతీయులకు కూడా తీవ్ర నష్టం జరుగుతుంది.

**రాజ్యాంగ ఉల్లంఘన**

పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనది. రాజ్యాంగంలో 5వ అధికరణం నుండి 11వ అధికరణం వరకు పౌరసత్వం గురించిన విధి విధానాలను నిర్దేశించారు. వాటి ఆధారంగా ఉనికిలోకి వచ్చిందే 'పౌరసత్వ చట్టం–1955'. ఈ చట్టం ప్రకారం ఈ దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తీ, ఈ దేశంలో పుట్టిన వారికి వారసులుగా ఉన్న ప్రతి వ్యక్తీ, భారతీయుడేనని తేల్చి చెప్పింది. ఈ దేశంలో నివసించటానికి సిద్ధపడిన వారికి కూడా సహజసిద్ధంగా పౌరసత్వం సంక్రమిస్తుందని ఈ చట్టం స్పష్టం చేసింది. అదనంగా భారతదేశం కొత్తగా సంక్రమించుకునే భూభాగాల్లో ఉన్న పౌరులకు కూడా భారతీయ పౌరసత్వం వర్తిస్తుందని ఈ చట్టం నిర్ధారిస్తోంది. కానీ ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ఆమోదించిన పౌరసత్వ చట్టం– కుల, ప్రాంత, లింగ, జాతి, సాంస్కృతిక పరమైన వివక్షలకు అతీతంగా భారతీయులందరికీ సమాన పౌరసత్వ హక్కు కల్పించాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కింది. 'చట్టం ప్రకారం దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు, రక్షణ కల్పించాలి' అని రాజ్యాంగం లోని 14వ అధికరణం ఆదేశిస్తోంది. పౌరులకే కాక దేశంలో నివశిస్తున్న వారందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలన్నది రాజ్యాంగం లోని 14వ అధికరణం స్ఫూర్తిగా ఉంది.

**హక్కుల ఉల్లంఘన**

ఈ పౌరసత్వ సవరణ చట్టం ప్రజలను మతాలవారీగా చీలుస్తుంది. వివక్షను పాటిస్తుంది. మానవ హక్కులను ఉల్లంఘిస్తుంది. మన పూర్వీకులు చేసిన సుదీర్ఘ సమరశీల స్వాతంత్ర పోరాట ఫలితమే మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. స్వాతంత్ర్య సమరయోధులు భారత దేశాన్ని కుల మత వివక్షకు తావు లేని దేశంగా చూడాలని కలలు కన్నారు. భారతీయ సమాజంలో ఉన్న తీవ్రమైన ఆర్థిక సామాజిక అంతరాలకు స్వస్తి చెప్పే నవ భారత నిర్మాణం గురించి కలలు గన్నారు. 1920 దశకంలో వామపక్ష శక్తులు విడుదల చేసిన ప్రణాళికల్లో ఈ విషయాలు సుస్పష్టంగా వ్యక్తం చేయబడ్డాయి. భగత్‌సింగ్‌ను, ఆయన సహచర కామ్రేడ్లను ఉరి కంబాలెక్కించిన తర్వాత 1931లో కరాచీలో జరిగిన జాతీయ కాంగ్రెస్‌లో ప్రతిపాదించిన తీర్మానంలో ఈ లక్ష్యాలు స్పష్టంగా వున్నాయి. అప్పటికే సమరశీల ప్రజా ప్రతిఘటన తలెత్తటంతో భావప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, సమావేశాలు జరుపుకునే హక్కు, సంఘాలు పెట్టుకునే హక్కు, చట్టం ముందు అందరూ సమానమే అన్న తీర్మానాన్ని ఆమోదించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

బ్రిటిష్ పాలిత భారత దేశంలో సాగిన జాతీయోద్యమాన్ని స్వదేశీ సంస్థానాల్లో సాగిన ప్రజా పోరాటాలు మరింత బలోపేతం చేశాయి. స్వతంత్ర భారతంలో మతతత్వ వాసనలు లేని రాజకీయాలను కాంక్షించారు మన పూర్వీకులు. వారి ఆకాంక్షలకు ప్రతి రూపంగానే డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నాయకత్వంలో మన రాజ్యాంగం రూపొందించబడింది. కానీ ఆ స్వాతంత్ర్యోద్యమంలో వీసమెత్తు పాత్ర లేని మతోన్మాదులు నేడు ఆ రాజ్యాంగంలోని లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, సమాఖ్యతత్వం, వైవిధ్యం గురించి ప్రస్తావించిన భాగాలపైనే దాడి చేస్తున్నారు. నేటి హిందుత్వ కంకణధారుల పూర్వీకులు బ్రిటిష్ పాలకుల ముందు సాగిలపడిన సంఘటనలు స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చీకటి అధ్యాయాలుగా మిగిలిపోతాయి. ఎంత తిరస్కరించినా వారి చీకటి చరిత్రను తుడిచేయలేరు.

అందువల్లనే పౌరసత్వ సవరణ చట్టంలోని మానవ హక్కుల ఉల్లంఘనను, వివక్షను గుర్తించిన లక్షలాదిమంది వివిధ రాష్ట్రాల్లో వీధుల్లోకి వచ్చి తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు ఈ చట్టానికి వ్యతిరేకంగా వీధుల్లోకి రావటం చెప్పుకోదగ్గ పరిణామం. బిజెపి, దాని మిత్రులు తమకున్న సంఖ్యాబలంతో పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ చట్టాన్ని నెగ్గించుకున్నా నవ భారత పౌరుల నుండి ఆమోదం పొందటం అంత తేలిక కాదన్న వాస్తవాన్ని ఈ ఆందోళనలు ధృవీకరిస్తున్నాయి. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పెల్లుబుకుతున్న ఆందోళనలను గమనిస్తే స్వాతంత్ర్యోద్యమ కాలంలో వలస పాలనను ఎదిరిస్తూ జాతీయ జండాలు చేపట్టిన విద్యార్థి తరం లాగానే ఈ తరం పౌరులు కూడా కులమత చీలికలను అధిగమించి ఐక్యంగా ముందడుగు వేస్తున్నారు. వివక్షతో కూడుకున్నదని, మానవ హక్కులను ఉల్లంఘిస్తుందని వారు ఈ చట్టాన్ని తిరస్కరిస్తున్నారు.

**లౌకిక భారత దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చడమే లక్ష్యం**

భారత దేశ రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా ఉల్లంఘించి సిఎఎ – ఎన్ఆర్‌సిలను అమలు చేయడానికి బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వెనుక దేశాన్ని మత ప్రాతిపదిక మీద హిందూ రాష్ట్రంగా నిర్మించాలన్న ఆర్ఎస్ఎస్ లక్ష్యం దాగి ఉంది.

ఆర్ఎస్ఎస్–బిజెపి సిద్ధాంత వేత్త అయిన హెడ్గేవార్ "హిందూస్థాన్ హిందువులకు మాత్రమే చెందాలి అన్న సూత్రంపై ఆర్ఎస్ఎస్ పనిచేయాలి" అని చెప్పారు. 1938లో ఆయన ఈ విషయాన్ని మరింత విపులీకరిస్తూ: "హిందూస్థాన్ హిందువులదే అన్న విషయం నిజం, హిందువులు మాత్రమే దాని యజమానులు. దీన్ని నిజం చేయడం మన బాధ్యత కాదా... ఈ లక్ష్యం సాధించడానికి అనువైన పరిస్థితి సృష్టించడం మన బాధ్యత" అని అన్నారు. ఆర్ఎస్ఎస్ చాలా కాలంగా ఈ లక్ష్య సాధనకోసం ఒక్కో సారి బహిరంగంగా ఒక్కోసారి రహస్యంగా కృషి చేస్తూ వచ్చింది. ఇప్పుడు బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), పౌరసత్వ నమోదు రిజిస్టరు (ఎన్ఆర్‌సి)లు రెంటినీ కలుపుకుని చూస్తే హెడ్గేవార్ చెప్పిన ఆర్ఎస్ఎస్ లక్ష్యానికి అనుగుణంగానే ఉంది.

స్వాతంత్ర పోరాటానికి ముందు భారత దేశాన్ని చీల్చడానికి ముస్లిం లీగ్ ముందుకు తీసుకువచ్చిన ద్విజాతి సిద్ధాంతాన్ని ఆర్ఎస్ఎస్ నాయకులు అనుసరించారు. పాకిస్థాన్ చీలిపోయిన తరువాత భారత దేశాన్ని హిందూమతతత్వ దేశంగా మార్చాలని కలలు గన్నారు. కానీ కుల, మత, ప్రాంత, భాషా బేధాలకు అతీతంగా జరిగిన మన స్వాతంత్ర పోరాట వారసత్వంగా ఏర్పడిన ప్రభుత్వాలు ఆర్ఎస్ఎస్ ఆటలు సాగనివ్వలేదు. అంబేద్కర్ నేతృత్వంలో రచించబడిన మన రాజ్యాంగం లౌకిక భారత దేశాన్ని ఆవిష్కరించింది.

తమ హిందూరాష్ట్ర లక్ష్యానికి దేశ రాజ్యాంగం అడ్డుగా ఉన్నది

కనుకనే ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రభుత్వాలు పనిగట్టుకుని రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయి. కాశ్మీర్‌కు సంబంధించిన 370 అధికరణాన్ని రద్దు చేయడం, అయోధ్య సమస్యల తరువాత ఈ సిఎఎ–ఎన్ఆర్‌సిలు భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను నాశనం చేయడానికి బిజెపి–ఆర్ఎస్ఎస్‌కు మంచి ఆయుధాలుగా లభించాయి.

**తీవ్ర పరిణామాలు**

సిఎఎ–ఎన్ఆర్‌సి అమలు వల్ల భారత దేశానికి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. ముస్లింలను, హిందూ ఏతరును రెండవజాతి పౌరులుగా అణచిపెట్టి ఉంచాలన్న ఆర్ఎస్ఎస్ ప్రయత్నాలకు ఇవి ఊతమిస్తాయి. 1939లో ఆర్ఎస్ఎస్ సిద్ధాంత వేత్త గోల్వాల్కర్ ఇలా పేర్కొన్నారు: "విదేశీ శక్తులకు (ముస్లిం, క్రైస్తవులు వగైరాలకు) రెండే మార్గాలు తెరిచి ఉన్నాయి. వాళ్లు జాతీయ జాతి (నేషనల్ రేస్) లో కలిసిపోయి దాని సంస్కృతిని అనుసరించాలి  లేకుంటే జాతీయ జాతి అనుమతిస్తే వారి దయాదాక్షిణాలపై బ్రతకడం, జాతీయ జాతి కోరిక మేరకు దేశాన్ని విడిచి పెట్టడం చేయాలి." ఆర్ఎస్ఎస్ సిద్ధాంతవేత్తలు చెప్పిన ఫాసిస్టు తరహా సూత్రాలనే నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్నదన్న విషయం ఇటీవలి కాలంలో, ముఖ్యంగా మోడీ రెండవసారి పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకుంటున్న చర్యలను బట్టి తెలుస్తోంది.

మోడీ ప్రభుత్వ ఈ మతతత్వ ప్రయత్నాలను ఆపకపోతే ముస్లిం ప్రజానీకానికే కాదు మతాలతో నిమిత్తం లేకుండా దేశంలోని ప్రజలందరూ నష్టపోతారు. మొదటిది, ఈ ప్రయత్నాలు ఆర్థికంగా అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లిస్తాయి. రికార్డు స్థాయిలో పెరిగిపోయిన నిరుద్యోగం, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు సంక్షోభంలో కూరుకుపోవడం, పెరుగుతున్న దారిద్ర్యం, పేద–ధనిక అంతరాలు విపరీతం అవుతుండడం... వీటికి వ్యతిరేకంగా శ్రామిక ప్రజానీకం ఏకం కాకుండా బిజెపి సృష్టిస్తున్న మత విభజన అడ్డుకుంటుంది. రెండవది, ఈ విధానాల వల్ల దేశ సమైక్యతకే ప్రమాదం సంభవిస్తుంది. భారత దేశాన్ని హిందూ మెజారిటీ దేశంగా మార్చాలన్న ప్రయత్నాలు మన దేశంలో మతపరమైన వేర్పాటు వాదానికి ఊతమిస్తాయి. దేశంలో కాశ్మీర్‌లో ముస్లింలు, పంజాబ్‌లో సిక్కులు, ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు మెజారిటీగా ఉన్నారు. అలాగే దేశంలో అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన అనేక జాతుల ప్రజలు భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిపాదిస్తున్న లౌకిక భారత దేశంలో కలిసి మెలిసి ఉంటున్నారు. ఒకే దేశం ఒకే మతం, ఒకే భాష అన్న ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం అమలు చేయడానికి ప్రయత్నిస్తే దేశ సమైక్యతకే ప్రమాదం ఏర్పడుతుంది.

**ప్రజల నుండి ప్రతిఘటన : ప్రభుత్వ అణచి వేత చర్యలు**

నరేంద్ర మోడీ ప్రభుత్వం అతి నిరంకుశంగా తీసుకువచ్చిన ఎన్ఆర్‌సి –సిఎఎలకు దేశ వ్యాపితంగా ఊహించని ప్రతిఘటన ఎదురయ్యింది.

పార్లమెంటు ఉభయ సభల్లో పౌరసత్వ సవరణ బిల్లు (కాబ్) ఆమోదం పొంది చట్టంగా మారిన వెంటనే అస్సాంలో పెద్ద ఎత్తున ప్రజా నిరసన ప్రారంభమైంది. వారం రోజుల పాటు అస్సాం రణరంగంగా మారింది. మోడీ ప్రభుత్వం చేసిన పౌరసత్వ సవరణ చట్టం 1985లో కేంద్ర ప్రభుత్వానికీ, అస్సాం ఉద్యమకారులకీ మధ్య కుదిరిన అస్సాం ఒప్పందాన్ని వమ్ము చేస్తుంది. ఆ ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తరువాత రాష్ట్రంలోకి ప్రవేశించిన



సిఎఎ–ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న జామియా మిలియా విశ్వవిద్యాలయం విద్యార్థులను అడ్డుకుంటున్న ఢిల్లీ పోలీసులు

వారందరినీ మతాలతో సంబంధం లేకుండా విదేశీయులుగా ప్రకటించాలి. కానీ బిజెపి ప్రభుత్వం తెచ్చిన  పౌరసత్వ సవరణ చట్టం వల్ల ముస్లిమేతరులందరికీ పౌరసత్వం ఇవ్వాల్సి వస్తుంది. ఇది తమ రాష్ట్రంలో అస్సామీయులను మైనారిటీలుగా మార్చేస్తుందన్న భయం వారిలో ఆవహించడంతో ప్రజల నుండి ఒక్కసారిగా నిరసన వ్యక్తమైంది. నిజానికి ఈ భయం వల్లనే 1980వ దశకంలో అస్సాం విద్యార్థి ఉద్యమం బయలుదేరింది.

అస్సాం, త్రిపురలతోపాటు పలు ఈశాన్య రాష్ట్రాల్లో అల్లర్లు చెలరేగాయి. పోలీసు కాల్పుల్లో అయిదుగురు మరణించారు. వేలాది మందిని రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం అరెస్టు చేసి కేసులు పెట్టింది. గౌహతి, దిబ్రుగర్‌లలోనూ, మేఘాలయ లోని పలు ప్రాంతాల్లోనూ కర్ఫ్యూ విధించారు. అస్సాంలో ఇంటర్నెట్ సేవలను వారం రోజుల పాటు ప్రభుత్వం నిలిపివేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో బందులు, నిరసనలతో వారం రోజులు ప్రజా జీవనం స్థంభించి పోయింది. ఈశాన్య రాష్ట్రాల నాయకులంతా దీన్ని వ్యతిరేకించారు. చివరికి అస్సాంలో అధికారంలో ఉన్న పలువురు బిజెపి నాయకులు కూడా ఈ చట్టాన్ని వ్యతిరేకించారు. అక్కడ నిరసన జ్వాలలు కాస్త తగ్గు ముఖం పడుతున్నాయన్నంతలో భారత దేశంలోని ఇతర ప్రాంతాలకు నిరసనోద్యమం పాకింది.

ఉత్తరాది నుండి దక్షిణాదివరకు ఆసేతు శీతాచలం నిరసనలతో అట్టుడికింది. ముఖ్యంగా మతాలకు అతీతంగా అన్ని యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల్లోని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఉత్తర ప్రదేశ్‌లోని అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ విద్యార్థులు గుజరాత్‌లోని అహ్మదాబాద్, గోవాలలో నిరసన కారులు పౌరసత్వ చట్టానికి చేసిన సవరణలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్లమీదకు వచ్చి నిరసన చేపట్టారు. డిసెంబర్ 15న నిరసన జ్వాల దేశ రాజధాని నగరం ఢిల్లీకి చేరుకుంది. ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు విరుచుకు పడడంతో రణరంగంగా మారింది.  పోలీసులు విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించి విద్యార్థులపై భాష్పవాయు గోళాలు ప్రయోగించారు, రక్తాలు వచ్చేట్లు విద్యార్థులను కొట్టారు.  లైబ్రరీ, క్యాంటీన్లలో ఉన్న విద్యార్థులను కూడా వదల్లేదు. పోలీసులు ఎటువంటి అనుమతి లేకుండా క్యాంపస్‌లోకి ప్రవేశించి విద్యార్థులను కొట్టడమే కాకుండా క్యాంపస్‌నుండి తరిమేశారని యూనివర్సిటీ విసి చెప్పారు.

జామియా మిలియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాల కింద నడిచే ఢిల్లీ పోలీసుల పాశవిక దమన కాండ దేశ వ్యాపితంగా విద్యార్థుల్లో ఆగ్రహం రగిల్చింది. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా దేశం నలుమూలలా విద్యార్థి లోకం వీధుల్లోకి వచ్చి పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. చివరికి ప్రధాని నరేంద్ర మోడీ, హోమ్ మంత్రి అమిత్ షాలు ఈ చట్టం వల్ల దేశంలోని ముస్లింలకు ఎటువంటి హాని కలగబోదని హామీ ఇచ్చినా విద్యార్థులుగానీ, ప్రజలుగానీ నమ్మలేదు. నిరసన ప్రదర్శనలు మరింత ఎక్కువైనాయి. ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థులు తరగతులు బహిష్కరించి పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేశారు. లక్నోలో అనేక కళాశాలల విద్యార్థులు నిరసన ప్రదర్శనలు జరిపారు. వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్శిటీ, కొల్‌కొతాలోని జాదవ్ పూర్ యూనివర్శిటీల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు ఈ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ముంబయి, చెన్నయ్ ఐఐటీలు, హైదరాబాద్, ముంబయి యూనివర్శిటీలు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్), పాటియాలాలోని పంజాబ్ యూనివర్శిటీ, పాట్నా, పాండిచేరీ యూనివర్శిటీలు, కేరళలోని సెంట్రల్ యూనివర్శిటీలు నిరసనలకు వేదికలైనాయి. కాశ్మీర్ నుండి తమిళనాడు వరకు అనేక రాష్ట్రాల్లో ప్రజలు వీధుల్లోకి వచ్చి ధర్నాలు, ప్రదర్శనలు చేపట్టారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోనూ, ఉత్తర ప్రదేశ్‌లోని అనేక నగరాల్లోనూ ఇంటర్‌నెట్‌ను వారాల తరబడి నిలిపేసింది.

దేశంలోని విద్యార్థులకు మద్దతుగా విదేశాల్లో కూడా పేరుగాంచిన స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి యూనివర్శిటీల్లో విద్యార్థి ప్రదర్శనలు జరిగాయి.

కేరళలో వామపక్ష ప్రభుత్వ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీలు చట్టానికి వ్యతిరేకంగా తీవ్రంగా స్పందిచారు. ఈ రెండు రాష్ట్రాలతోబాటు ఢిల్లీ, పంజాబ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘర్, ఒడిషా, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ చట్టాన్ని తమ రాష్ట్రాల్లో అమలు జరపబోమని ప్రకటించారు.

దేశంలోని 1000 మంది ప్రముఖ మేధావులు పౌరసత్వ సవరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఒక లేఖ రాశారు. వీరిలో దేశ విదేశాల్లో పేరెన్నిక గన్న చరిత్ర కారులు, సినిమా ప్రముఖులు, రచయితలు అనేక మంది ఉన్నారు. పలువురు ప్రముఖులు చట్టాన్ని నిరసిస్తూ ట్వీట్లు చేశారు.

మొత్తం మీద బిజెపి ప్రభుత్వం ఊహించని ప్రతిఘటన దేశ ప్రజలనుండి ఎదురైంది.

**వైఎస్ఆర్ సిపి, తెలుగు దేశం పార్టీల అవకాశవాద వైఖరి**

రాష్ట్రంలో ఒకదానితో ఒకటి పోట్లాడుకుంటున్నట్లు నటించే వైఎస్ఆర్ సిపి, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగు దేశం పార్టీలు ఈ పూర్తి అవకాశవాదంతో ఈ చట్టానికి అనుకూలంగా ఓటు వేశాయి. ఎన్నికలకు ముందు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో పోరాడినట్లు నటించిన తెలుగు దేశం పార్టీ సభ్యులు లోక్‌సభలోనూ, రాజ్య సభలోనూ ఈ ప్రమాదకర చట్టానికి అనుకూలంగా ఓట్లు వేశారు. వారిలో విజయవాడ లోక్ సభ సభ్యుడు కేశినేని నాని మాత్రం తన అంతరంగం అంగీకరించడం లేదని చెబుతూ వ్యతిరేకంగా ఓటు వేశారు. రాష్ట్రంలో ముస్లింలను ఉద్ధరిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చి వారి ఓట్లు పొంది అధికార పీఠం ఎక్కిన వైఎస్ఆర్ కాంగ్రెస్ బిజెపి కొమ్ముకాసి చట్టానికి అనుకూలంగా ఓటు వేసింది. ఆ విధంగా ఆ రెండు పార్టీలు లౌకిక తత్వానికీ, దేశరాజ్యాంగానికీ తూట్లు పొడిచే పనికి సహకరించాయి. ఎన్ఆర్‌సికి రాష్ట్రంలోనూ, దేశవ్యాపితంగానూ ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో చివరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్ఆర్‌సి అమలు జరపబోమని ప్రకటించారు.

**వామపక్షాల సూత్రబద్ధ వైఖరి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఇతర వామపక్షాలు పౌరసత్వ సవరణ బిల్లును తుదకంటా వ్యతిరేకించాయి. వాస్తవానికి 2016లో ఈ బిల్లును పరిశీలించడానికి ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీలో సభ్యుడైన మహ్మద్ సలీం బిల్లును తీవ్రంగా విమర్శిస్తూ ఒక అసమ్మతి పత్రం ప్రవేశపెట్టారు. బిల్లును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంటులో బిల్లుపై జరిగిన చర్చల్లో వామపక్ష సభ్యులు బిల్లు ప్రవేశపెట్టడం వెనుక మోడీ ప్రభుత్వ కుట్రపూరిత వైఖరిని ఎండగట్టారు. బిల్లుపై జరిగిన ఓటింగులో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష సభ్యులతో పాటు వారు వ్యతిరేకంగా ఓటు వేశారు.

పౌరసత్వ సవరణ బిల్లును తమ రాష్ట్రంలో అమలు జరపబోమని కేరళ వామపక్ష ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించడమే కాదు, బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపిత ఆందోళన చేపట్టారు. కేరళలోని అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలను (హిందూత్వ శక్తుల నాయకత్వంలో ఉన్నవి మినహా) పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఐక్యం చేశారు. డిసెంబరు 16న తిరువనంతపురంలో శాంతియుతంగా సాగిన సత్యాగ్రహ శిబిరానికి అన్ని రాజకీయ పార్టీలు, మత విశ్వాసాలకు చెందిన నాయకులు హాజరయ్యారు.

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వామపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబర్ 19న దేశవ్యాపితంగా అన్ని రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల అగ్రనాయకులు పాల్గొన్నారు. మన రాష్ట్రంలో కూడా చట్టానికి వ్యతిరేకంగా వామపక్షాలు ఆందోళనలు నిర్వహించాయి. 19వ తేదీన దేశవ్యాపిత ఆందోళనలో భాగంగా రాష్ట్రం నలుమూలలా నిరసన కార్యక్రమాలు జరిగాయి. విజయవాడలో వేలాదిమంది ప్రజలతో జరిగిన నిరసన దీక్షలో వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

**ఐక్యంగా తిప్పికొట్టాలి**

పౌరసత్వ సవరణ చట్టం ఈ దేశంలోని ముస్లింల సమస్య కాదు. అది దేశ రాజ్యాంగానికీ, లౌకిక, ప్రజాస్వామ్యానికీ ముంచుకొస్తున్న ప్రమాదానికి సంబంధించిన సమస్య. లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగం స్థానంలో హిందూరాష్ట్ర ఏర్పాటుకు ఆర్ఎస్ఎస్-బిజెపిలు చేస్తున్న ప్రయత్నాల్లో నాడు బాబ్రీమసీదు కూల్చివేత, నేడు జమ్మూ-కాశ్మీర్‌ను చీల్చడం, 370వ అధికరణం రద్దు, ప్రస్తుత పౌరసత్వ సవరణ చట్టం తేవడం... ఇవన్నీ ఒక భాగం.

ఈ దశలోనే సిఎఎను తిప్పికొట్టకపోతే అమిత్ షా చెప్పినట్లు రేపు దేశమంతటికీ ఎన్ఆర్‌సి అమలుకు నిరాఘాటంగా పూనుకుంటారు. అప్పుడు భారతీయులం అందరం మనం భారతీయులమేనని నిరూపించుకోడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో నిలుచుని పత్రాలు సమర్పించాల్సి వస్తుంది. పత్రాలు లేకపోతే మనమంతా స్వదేశంలో అక్రమ వలసదారులం అవుతాం. కాబట్టి మతాలకతీతంగా ప్రజలంతా ఏకమవ్వాలి. పౌరసత్వ చట్టానికి చేసిన సవరణలను తిప్పికొట్టాలి. ఎన్ఆర్‌సిని దేశమంతటికీ విస్తరించకుండా అడ్డుకోవాలి.

❋

# తాష్కెంట్‌లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ మొదటి శాఖ

(2వ పేజీ తరువాయి)


గుర్తింపును కమ్యూనిస్ట ఇంటర్నేషనల్ కొనసాగించింది.

ఈ శాఖ భారతదేశానికి వెలుపల ఏర్పడినందువలన ఇది భారత కమ్యూనిస్టు పార్టీ కాదనే వాదనలో పస లేదు. ఇది చాలా సంకుచితమైన ఆలోచన. 1920లో తాష్కెంట్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటికి భారతదేశంలో ఎక్కడా కమ్యూనిస్టు గ్రూపులు లేవు. కేవలం 1922 లోనే కొన్ని గ్రూపులు ఏర్పడ్డాయి. వాటికి కూడా కమ్యూనిస్టు పార్టీలు ఎలా పనిచేయాలనే రాజకీయ, నిర్మాణ స్పష్టత లేదు. తాష్కెంట్‌లో ఏర్పడిన శాఖ మాత్రమే దేశంలో ఏర్పడుతున్న రకరకాల గ్రూపులతో, నాయకులతో సంబంధాలు పెట్టుకున్నది. 1921–22 మధ్య కాలంలో ఎస్ ఏ డాంగే(బొంబాయి), ముజఫర్ అహ్మద్(కలకత్తా), సింగారవేలు చెట్టియార్ (మద్రాస్) లతో ఉత్తర ప్రత్యుత్తరాలు రాస్తూ, సమాచార సంబంధాలు ఏర్పాటు చేసుకున్నది.

ఎంఎన్‌రాయ్, తాష్కెంట్‌లో ఏర్పడిన శాఖ బెర్లిన్ నుండి పనిచేయటం కోసం 1922లో అక్కడకు వెళ్ళిపోయారు. తాష్కెంట్ లాంటి మారుమూల ప్రాంతం నుండి భారతదేశంలోని వేరు వేరు ప్రాంతాలలో ఉన్న కమ్యూనిస్టులతో సంబంధాలు కొనసాగించడం కష్టమవుతుండటమే ఇందుకు కారణం. 1922 మేలో భారత కమ్యూనిస్టు పార్టీ మొట్టమొదటి పత్రిక ది వాన్‌గార్డ్ అఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ బెర్లిన్ నుండి వెలువడింది. బ్రిటిష్ అధికారుల దృష్టి పడకుండా ఉండడానికి మాత్రమే దానికీ భారత కమ్యూనిస్టు పార్టికి ఉన్న సంబంధాన్ని పతాక శీర్షికలో చేర్చలేదు. బ్రిటిష్ ప్రభుత్వం నిషేధాన్ని విధించినప్పటికీ ఈ పత్రిక దేశంలోని వివిధ కమ్యూనిస్టు గ్రూపులకు చేరి, వారికి కమ్యూనిజంపై రాజకీయ, సైద్ధాంతిక అవగాహన కల్పించడానికి తోడ్పడింది. కొన్ని ప్రచురణల తరువాత పత్రిక 'అడ్వాన్స్ గార్డ్' గా పేరు మార్చుకుంది. ఒక ఏడాది తరువాత మళ్ళీ 'వాన్‌గార్డ్'గా పేరు మారింది. ఈ పేరుతో ప్రచురణ ప్రారంభమైన తరువాత దీనిని భారత కమ్యూనిస్టు పార్టి అధికార పత్రికగా ప్రకటించడం ప్రాధాన్యత కలిగినది. అందువలననే వాన్‌గార్డ్ మొదటి వార్షికోత్సవ సందర్భంలో ఇసిసిఐ నుండి వచ్చిన సందేశంలో " స్వతంత్ర భారతదేశం వర్ధిల్లాలి! భారత కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలి! వాన్‌గార్డ్ వర్ధిల్లాలి" అని ఉంది.

తాష్కెంట్ గ్రూపు నాయకులు నిర్వహించిన సైద్ధాంతిక కృషిని తక్కువగా అంచనా వేయ కూడదు. ఎంఎన్‌రాయ్ రచించిన " పరివర్తనలో భారతదేశం" పుస్తకం గురించి వ్రాస్తూ అది "బ్రిటిష్ వారిపాలనలో ఉన్న భారతదేశపు ఆర్థిక రాజకీయ, సైద్ధాంతిక పరిస్థితులపై మొట్టమొదటి మార్క్సిస్టు లెనినిస్టు విశ్లేషణ" అని ఇఎంఎస్ నంబూద్రిపాద్ అన్నారు. మార్క్సిజం–లెనినిజాన్ని భారతదేశ పరిస్థితులకు అన్వయించే సైద్ధాంతిక కృషి చేసే ఈ సాంప్రదాయాన్ని 1934 తరువాత ఏర్పడిన సంఘటిత భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం కొనసాగించింది. 1921 అహమ్మదాబాద్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు ఈ తాష్కెంట్ గ్రూపే సంపూర్ణ స్వరాజ్య నినాదాన్ని ప్రణాళికగా పంపించింది. కాంగ్రెస్ మహాసభలలో మొట్ట మొదటి సారిగా సంపూర్ణ స్వరాజ్యం డిమాండ్‌ను హస్రత్ మోహాని ప్రతిధ్వనింపచేశాడు.

1919 మార్చిలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రారంభించబడింది. కొమింటర్న్ ఆధ్వర్యంలోనే వివిధ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడ్డాయి. ఆ రోజుల్లో కమ్యూనిస్టు ఉద్యమానికి అంతర్జాతీయ కార్మికవర్గ దృక్పథమే ఆత్మగా ఉండేది. కమ్యూనిస్టులు రాజ్య సరిహద్దులతో నిమిత్తం లేకుండా అంతర్జాతీయ కార్మికవర్గం కోసం ఉద్యమించారు. అందువలన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవాన్ని తాష్కెంట్‌లో, అంటే ఒక 'విదేశంలో' జరిగినదిగా చూడకూడదు. మన దేశ సరిహద్దులలోనే, అంటే 1925లో కాన్పూర్ మహాసభలో ఏర్పడినదే కమ్యూనిస్టు పార్టీ అనే సంకుచిత జాతీయ దృష్టితో చూడకూడదు. ఈ సందర్భంలో బినోయ్ విశ్వం మరో అనుచిత విషయాన్ని ప్రస్తావించారు. "వర్గ శత్రువులు చెడు ఉద్దేశాలతో 'విదేశీ' ముద్రను వేయడానికి చేసే ప్రయత్నాలను దృష్టిలో పెట్టుకోవాలని, శత్రువులు ఈ దాడిని మరింతగా పెంచే అవకాశం ఉందని, ఎందుకంటే తాష్కెంట్ సమావేశానికి హాజరైన ఏడుగురిలో ఇద్దరు విదేశీయులు ఉన్నారు" అని చెప్పారు. ఇది మరింత ఆశ్చర్యానికి గురిచేసే విషయం. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు, బోల్షివిక్కులకు విదేశీ ఏజెంట్లనే ముద్ర ఎప్పుడూ ఉన్నదే. మార్క్సిజం 'దేశీయ సిద్ధాంతం' కాదు కనుక దానికి విదేశీ ముద్ర ఎప్పుడు ఉండేదే. తమ అంతర్జాతీయ కార్మికవర్గ దృక్పథాన్ని గురించి కమ్యూనిస్టులు గర్విస్తారు.



సిపిఐ ఆవిర్భావానికి సంబంధించిన చరిత్రను వెలికి తీయడంలో తోడ్పడిన పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, సిపిఐ(ఎం) మొదటి కేంద్రకమిటీకి ఎన్నికైన కామ్రేడ్ ముజఫర్ అహ్మద్

ఆ సభ్యులలో ఉన్న ఇద్దరు విదేశీయులు ఒకరు – ఎవెలిన్ ట్రెంట్‌రాయ్, రెండో ఆమె రోసా ఫైటింగోఫ్. ఇద్దరూ కమ్యూనిస్టులే. ఒకరు అమెరికాలో పుట్టగా రెండో వారు రష్యాలో పుట్టారు. ఎంఎన్ రాయ్ భార్య ఐన ఎవెలిన్ ట్రెంట్‌రాయ్ భారత కమ్యూనిస్టుఉద్యమానికి చేసినసేవ మరువలేనిది. ఆమె భారతదేశంలో పరిస్థితుల గురించి వ్యాసాలు, విశ్లేషణలు రాసేవారు. తాష్కెంట్ లోనూ, బెర్లిన్‌లో కూడా పార్టీ నిర్మాణ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రారంభ శాఖలోని ఏడుగురు సభ్యులలో ఇద్దరు మహిళలు ఉన్నందుకు భారత దేశంలోని కమ్యూనిస్టులు గర్వించవలసి ఉంది.

భారత కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధిలో విదేశీయుల పాత్రను తుడిచి వేయడానికి చరిత్రను పునఃసమీక్షించాల్సిన అవసరం లేదు. మీరట్ కుట్ర కేసులో ఉన్న 33 మంది నిందితులలో ముగ్గురు బ్రిటీషువారు– బెన్ బ్రాడ్లీ, ఫిలిప్ స్ప్రాట్, హెచ్‌ఎల్ హచిన్‌సన్– ఉన్నారని జ్ఞాపకం చేసుకోవాలి. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి రజని పామిదత్, బెన్ బ్రాడ్లీ లాంటి బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు చేసిన కృషిని భారత కమ్యూనిస్టులు మరచిపోకూడదు.

తాష్కెంట్ కమ్యూనిస్టు పార్టీ గాని, కాన్పూర్ కమ్యూనిస్టు పార్టీ గాని పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించలేదు. అలా ఒక కార్యక్రమాన్ని

ఆమోదించి ఉంటే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌తో పూర్తిస్థాయి కమ్యూనిస్టు పార్టీగా అనుబంధానికి అవకాశం ఉండేది. అందువలన పార్టీ అవిర్భా వానికి కార్యక్రమాన్ని కూడా కొలమానంగా చూడలేము. నిజానికి కాన్పూర్ మహాసభ తరువాత కూడా అక్కడ ఏర్పడిన పార్టీశాఖ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌తో అనుబంధం కోసం దరఖాస్తు చేసుకోలేదన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి.

విదేశాలలో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ, భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అనేకమంది కమ్యూనిస్టులను వెనక్కు పంపించింది. అందులో చాలామందిని అరెస్టు చేసి పెషావర్, కాన్పూర్ కుట్ర కేసులలో ఇరికించి, జైలుకు పంపించారు. తాష్కెంట్, మాస్కోలలో కమ్యూనిస్టులుగా మారిన ముహ జిర్లు ఫిరోజుద్దీన్ మన్సూర్, ఎంఏ మజీద్ లాంటి వారు భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధిలో ముఖ్యమైన భూమిక పోషించారు. అందువలన తాష్కెంట్‌లో ఏర్పడ్డ భారత కమ్యూ నిస్టు పార్టీకి 1925లో కాన్పూర్‌లో జరిగిన కమ్యూనిస్టు మహాసభకు దగ్గరి సంబంధం ఉ ంది. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి తాష్కెంట్ తొలి అడుగైతే కాన్పూర్ మహాసభ పార్టీ అభివృద్ధికి పడిన రెండో అడుగు.

**ధీరోదాత్త విప్లవకారుడు**
**దాదా అమీర్ హైదర్ ఖాన్**

దాదా అమీర్ హైదర్‌ఖాన్ ఏ పనిలో అయినా సులువుగా చొరబడగల, బుద్ధికుశలత గల భారత ఉపఖండంలోని ధీరోదాత్త కార్మిక వర్గ విప్లవకారులలో ఒకరు. భారతదేశాన్ని విదేశీ ఆధిపత్యం నుండి తప్పించడానికి బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడారు. కార్మికులను, కర్షకులను సంఘటితపరచి, వారి హక్కులను కాపాడేందుకు, వర్గరహిత సమాజం నిర్మించడానికి అహరహం కృషి చేసారు. చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణా నికి పాటుపడ్డారు. ఏడున్నర దశాబ్దాల పాటు అణచివేతకు, నిర్బంధాలకు గురైనా కార్మికవర్గ విప్లవం పట్ల నిబద్ధతకు, ప్రజలకు సేవచేయడా నికి ఆయనకున్న పట్టుదలకు, దీక్షకు మరెవ్వరు సాటిరారు. శ్రామికవర్గ విప్లవం, సోషలిజం ఆలోచన పట్ల ఆయన నిబద్ధత, చరిత్రగతిని మార్చడానికి ఆయన చేసిన పోరాటాలు ఎన్నదగి నవి. ఆయన జీవిత చరిత్ర రేఖామాత్రంగా చదివినా 20వ శతాబ్దం సగభాగం చరిత్ర పాఠం చదివినట్టే.

వలసవాదానికి వ్యతిరేకంగా, స్వేచ్ఛను కోరుకుంటూ జరిగిన పోరాటాలలోకి అన్ని సామాజిక తరగతుల నుండి ప్రజలు వచ్చారు. ఆ పోరాటాలు ఎందరో కమ్యూనిస్టు యోధులను తయారు చేసాయి. వీరిలోని మొదటి తరం వారిలో చాలా మంది ముస్లిం మతానికి చెందిన వారు ఉన్నారు. అటువంటి ధీరోదాత్తులలో ఒకరు అమీర్ హైదర్‌ఖాన్.



**అమీర్ హైదర్ ఖాన్ తయారుచేసిన ఆణిముత్యం: దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య**

ఈనాడు పాకిస్థాన్‌లోని ఉత్తర పంజాబ్ లోని గుజ్జర్ ఖాన్ ప్రాంతంలోని కలియన్ సియాలీయాన్ అనే కుగ్రామంలో 1900లో ఒక పేద రైతు కుటుంబంలో అమీర్ హైదర్‌ఖాన్ జన్మించారు. ఆర్థికంగా, రాజకీయంగా కూడా పంజాబ్‌లో అత్యంత వెనుకబడిన ప్రాంతం అది. ఆ కాలంలో కొత్తగా జాగ్రతమవుతున్న జాతీయతకు కేంద్ర బిందువుగా మారిన ఆ ప్రాంతం నుండి ఎంతోమంది దేశభక్తులు, విప్లవవీరులు తయారయారు. ఈ ప్రాంతం నుండే అనేకమంది ఐఎన్ఏ లో కూడా చేరారు. అటువంటి పోరాట యోధులకు జన్మనిచ్చిన ప్రాంతం నుండి వచ్చిన అమీర్ హైదర్‌ఖాన్ కమ్యూనిస్టు ఉద్యమ వ్యవస్థాపకులలో ఒకరవడం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించదు.

చిన్నతనం నుండి దాదా జీవితం కష్టాల మయం. ఆయనకి అయిదారు సంవత్సరాలు నిండక ముందే తండ్రి చనిపోయాడు. ఆ గ్రామంలో స్కూల్ లేకపోవడం, హైదర్‌కి చదువు చెప్పించే శ్రద్ధ మారుటి తండ్రికి లేకపోవడం వలన సరైన విద్యనభ్యసించే అవకాశం ఆయనకు లేకపోయింది. ఇంట్లో స్నేహపూర్వక వాతావర ణం కొరవడడం వలన ఆయన పద్నాలుగు ఏళ్ల వయసులోనే విశాల ప్రపంచంలోకి అడుగు పెట్టవలసి వచ్చింది. బతకటం కోసం చిల్లర మల్లర పనులు చేస్తూ ప్రపంచం అంతా తిరగడం వలన, అతి చిన్న వయసులోనే జీవితంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొనే శక్తి అలవడింది.

1914లో బొంబాయి వెళ్లి, అక్కడి నుండి లండన్ వెళుతున్న ఒక ఓడలో పనివాడిగా కుదిరారు. తిరగబడే స్వభావం ఉండడం వలన తన తోటి కార్మికులకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించడానికి యాజమాన్యంతో పోరాడి విజయం సాధించారు. 1918లో అమెరికన్ వాణిజ్యనౌకలో చేరారు. అందులో పని అతనిని యూరప్, అమెరికా, తూర్పు ప్రాంతమేకాక ప్రపంచమంతా తిరిగే అవకాశం కలిగించింది. అంతర్జాతీయ వ్యవహారాలు నేర్పించింది. వలస దేశాలలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ దుస్థితిని తెలుసుకునే అవకాశం కలిగించింది. ఈ సమయంలోనే ఆయన జోసెఫ్ ముల్కానే అనే ఐర్లాండ్ జాతీయుడిని కలిశారు. ఆయన ద్వారా బ్రిటిష్ వ్యతిరేక రాజకీయాలు తెలుసు కున్నారు. 1920లో న్యూయార్క్‌లో భారత జాతీయవాదులను, గదర్ పార్టీ సభ్యులను కలుసు కున్నారు. తన ప్రాణాన్ని సహితం ఏమాత్రం లెక్క చేయకుండా నిషేధించబడిన గదర్ పార్టీ సాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయు లకు పంచారు.

యుద్ధం తరువాత కార్మికవర్గంలో పెల్లు బుకుతున్న పోరాటాలలో భాగంగా 1922లో ఆయన పనిచేస్తున్న నౌకలోని కార్మికులు సమ్మె చేసారు. అందులో అమీర్ హైదర్‌ఖాన్ చురుకు గా పాల్గొనడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. ఆ తరువాత బాయిలర్ ఇంజినీర్‌గా, విమాన పైలట్‌గా పనిచేసారు. జీవించడానికికొన్నాళ్ళు ఆటో కూడా నడిపారు. ఆలా రక రకాల పనులు చేస్తూ మొత్తం అమెరికా అంతా తిరిగారు. ఈ కాలంలో ఆయన రాజకీయ కార్య కర్తగా మారి సామ్రాజ్యవాద వ్యతిరేక లీగ్‌లో నూ, అమెరికా లోని వర్కర్స్ పార్టీలోనూ పనిచేశారు.

1926లో ఆయన అధ్యయనం కోసం సోవియెట్ యూనియన్‌లోని టాయిలర్స్ అఫ్ ది ఈస్ట్ (తూర్పున ఉన్న కష్టజీవుల) విశ్వవిద్యాల యానికి పంపబడ్డారు.

పారిశ్రామిక కార్మికులు ఉన్న అన్ని వలస దేశాలలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించడానికి సహాయం చేయటం కోసం కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రయత్నించింది. ఈ ఉద్దేశంతోనే విప్లవ చైతన్యం గల కార్మికులను కొందరిని తీర్చిదిద్దితే వారు పార్టీ నాయకులుగా అభివృద్ధి అయి తమ తమ దేశాలలో కార్మికు లను సంఘటితం చేస్తారనే ఉద్దేశంతో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ వారికి అవసరమైన సహాయాన్ని అందించడానికి పూనుకుంది. ఈ నేపథ్యంలోనే భారత సంతతికి చెందిన కమ్యూనిస్టులను కొందరిని పంపమని ఎం. ఎన్ రాయ్ అమెరికన్ కమ్యూనిస్టు పార్టీని కోరగా వారు గదర్ పార్టీని సంప్రదించారు. గదర్ పార్టీ అయిదుగురు విద్యార్థులను ఎంపిక చేసింది. దాదా అందులో ఒకరు. వలసదేశాల నుంచి వచ్చిన విద్యార్థుల పేర్లు రహస్యంగా ఉంచడానికి కొత్త పేర్లు పెట్టేవారు. అలా సకారోవ్ పేరుతో దాదా రెండేళ్లు మార్క్సిజం లెనినిజం అధ్యయనం చేసారు.

1928లో మాస్కో విశ్వవిద్యాలయంలో చదువు పూర్తవగానే భారతదేశానికి వచ్చి, వెంటనే బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర పోరాటంలో మునిగి పోయాడు. ఎస్వి ఘాటే, ఎస్ఏ డాంగే, పిసి జోషి, బిటి రణదివె, బ్రాడ్లీ, బొంబాయిలో ఉన్న మరికొందరు కమ్యూనిస్టులతో సంబంధాలు పెట్టుకున్నారు. జనరల్ మోటార్స్‌లో కార్మికునిగా చేరి, అక్కడి కార్మికులను, పక్కనే ఉన్న వస్త్ర పరిశ్రమలోని కార్మికులను సంఘటితం చేయడం ప్రారంభించారు. పెరుగుతున్న కమ్యూనిస్టుల కార్యకలాపాలకు బెదిరిపోయిన బ్రిటిష్ ప్రభుత్వం అమీర్‌హైదర్ ఖాన్‌తో సహా చాలామంది ముఖ్యమైన కమ్యూనిస్టులపై మీరట్ కుట్ర కేసు బనాయించింది. అమీర్ హైదర్‌ఖాన్ అరెస్టు కాకుండా తప్పించుకుని, తప్పుడు పాస్‌పోర్ట్‌తో మాస్కో పారిపోయి అక్కడ జరిగిన అంతర్జాతీయ కార్మికసంఘ మహాసభలలో (ప్రొఫింటెర్న్) అధ్యక్షవర్గ సభ్యునిగా పాల్గొన్నారు. 1930లో సిపిఎస్‌యు 16వ మహాసభకి కూడా హాజరయ్యారు.

ఆయన 1931లో బొంబాయి తిరిగి వచ్చా రు. మీరట్ కుట్రకేసులో అప్పటికింకా ఆయన పేరు ఉండడం వలన, భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఆయనను మద్రాసుకు పంపించింది. శంకర్ అనే మారుపేరుతో దక్షిణ భారతదేశంలో రాజకీయ కార్యకలాపాలు కొనసా గించారు. కార్మికులు, కర్షకులలో చురుకుగా పనిచేసారు. 1932లో మద్రాస్‌లో యంగ్ వర్కర్స్ లీగ్‌ని స్థాపించారు. తాంజోర్ డెల్టాలో రైతులను సంఘటితం చేయడానికి నిర్దిష్టమైన డిమాండ్లను రూపొందించారు. అదేసమయంలో చాలామంది యువకులతో సంబంధాలు ఏర్పరచుకుని వారిని కమ్యూనిస్టు



సిపిఐ(ఎం) అగ్రనేతలు ఇఎంఎస్, సూర్జిత్, రణదివే, జ్యోతిబసులతో అమీర్ హైదర్ ఖాన్

ఉద్యమం వైపు ఆకర్షించారు. అలా సంబంధాలు ఏర్పరచుకున్న వారిలో అప్పుడు మద్రాస్ లయోలా కాలేజీలో ఇంటర్మీడియేట్ చదువుతున్న పుచ్చలపల్లి సుందరయ్య ఒకరు. అయితే ప్రభుత్వం అతి త్వరలోనే ఆయన కార్యకలాపాలను పసిగట్టింది. ఆయనను, ఆయన తోటి విప్లవ కారులను బొంబాయిలో నిర్బంధించింది. 1939లో బ్రిటిష్ ప్రభుత్వం రెండేళ్ల కారాగార శిక్ష విధించింది. ఆయన తన కార్యకలాపాలను గురించి జైలులో పుస్తకం వ్రాసాడు. "పోయేవి సంకెళ్ళే: ఒక విప్లవకారుని జీవితం, పోరాటం–దాదా అమీర్ హైదర్ ఖాన్ జ్ఞాపకాలు" అనే పేరుమీద ఆ పుస్తకం వెలువడింది.


'ప్రజాయుద్ధ సిద్ధాంతం' తరువాత 1942 లో విడుదల చేయబడిన కమ్యూనిస్టులలో చివరి వాడు ఆయనే. భారతదేశంలోని కార్మిక, కర్షకులలో కొంతకాలం పనిచేసిన తరువాత విప్లవోద్యమ నిర్మాణం కోసం 1945లో పాకిస్థాన్‌లోని ఆయన స్వంత ప్రాంతానికి అమీర్ హైదర్‌ఖాన్‌ను పంపించారు. అక్కడ రావల్పిండి జిల్లా కమిటీకి ఎన్నికయ్యారు. అక్కడ నిర్మించుకున్న రహస్య యంత్రాంగం సహాయంతో దేశ విభజన సమ యంలో అనేకమంది హిందూ కుటుంబాలను భద్రంగా భారతదేశం పంపించడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

పాకిస్తాన్ ఏర్పడిన తరువాత పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా పనిచేసారు. లౌకిక ప్రజాతంత్ర విలువలు కాపాడుతూ ఇస్లామిక్ రాజ్య అణచివేతను ధైర్యంగా ఎదుర్కొన్నారు. నిరంతరం వేటాడబడుతూ ఎన్నోసార్లు నిర్బంధా నికి గురయ్యారు. 1949లో మతతత్వ చట్టం కింద నిర్బంధించబడి, 15 నెలల తరువాత విడుదలయారు. ఆ తర్వాత కొన్ని నెలలకే రావల్పిండి కుట్ర కేసులో నిందితులకు న్యాయ సహాయాన్ని అందించినందుకు తిరిగి అరెస్ట్ చేశారు. 1958లో అయూబ్‌ఖాన్ సైనిక పాలనను విధించగానే దాదాను అరెస్ట్ చేసి, ఇతర కామ్రేడ్స్‌తో పాటు రావల్పిండి జైలుకి పంపారు. తన జీవితంలోని చివరి భాగం 1970–80ల మధ్య రావల్పిండిలో గడిపారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత 1988లో మొట్టమొదటిసారిగా ఆయన భారత దేశం వచ్చి, చివరిసారిగా కమ్యూనిస్టు కామ్రేడ్స్‌ని కలిశారు. 1989 డిసెంబర్ 27వ తేదీ ఆయన తుదిశ్వాస విడిచారు.

ఆయన తన గురించి చెప్పుకున్నట్టుగానే జీవితమంతా ఒక ఫకీరుగా, గూడు లేని సంచారకునిగా గడిపారు. ఏ రకమైన విలువైన ఆస్తులు లేవు. తనకు వారసత్వంగా వచ్చిన భూమిలో బాలబాలికలకు ఒక పాఠశాల నిర్మించారు. అందులో ఒక సైన్స్ ప్రయోగశాల కూడా కట్టించారు. ఆయనొక గొప్ప శ్రామికవర్గ అంతర్జాతీయవాది. ఆయన బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో ఎంత నైపుణ్యంతో, దృఢత్వంతో పోరాడారంటే బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను "అతి ప్రమాదకరమైన వ్యక్తిగా" ముద్ర వేసింది. ఎన్నోసార్లు బ్రిటిషువారి వేగులను పల్టీలు కొట్టించారు. నావికుడిగా ఉన్న అనుభవంతో, పరిచయాలతో విదేశాలకు అనేకసార్లు ప్రయాణించి కొమిన్‌టర్న్‌తో వివిధ దేశాలను సమన్వయం చేయడంలో సహకరించారు. ప్రపంచాన్ని మరింత అభ్యుదయం వైపు మార్చటమన్న మార్క్సిస్టు నిర్వచనానికి ఆయన జీవితం నిజమైన అర్థాన్ని చూపింది. సమాజం సోషలిజం వైపు మారితేనే కార్మికవర్గం నిజంగా విముక్తి చెందుతుంది. ఆ నమ్మకాన్ని ఆచరణలో పెట్టడమే ప్రతి మనిషి జీవితంలోని ప్రాథమిక కర్తవ్యం. ఇంత గొప్ప విప్లవకారుని వారసత్వం ప్రసుత, భవిష్యత్ తరాల తీవ్రవాద, అభ్యుదయవాదులను ఉత్తేజపరుస్తూనే ఉంటుంది.

**(అనువాదం: కె ఉషారాణి)**

# సమ్మె: పోరాటం నేర్పే పాఠశాల



– వి.ఐ. లెనిన్

"....తమను తీవ్రమైన ఈతిబాధలకు గురిచేసే పీడననుండి రక్షించుకునేందుకు కార్మికులు తాడోపేడో అనే రీతిలో పోరాటానికి దిగుతారు. ఒక్కొక్కరుగా ఉంటే తాము శక్తిహీనులమని, పెట్టుబడిదారీ పీడన తమను అణగదొక్కేస్తుందని గుర్తించే కొద్దీ వారు తమ యజమానులపై ఐక్యంగా తిరగబడతారు. ఆ విధంగా కార్మికుల సమ్మెలు ప్రారంభమవుతాయి...

"అన్ని దేశాల్లోనూ కార్మికుల ఆగ్రహం తొలుత విడివిడి తిరుగుబాట్లుగా ప్రారంభమవుతుంది. రష్యాలో పోలీసులు, ఫ్యాక్టరీ యజమానులు వీటిని "మ్యుటినీలు" అన్నారు. అన్ని దేశాల్లోనూ ఈ విడివిడి తిరుగుబాట్లు ఒకవైపు శాంతియుత సమ్మెలకూ, మరోవైపు కార్మికవర్గం తన విముక్తికోసం చేసే సర్వతోముఖ పోరాటాలకూ దారితీస్తాయి....

"అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణం నుండి ఉద్భవించే సమ్మెలు, ఆ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించే పోరాటానికి నాంది అవుతాయి. ధనిక పెట్టుబడిదారులతో ఆస్థిపాస్థుల్లేని కార్మికులు వ్యక్తిగతంగా తలపడితే కార్మికులు బానిసలుగా మారిపోతారు. కాని ఆస్థిపాస్థుల్లేని ఆ కార్మికులే ఐక్యమైతే పరిస్థితి మారిపోతుంది.....

"...ప్రతి సమ్మె పెట్టుబడిదారులకు – నిజమైన యజమానులు కార్మికులేగాని తాము కాదన్న విషయాన్ని గుర్తుచేస్తుంది. కార్మికులు రానురాను తమ హక్కులగురించి గొంతెత్తుతారు. ప్రతి సమ్మె కార్మికులకు – తమ పరిస్థితి నిరాశాజనకంగా లేదని, తాము ఒంటరి వాళ్లం కాదన్న విషయాన్ని గుర్తుచేస్తుంది.....

"సమ్మె కార్మికులకు – యజమానుల బలాన్ని, కార్మికుల్లో ఉన్న బలాన్ని అర్థంచేసుకోవడమెలాగో నేర్పుతుంది. తమ యజమానులగురించి మాత్రమే కాక, తమచెంతనున్న కార్మికులను గురించి మాత్రమే కాక మొత్తం యజమానులగురించి, మొత్తం పెట్టుబడిదారీ వర్గం గురించి, మొత్తం కార్మికవర్గం గురించి ఆలోచించడం నేర్పుతుంది. అనేక తరాల కార్మికుల శ్రమను దోచుకుని కోట్లు గడించిన ఫ్యాక్టరీ యజమాని కొంచెం వేతనం పెంచడానికి నిరాకరిస్తే, వేతనాన్ని ఇంకా తగ్గించేయడానికి ప్రయత్నిస్తే, దానికి కార్మికులు అడ్డం తిరిగినప్పుడు ఆకలిగొన్న వేలాదిమంది కార్మికుల కుటుంబాలను రోడ్లపాలు చేస్తే, అప్పుడు మొత్తం పెట్టుబడిదారీ వర్గం మొత్తం కార్మిక వర్గానికి శత్రువని కార్మికులకు స్పష్టమైపోతుంది. కార్మికులు తమ కాళ్లమీద, తమ సంఘటిత శక్తిమీద తాము నిలబడాలన్న విషయం కూడా వారికి స్పష్టమైపోతుంది. ఫ్యాక్టరీ యజమాని కార్మికులను తరచు మోసగిస్తుంటాడు. తాను వారిని ఉద్ధరించేవాడిలా పోజుపెడుతుంటాడు, చిన్న చిన్న రాయితీలు, పనికిరాని వాగ్దానాలతో తన దోపిడీని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తుంటాడు. ఒక్క సమ్మె ఈ మోసాన్ని ఒక్క దెబ్బతో బట్టబయలు చేస్తుంది. తమను ఉద్ధరించేవారు మేకతోలుకప్పుకున్న పులులన్న విషయాన్ని కార్మికులకు స్పష్టం చేస్తుంది.

"అంతేకాదు, సమ్మె పెట్టుబడిదారుల సహజలక్షణం పట్లనే కాకుండా ప్రభుత్వ, దాని చట్టాల లక్షణాలపట్ల కూడా కార్మికుల కళ్లు తెరిపిస్తుంది....ప్రతి సమ్మె – ప్రభుత్వం తమ శత్రువన్న అవగాహనను, కార్మికవర్గం ప్రజల హక్కులకోసం పోరాడ్డానికి సిద్ధపడాలన్న అవగాహనను కార్మికుల్లో అభివృద్ధిచేసి, పటిష్ట పరుస్తుంది.

"అందువల్ల సమ్మెలు, కార్మికులకు ఐక్యం కావడాన్ని నేర్పుతాయి. తాము ఐక్యంగా ఉంటేనే పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడగలమని వారికి తెలియజెప్పుతాయి. మొత్తం ఫ్యాక్టరీ యజమానుల వర్గానికి వ్యతిరేకంగా, ఏకపక్ష పోలీసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొత్తం కార్మిక వర్గం పోరాడాలన్న ఆలోచనను సమ్మెలు కార్మికులకు నేర్పుతాయి. ఈ కారణం చేతనే సోషలిస్టులు సమ్మెలను "యుద్ధ పాఠశాల"గా పేర్కొంటున్నారు. మొత్తం ప్రజానీకాన్ని, శ్రమజీవులందరినీ ప్రభుత్వాధికారుల కబంధ హస్తాలనుండి, పెట్టుబడి పీడననుండి విముక్తి చేయడానికి శత్రువుపై పోరాడ్డం ఎలాగో కార్మికులు నేర్చుకునే పాఠశాల సమ్మె."

**(వి.ఐ. లెనిన్ కలెక్టెడ్ వర్క్ ప్రోగ్రెస్ పబ్లిషర్స్,1964, మాస్కో, వాల్యూమ్ 4, పేజీ 310-319 నుండి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.9. Published on January 1, 2020